ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 29.03.2026 | సంపుటి :12 సంచిక : 249 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



యువత మత్తు వదలండి..

## మైదానం బాట పట్టండి

- తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు
- గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం
- ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు మంచి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. తమ కేబినెట్‌లోనూ మంచి క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారికి క్రీడలు ఓ ఉపశమనం అని సీఎం చెప్పుకొచ్చారు. తెలంగాణ ఒకప్పుడు క్రీడల రాజధానిగా ఉండేది. కానీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కనుమరుగైందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి

మిగతా 2లో..

# అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడి విచారణ

## సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తాం

గంగుల కమలాకర్, వద్దిరాజు రవిచంద్ర, రాఘవ కన్‌స్ట్రక్షన్‌తోపాటు మైనింగ్ కంపెనీలతో పాటు సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావు పైనా విచారణ జరిపిస్తాం

"అక్రమ మైనింగ్ విచారణకు ఈ ప్రభుత్వం సిద్ధం. గంగుల కమలాకర్, వద్దిరాజు రవిచంద్ర మైనింగ్‌పై విచారణ జరిపించేందుకు సిద్ధం. నేరెళ్లలో ఇసుక అక్రమాలు, ఎస్సీలపై చేసిన దాడులపై విచారణ జరిపిస్తాం. గతంలో మైనింగ్‌శాఖను పదేళ్లపాటు కేటీఆర్ తను గుప్పిట్లోనే పెట్టుకున్నారు. ఇసుక మాఫియా, అక్రమాలకు పాల్పడింది బీఆర్ఎస్ నేతలు, వారి బంధువులే. దాడులు చేయించి వద్దిరాజు రవిచంద్ర వంటివారిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు. స్వయంగా హరీశ్‌రావు తమ్ముడు మహేశ్వర్‌రావు ఇసుక మాఫియా నడిపారు. హరీశ్‌రావు సోదరుడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారు. మేం నిజాయతీగా పనిచేస్తూ మైనింగ్ ఆదాయం పెంచాం. ఆదాయ పంపకాల్లో తేడాలు వచ్చి సొంత సోదరినే బయటకు పంపారు. సోదరుల వ్యాపారా లతో మంత్రి పొంగులేటికి ఎలాంటి సంబంధం లేదు"

– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- అక్రమాలను సహించేది లేదు
- ప్రభుత్వ ఖజానాకు గండికొడితే ఊరుకోం
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటన



**హైదరాబాద్(జనంసాక్షి):**మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శాసనసభలో ప్రకటించారు. సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తాం. సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావుపై విచారణకు ప్రభుత్వం సిద్ధం అని తెలిపారు. గంగుల కమలాకర్ అక్రమ గ్రానైట్ మైనింగ్, వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్‌పై విచారణకు సిద్ధం అని ప్రకటించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్‌తోపాటు అన్నింటిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నాం అని తెలిపారు. విచారణలో నిజాలు నిగ్గుతేల్చి శాసనసభలో నివేదిక పెడతాం. ఇసుక మాఫియా, అక్రమాలకు పాల్పడింది బీఆర్ఎస్ నేతలు, వారి బంధువులే.

మిగతా 2లో..

## అక్రమ మైనింగ్‌తో కొల్లగొడుతున్నారు

- మంత్రి కంపెనీ అక్రమాలపై విచారణ చేయించండి
- నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోంది
- మైనింగ్ వ్యవహారంలో హౌజ్ కమిటీకి హరీశ్ డిమాండ్

2 లో..

## మూసీ కాలుష్య నిర్మూలనే మా లక్ష్యం

- అడ్డుకున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారు
- మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సీఎం రేవంత్

పిల్లలకు పౌష్టికాహారం అందితేనే

## భావిభవిష్యత్తు నిర్మాణం

- తొలిముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్
- అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ
- అంగన్‌వాడీ టీచర్లకు సెల్‌ఫోన్లు అందచేత

**హైదరాబాద్(జనంసాక్షి):** దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెడీ టూ కుక్ ఫుడ్ ఉప్మా, కిచిడీ మిక్స్ ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనుంది. ఈ సందర్భంగా

మిగతా 2లో..





హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో

## సరికొత్త అధ్యాయం

- ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో
- రైలు మార్గం విస్తరణకు మార్గం సుగమం
- అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం
- తీర్మానం ప్రవేశ పెట్టిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుంది. నగరవాసుల చిరకాల వాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన

మిగతా 2లో..


## యుద్ధ సవాళ్లను దీటుగా ఎదుర్కొంటున్నాం

- పశ్చిమాసియా సంఘర్షణ కారణంగా ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం
- దీనినుంచి దేశాన్ని రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది
- సంక్షోభ సమయంలోనూ ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోంది
- ఇలాంటి సమయంలోనే ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంతతను పాటించాలి
- నొయిడాలో పూర్తైన అంతర్జాతీయ విమానాశ్రయం తొలిదశను ప్రారంభించిన ప్రధాని మోదీ

**నొయిడా(జనంసాక్షి):**పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎదురవుతోన్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని నొయిడాలో పూర్తయిన అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోందని మోదీ అన్నారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందన్నారు.

మిగతా 2లో..





## మొజ్తబా కూడా మరణించి ఉండొచ్చు

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- తదుపరి తమ టార్గెట్ క్యూబా అంటూ హెచ్చరిక
- భూతల దాడులు చేయకుండానే

మా లక్ష్యాలు సాధిస్తాం: మార్కో రూబియో

**వాషింగ్టన్(జనంసాక్షి):**ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ మరణించి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా సైనిక దాడులు ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తుడిచిపెట్టాయని, దీంతో ఆ దేశంలో నాయకత్వం లేకుండా పోయిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికాలోని మయామిలో జరిగిన ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ ప్రయారిటీ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా కార్యకలాపాల వల్ల ఇరాన్ బలహీనపడిందని ట్రంప్ ఈ సందర్భంగా


మిగతా 2లో..

గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్

## భీకర దాడులు

- సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లపై క్షిపణుల వర్షం టెహ్రాన్
- ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడి
- లెబనాన్‌పైనా బాంబుల వర్షం
- యుద్ధరంగంలోకి హూతీలు
- అబుధాబిలో క్షిపణి శకలాలు పడి భారతీయులకు గాయాలు





ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌పై ఇరాన్ దాడిలో దెబ్బతిన్న విమానాలు.. ఈ ఘటనలో అనేకమంది అమెరికా సైనికులు గాయపడ్డారు

**టెహ్రాన్(జనంసాక్షి):**పశ్చిమాసియాలో దాడులు రోజురోజుకు మరింత తీవ్రమవుతున్నాయి. గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు కొనసాగిస్తోంది. తాజాగా సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలపై టెహ్రాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌పై జరిగిన దాడిలో అనేకమంది అమెరికా సైనికులు గాయపడగా, యుద్ధ విమానాలు దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాల్లో భారీ పేలుళ్లు సంభవించినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. దేశ రాజధాని రియాద్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లను

మిగతా 2లో..



## అమెరికా, ఇజ్రాయెల్‌లకు సహకరించొద్దు

- మీ గగనతలాలను ఉపయోగించుకుని ఆ దేశాలు మాపై దాడులు చేస్తున్నాయి
- శాంతి కావాలంటే.. మేం చెప్పినట్లు వినాలి
- గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక
- హార్మూజ్‌ను దాటిన మరో రెండు భారత నౌకలు

**టెహ్రాన్(జనంసాక్షి):**అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ కూడా గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తమ

మిగతా 2లో..

బెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే

## భాజపా పతనమే

ఎన్నికల్లో గెలిచిన వెంటనే అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఢిల్లీని స్వాధీనం చేసుకుంటా : మమతా బెనర్జీ



**కోల్‌కతా(జనంసాక్షి):**పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్‌లో శుక్రవారం రామనవమి శోభాయాత్ర జరుగుతున్న సమయంలో ఘర్షణలు చోటు చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమ బెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే భాజపా దేశంలో అధికారాన్ని కోల్పోవడం ఖాయమని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం దిల్లీని స్వాధీనం చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ముందుకువెళ్తానన్నారు. బెంగాల్‌లోని రాణిగంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగించి ప్రజలందరినీ బయటకు గెంటేస్తారని మమత ఆరోపించారు. తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటూ భాజపా నేతలు అన్ని హద్దులను దాటుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్'

మిగతా 2లో..



## బెట్టింగ్ ఉచ్చులో పడొద్దు

- ఐపీఎల్‌ను ఆస్వాదించండి
- బతుకును బలి చేసుకోవద్దు
- యువతకు సీపీ సజ్జన్నార్ హెచ్చరిక

**హైదరాబాద్(జనంసాక్షి):** బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా

మిగతా 2లో..

## పాకిస్థాన్ కూడా ఉగ్ర సంస్థలకు అడ్డానే!

- ఉగ్రవాద సంస్థలకు ఆ దేశం ఇంకా ఆశ్రయం కలిపిస్తోంది
- భారత్‌నూ లక్ష్యంగా చేసుకొని కార్యకలాపాలు కొనసాగిస్తూనే ఉంది
- అమెరికా చట్టసభలకు సంబంధించిన నివేదికలో వెల్లడి



**వాషింగ్టన్(జనంసాక్షి):** పాకిస్థాన్ ఎన్నో ఏళ్లుగా ఉగ్రవాదానికి కేంద్ర బిందువుగా ఉందని అనేక అంతర్జాతీయ నివేదికలు చెబుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా చట్టసభలకు సంబంధించిన ఓ పరిశోధనా నివేదిక కూడా ఇదే అంశాన్ని మరోసారి స్పష్టం చేసింది. ఉగ్రవాద సంస్థలకు పాకిస్థాన్ ఇంకా ఆశ్రయం కలిపిస్తోందని, భారత్‌నూ లక్ష్యంగా చేసుకొని కార్యకలాపాలు కొనసాగిస్తూనే ఉందని పేర్కొంది. పాకిస్థాన్‌లో ఉగ్రవాద, ఇతర మిలిటెంట్ గ్రూపులకు సంబంధించి అమెరికా కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ ఇటీవల ఓ నివేదిక విడుదల చేసింది. లష్కరే తయ్యిబా, జైషే మహ్మద్ వంటి ఉగ్ర సంస్థలు పాక్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని అందులో

మిగతా 9లో..

కాళేశ్వరం అవినీతికి

## బాధ్యుడు కేసీఆరే..

- అవినీతిని పట్టుకోవడంలో సీఎం రేవంత్ విఫలం
- కవితకు ప్రజాదరణ ఉంటే ఆదరిస్తారు
- కేంద్రమంత్రి బండి సంజయ్

**కరీంనగర్(జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు. మరోసారి తెలంగాణ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి, కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యం, కవిత కొత్త పార్టీ, తాజా రాజకీయ పరిణామాలపై బండి సంజయ్ తనదైన శైలిలో

మిగతా 2లో..

వానాకాలం వరకు ఎరువుకు

## ఢోకా లేదు

### యూరియా నిల్వలపై కేంద్రం క్లారిటీ

- వాడకాన్ని క్రమబద్ధీకరించాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం సూచన
- తెలంగాణలో ముందస్తు నిల్వలకు సన్నాహాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధం ప్రభావం భారత్‌లో యూరియా, ఇతర ఎరువుల పంపిణీపై అంతగా ఉండదని, రానున్న వర్షాకాలం సీజన్ ఆరంభం వరకు సరిపడా నిల్వలు ఉన్నాయని కేంద్రం స్పష్టం చేసింది. ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు 12 శాతం నుంచి 40 శాతం వరకు పెరిగినప్పటికీ మన దేశంలో పెంపు ప్రసక్తే లేదని పేర్కొంది. అంతర్జాతీయంగా సప్లై చైన్‌లో ఇబ్బందులు ఉన్నప్పటికీ, ముందస్తు నిల్వలపై దృష్టి సారించడం వల్ల సంక్షోభ నివారణకు తోడ్పడుతోందని తెలిపింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలను పంపింది. యూరియా, ఇతర ఎరువుల నిల్వల స్థితిగతులపై అన్ని రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని, వాటి వాడకాన్ని క్రమబద్ధీకరించాలని, జీవ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలని కేంద్రం సూచించింది. ప్రస్తుతం మన దేశంలో యూరియా నిల్వలు 61.14 లక్షల టన్నుల మేరకు ఉన్నాయి.

మిగతా 2లో..



# యువత మత్తు వదలండి.. మైదానం బాట పట్టండి

పిలుపునిచ్చారు. 'యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు యత్నిస్తున్నాం. ఫామ్‌హౌస్‌లు, పబ్బులు వంటివాటికి యువత దూరంగా ఉండాలి. బీఆర్ఎస్ ఆలోచనలు ఫామ్‌హౌస్‌లు, పబ్బుల్లో పార్టీలు, విందులే' అని ప్రతిపక్ష పార్టీపై విమర్శలు గుప్పించారు రేవంత్. ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం సహా రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపుతున్నామన్న ఆయన.. వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. 'స్పోర్ట్స్, కల్చరల్ మీట్–2026' పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. లెమన్ అండ్ స్పూన్ పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి బహుమతి గెలుచుకోగా.. ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, రాగమయి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం రాజకీయాల్లో మునిగి తేలుతూ, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం విరామం లేకుండా పని చేసేవారికి ఇది అద్భుత అవకాశం అన్నారు. ఇక్కడ అద్భుతంగా ఆడలేకపోవచ్చు గానీ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఎల్బీ స్టేడియం వేదిక అవుతుందన్నారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన వారు మంత్రివర్గంలో ఉన్నారు. క్రికెట్‌లో దేశానికి వన్నె తెచ్చిన అజారుద్దీన్ మంత్రివర్గ సభ్యుడిగా ఉన్నారు. రంజీ క్రికెట్ ఆడిన వాకిటి శ్రీహరి క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు. ఒకప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కరవైంది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహించాం అన్నారు. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చాం అని అన్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు వివాదం సృష్టించే ప్రయత్నం చేశారు. మెస్సీ ఇక్కడికి వస్తే.. హైదరాబాద్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది. ఎల్బీ స్టేడియం రాజకీయ కార్యకలాపాలకే పరిమితమైంది. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియంను ప్రపంచ క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేయబోతున్నాం. బేగంపేట హాకీ క్రీడా మైదానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. ఫుట్‌బాల్‌లో గతంలో దేశానికి మెడల్స్ తెచ్చిన వారిలో నలుగురు మన ప్రాంతానికి చెందినవారున్నారు. మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని సంకల్పించాం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా**

## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్

**హైదరాబాద్(జనంసాక్షి):** పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. పోలీస్ నియామకాల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడు అయితే ఎక్కడున్నా లడ్డూ వస్తుందని అంటారు.. కానీ ముఖ్యమంత్రి వద్దనే పోలీసు శాఖ ఉన్నప్పటికీ ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడే వారు పోలీసులు అని.. రాష్ట్రం కోసం సమాజం పనిచేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులను కేసీఆర్ ఎంతగానో గౌరవించారని అన్నారు. 40, 50 పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. కొత్త కమిషనరేట్లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సంక్షేమంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. కొన్ని జిల్లాలకు మాత్రమే టీఏలు, డీఏలు ఇస్తున్నారని తెలిపారు.

## కాళేశ్వరం అవినీతికి బాధ్యుడు కేసీఆరే..

సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపి పెట్టుకొని ప్రాజెక్టును డిజైన్ చేసింది ఆయనే. ఈ ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం. ప్రజలు ప్రతి విషయాన్నీ గమనించి సరైన నిర్ణయం తీసుకుంటున్నారు' అని అన్నారు.

## యుద్ధ సవాళ్లను దీటుగా ఎదుర్కొంటున్నాం

ఈ సంఘర్షణ కారణంగా.. ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడిందన్నారు. ప్రతి దేశం ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. దీనినుంచి దేశాన్ని రక్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలు, రైతులపై యుద్ధ భారం పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఇక, ఇలాంటి సమయంలో ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంతతను పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోన్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంపై ప్రజలను భయాందోళనకు గురిచేసే తప్పుడు ప్రచారాలు చేయొద్దని రాజకీయ పార్టీలను కోరారు. తమ ప్రభుత్వ విధానాలు.. దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయన్నారు.

## పాకిస్థాన్ కూడా ఉగ్ర సంస్థలకు అడ్డానే!

పాకిస్థాన్ ఎన్నో ఏళ్లుగా ఉగ్రవాదానికి కేంద్ర బిందువుగా ఉందని అనేక అంతర్జాతీయ నివేదికలు చెబుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా చట్టసభలకు సంబంధించిన ఓ పరిశోధనా నివేదిక కూడా ఇదే అంశాన్ని మరోసారి స్పష్టం చేసింది. ఉగ్రవాద సంస్థలకు పాకిస్థాన్ ఇంకా ఆశ్రయం కలిపిస్తోందని, భారత్‌నూ లక్ష్యంగా చేసుకొని కార్యకలాపాలు కొనసాగిస్తూనే ఉందని పేర్కొంది.పాకిస్థాన్‌లో ఉగ్రవాద, ఇతర మిలిటెంట్ గ్రూపులకు సంబంధించి అమెరికా కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ ఇటీవల ఓ నివేదిక విడుదల చేసింది. లష్కరే తయ్యిబా, జైషే మహ్మద్ వంటి ఉగ్ర సంస్థలు పాక్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని అందులో పేర్కొంది. అంతేకాదు, తీవ్రవాదం వల్ల ఆ దేశం ప్రభావితమైందని పేర్కొంది. 2021లో అఫ్గాన్‌లో తాలిబన్లు అధికారం చేజిక్కించుకున్న తర్వాత ఈ ఉగ్ర సంస్థలు మరింత బలపడ్డాయని అన్నారు, దాడులు గణనీయంగా పెరిగాయని వెల్లడించింది.పాక్‌లో ఉన్న ఉగ్ర సంస్థలను కాంగ్రెషనల్ నివేదిక వివిధ వర్గాలుగా విభజించింది. దేశీయంగా, అంతర్జాతీయంగా, కొన్ని అఫ్గాన్‌కు సంబంధించి, భారత్–కశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకొని ఆయా సంస్థలు పని చేస్తున్నాయని తెలిపింది. అల్‌ఖైదా తీవ్రంగా బలహీనపడినప్పటికీ.. ఇతర సంస్థలతో కలిసి కార్యకలాపాలు కొనసాగిస్తోందని పేర్కొంది. తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) అనేది ఆ దేశంలో అత్యంత ప్రాణాంతక ఉగ్ర సంస్థగా ఉందని తెలిపింది.

# అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణ

వద్దిరాజు రవిచంద్ర వంటివారిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు. స్వయంగా హరీశ్‌రావు తమ్ముడు మహేశ్వర్‌రావు ఇసుక మాఫియా నడిపారు. అతడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతూ సాగే అక్రమ మైనింగ్ వ్యవహారాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి ఎక్కడ గండి పడినా, ఖనిజ సంపద దోపిడీకి గురైనా తాము చూస్తూ ఊరుకోబోమని, అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన రాఘవ కన్స్ట్రక్షన్స్ అంశంపై ముఖ్యమంత్రి సాక్ష్యాధారాలతో సమాధానమిస్తూ, ఇప్పటికే ఆ సంస్థకు నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ జరిపిన విచారణలో భాగంగా రాఘవ కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుండి భారీ మొత్తంలో పన్నులు వసూలు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సినరేజ్ ఛార్జీల కింద రూ. 1,52,97,825, అలాగే పర్మిట్ ఫీజు కింద రూ. 22,25,446 మొత్తాన్ని ప్రభుత్వం ఇప్పటికే ఆ సంస్థ నుండి కట్టించుకుందని ఆయన సభకు తెలిపారు. ఎవరైనా మంత్రుల పేర్లు చెప్పుకుని లేదా రాజకీయ పలుకుబడితో పన్నులు ఎగ్గొట్టాలని చూస్తే చట్టం తనపని తాను చేసుకుపోతుందని, ఖజానాకు రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంలో రాజీపడేది లేదన్నారు

## పిల్లలకు పౌష్టికాహారం అందితేనే భావిభవిష్యత్తు నిర్మాణం

సీఎం మాట్లాడుతూ.. బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తోంది. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాం. సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని సీఎం అన్నారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రతఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోంది. అందుకే తాజాగా బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారభించాము. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. అంగన్వాడీ భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ ఛైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో సరికొత్త అధ్యాయం

అడుగు వేసింది. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్–1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల, కొత్తగా చేపట్టబోయే ఫేజ్–2 పనులకు అనేక సాంకేతిక , చట్టపరమైన అడ్డంకులు ఎదురవుతున్నాయి.

## మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం

**రంగారెడ్డి(జనంసాక్షి):** రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతామని తెలిపారు

## అక్రమ మైనింగ్‌తో కొల్లగొడుతున్నారు

**హైదరాబాద్(జనంసాక్షి):** అక్రమ మైనింగ్ ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో దుమారం చెలరేగింది. అక్ర మైనింగ్‌పై చర్యలు తీసుకోవడం లేదంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. అసెంబ్లీలో మైనింగ్ అంశంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కంచె చేను మేసినట్లు... రక్షకుడే భక్షకుడిలా మారినట్లు అక్రమ మైనింగ్ జరుగుతోంది' అని విమర్శించారు. నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోందని.. రాఘవ కన్స్ట్రక్షన్స్ నడుపుతున్న క్రషర్లకు ఎలాంటి అనుమతులు లేవని ఆయన ఆరోపించారు. క్రషర్ నడపాలంటే 8 రకాల అనుమతులు కావాలని.. కానీ నిబంధనలు పాటించకుండా నడుపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయలు గండిపడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మైనింగ్ శాఖ ఇప్పటికే షోకాజ్ నోటీసులు, డిమాండ్ నోటీసులు ఇచ్చినా చర్యలు జరగడం లేదని తెలిపారు.

# బెట్టింగ్ ఉచ్చులో పడొద్దు

ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్–2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమాయక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.

## బెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే భాజపా పతనమే

ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఓటరు జాబితా నుంచి ఓటర్లను తొలగించడానికి ఈసీ ని భాజపా పావులా వాడుకుంటోందని, రాష్ట్రంలో భాజపా ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. రాణిగం జ్‌లోని పర్వత ప్రాంతాల్లో తరచూ కొండచరియలు విరిగి పడుతుం డడం వల్ల అక్కడి ప్రజలు ప్రాణా లు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలను వీడి సురక్షిత ప్రాంతాలకు వెళ్లే వారికి తమ ప్రభుత్వం గృహవసతితో పాటు రూ.10 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని హామీ ఇచ్చారు.

## అమెరికా, ఇజ్రాయెల్‌లకు సహకరించొద్దు

పొరుగు దేశాలకు హెచ్చరికలు చేశారు. గల్ఫ్ దేశాల్లో దాడులు ఆగాలన్నా.. శాంతి, అభివృద్ధి నెలకొనాలన్నా తాము చెప్పినట్లు వినాలన్నారు. ఆయా దేశాల గగనతలాలను వినియోగించుకొని శత్రువులు తమపై దాడి చేస్తున్నారన్నారు. తమ గగనతలాలను వినియోగించు కోవడానికి అమెరికా, ఇజ్రాయెల్‌లకు అనుమతి ఇవ్వొద్దని బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్, ఇతర పశ్చిమాసియా దేశాలకు సూచించారు.తాము ఏ దేశంపైనా ముందస్తు దాడులు చేయబోమని అనేక సార్లు స్పష్టం చేసినట్లు పెజెష్కియాన్ పేర్కొన్నారు. కానీ తమ మౌలిక సదుపాయాలు, అణు, ఆర్థిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటే మాత్రం చూస్తూ ఊరుకోబోమని.. ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. శత్రు స్థావరాలు భూస్థాపితం అయ్యే వరకు దాడులు కొనసాగిస్తామన్నారు. శత్రువులకు సహకరించిన వారిని కూడా వదలబోమన్నారు. భారత్ సహా తమ మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఎల్పీజీని మోసుకొస్తున్న మరో రెండు భారత నౌకలు శనివారం హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 90,000 టన్నులకు పైగా ఎల్పీజీ (వంటగ్యాస్)ని తీసుకువస్తున్న బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్ అనే రెండు నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయన్నాయి. మరో ఐదు భారతీయ ట్యాంకర్లు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సమీపంలోని జలాల్లో ఇరాన్ అనుమతి కోసం వేచి ఉన్నట్లు తెలుస్తోంది.

## వానాకాలం వరకు ఎరువుకు ఢోకా లేదు

ఇది గతేడాది ఇదే సమయంలో ఉన్న 55.22 లక్షల టన్నుల కంటే 5.92 లక్షల టన్నులు ఎక్కువ. మరోవైపు దేశీయ ఉత్పత్తి కూడా 23 శాతం పెరిగి, దినసరి 67,000 టన్నులకు చేరింది. యుద్ధ వాతావరణం ఉన్నప్పటికీ ఇటీవల ఓడరేవులకు 10 లక్షల టన్నుల మేర యూరియా చేరుకుంది. దేశీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నెలాఖరు వరకు యూరియా దిగుమతుల అనుమతిని కేంద్రం పొడిగించింది. యూరియా ఉత్పత్తికి కీలకమైన సహజ వాయువును ఫెర్టిలైజర్ ప్లాంట్లకు నిరంతరం సరఫరా చేయాలని ఇటీవల కీలక ఆదేశాలు జారీ చేసింది.మన దేశంలో యూరియా తయారీ ప్రక్రియలో ఉపయోగించే సహజ వాయువులో 41 శాతం ఖతార్ నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. పశ్చిమ ఆసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఆ సరఫరా నిలిచిపోయి, ఉత్పత్తి తగ్గింది. దీంతో కేంద్రం రష్యా, మొరాకో, బెలారస్ తదితర దేశాల నుంచి ఎరువులు, గ్యాస్ కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తోంది.దేశానికి యూరియా దిగుమతులు పశ్చిమాసియా దేశాలైన ఒమన్ (46%) నుంచి అత్యధికంగా, యూఏఈ(6%), సౌదీ అరేబియా(9%)ల నుంచి ఉంటాయి. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఈ మూడు దేశాల నుంచి దిగుమతులు ఆగిపోయాయి. మే వరకు సరిపడా నిల్వలు ఉన్నప్పటికీ, జూన్ నుంచి డిమాండ్ పెరిగే అవకాశం ఉంది

# గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ భీకర దాడులు

కూల్చివేసినట్లు సౌదీ అరేబియా రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. టెహ్రాన్ దాడుల్లో కువైట్‌లోని పలు వాణిజ్య భవనాలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఐక్యరాజ్యసమితి అభ్యర్థన మేరకు హర్మూజ్ జలసంధి గుండా మానవతా సాయం, వ్యవసాయ సరకుల రవాణాను అనుమతించడానికి ఇరాన్ అంగీకరించింది. సరిగ్గా నెల రోజుల కిందట ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు మొదలుపెట్టిన విషయం తెలిసిందే. ఈ దాడులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. తాజాగా ఇరాన్‌లోని బాలిస్టిక్ క్షిపణులు, ఇతర ఆయుధాలను ఉత్పత్తి చేసే ప్లాంట్లు, క్షిపణి ప్రయోగకేంద్రాలే లక్ష్యంగా దాడులు చేపట్టినట్లు రక్షణ మంత్రి కాట్జ్ పేర్కొన్నారు. తమ దాడుల్లో అణ్వాయుధాల ముడి పదార్థాలను శుద్ధి చేసే కర్మాగారాలు ధ్వంసమయ్యాయని.. ఇది టెహ్రాన్ అణు కార్యక్రమానికి పెద్ద దెబ్బ అని ఇజ్రాయెల్ తెలిపింది. దాడులపై ఇరాన్ స్పందిస్తూ.. టెల్ అవీల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది.ఇజ్రాయెల్–అమెరికా దాడుల్లో ఇరాన్‌లోని పలు ఆసుపత్రులు, 82వేలకు పైగా పౌర నివాసాలు దెబ్బతిన్నాయని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ వలసల సంస్థ వెల్లడించింది. ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే.. తీవ్రమైన విపత్తు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించింది. హెజ్‌బొల్లా దాడుల నుంచి తమ ఉత్తర సరిహద్దు పట్టణాలను రక్షించుకునేందుకు ఆయా ప్రాంతాల్లో ఇజ్రాయెల్ తమ బలగాలను మోహరించింది. హెజ్‌బొల్లా స్థావరాలే లక్ష్యంగా చేపట్టిన దాడుల్లో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు.

**అబుధాబిలో క్షిపణి శకలాలు పడి..**

**భారతీయులకు గాయాలు**

గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఈ క్షిపణి శకలాలు పడి యూఏఈలోని అబుధాబిలో ఐదుగురు భారతీయులు గాయపడ్డారు ఈ విషయాన్ని అక్కడి అధికారులు ధ్రువీకరించారు. తమవైపు దూసుకొచ్చిన బాలిస్టిక్ క్షిపణిని గగనతల రక్షణ వ్యవస్థలు సమర్థవంతంగా అడ్డుకున్నట్లు యూఏఈ రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది. క్షిపణి శకలాలు కెజాద్‌లో రెండుచోట్ల పడటంతో పెద్దఎత్తున మంటలు చెలరేగినట్లు వెల్లడించింది. వాటిని అదుపులోకి తీసుకొచ్చేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తెలిపింది. ఈ క్రమంలో అక్కడ ఉన్న ఐదుగురు భారతీయులు గాయపడ్డారని ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపింది . పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకి పెరుగుతున్నాయి. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతోన్న యుద్ధంలోకి తాజాగా హూతీలు కూడా ఎంట్రీ ఇచ్చినట్లు తెలుస్తోంది. శనివారం యెమెన్ నుంచి ఓ క్షిపణి దూసుకొచ్చిందని ఐడీఎఫ్ పేర్కొంది. ఇరాన్‌కు మద్దతు గల హూతీలు దక్షిణ ఇజ్రాయెల్ పైకి బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించగా.. తమ వైమానిక రక్షణదళాలు సమర్థవంతంగా అడ్డుకున్నాయని వెల్లడించింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని తెలిపింది. అయితే, ఈ దాడి తామే చేశామని హూతీలు ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై చేపట్టిన యుద్ధం నెలరోజులు పూర్తి చేసుకుంది. ఓవైపు దాడులు, మరోవైపు కాల్పుల విరమణకు సంప్రదింపులు జరుగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌కు మద్దతు తెలిపే యెమెన్‌కు చెందిన హూతీలు తాజాగా యుద్ధంలోకి దిగారు. ఇజ్రాయెల్‌లోని సైనిక స్థావరాలే లక్ష్యంగా క్షిపణి దాడులు జరిపారు. వీటిని హూతీల ప్రతినిధి యాహ్యా సారె ధ్రువీకరించారు.దీనికి కొన్ని గంటల ముందే.. యెమెన్ నుంచి తమ భూభాగంపైకి క్షిపణి దూసుకొచ్చిందని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. అలా వచ్చిన వాటిని తమ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని తెలిపింది. హూతీల దాడితో ప్రాణ, ఆస్తి నష్టం కలిగినట్లు ఎటువంటి వార్తలు రాలేదు. అయితే, యెమెన్ నుంచి వచ్చిన క్షిపణిని ఇజ్రాయెల్ అడ్డుకొని ఉండవచ్చని అంతర్జాతీయ మీడియా పేర్కొంది.గాజాపై ఇజ్రాయెల్ దాడులు చేసిన సమయంలో హూతీలు క్రియాశీలంగా వ్యవహరించారు. పాలస్తీనీయన్లకు మద్దతుగా ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఎడెన్ మార్గంలో వెళ్లే నౌకలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశారు. కానీ, అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ హత్య, తదనంతరం భీకర దాడులు జరుగుతున్నప్పటికీ హూతీలు మాత్రం మౌనంగా ఉండిపోవడం చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే తాజాగా దాడులు జరపడం గమనార్హం.

**సౌదీ యువరాజుకు ప్రధాని మోదీ ఫోన్**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ.. ఆయా దేశాధినేతలతో ప్రధాని మోదీ సంప్రదింపులు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సౌదీ అరేబియా యువరాజు, ప్రధాని మహ్మద్ బిన్ సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంధన మౌలిక సదుపాయాలపై జరుగుతోన్న దాడులను ప్రధాని మోదీ ఖండించారు. నౌకాయానం స్వేచ్ఛగా కొనసాగడం, ఆయా మార్గాలు సురక్షితంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సౌదీ అరేబియాలో భారతీయులకు తోడ్పాటు అందిస్తున్నందుకు యువరాజుకు ధన్యవాదాలు తెలిపారు.ఇరాన్‌పై ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్‌లు సంయుక్తంగా దాడులు మొదలుపెట్టాయి. వీటికి ప్రతీకారంగా గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు చేస్తోంది. దీంతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఇరాన్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, మలేషియా దేశాధినేతలతో ఇటీవల సంభాషించిన ప్రధాని మోదీ.. పరిస్థితులపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారు.

# మొజ్తబా కూడా మరణించి ఉండొచ్చు

చెప్పుకొచ్చారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలను నిర్మూలించడంలో అమెరికా దళాలు అంచనాలకు మించి పనిచేశాయని ఆయన అన్నారు. 'ఇరాన్ నౌకాదళం అంతమైపోయింది. అదంతా అఖాతపు అడుగున మునిగిపోయింది.. వారి వైమానిక దళం పూర్తిగా, సమూలంగా నాశనమైంది. వారి విమాన నిరోధక, సమాచార ప్రసార సామర్థ్యాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. అంతేకాదు, ఇరాన్ నాయకత్వం, సైనిక శక్తి కూడా నాశనమైంది. వారి నాయకులందరూ చనిపోయారు.. వారి సుప్రీం లీడర్ ఇక సర్వోన్నతుడు కాదు. ఆయన మరణించారని ట్రంప్ అన్నారు. ఇరాన్ ఆయుధ నిల్వలను తాము చిన్నాభిన్నం చేస్తున్నామని, ఎవరూ ఊహించని స్థాయిలో వారి క్షిపణి, డ్రోన్ కర్మాగారాలను ధ్వంసం చేస్తున్నామని ట్రంప్ తెలిపారు. వారి రక్షణ పారిశ్రామిక స్థావరాన్ని తుడిచిపెట్టేశామని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఆయతొల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత, ఆయన కుమారుడైన మొజ్తబా ఖమేనీ ఇరాన్ బాధ్యతలు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి. ఆయన ఇరాన్ రాజకీయాల్లో అత్యంత శక్తివంతుడిగా, వివాదాస్పద వ్యక్తిగా పేరు పొందారు. అయితే, ఆయన బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఇటువంటి వార్తలు రావడం గమనార్హం. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా ధృవీకరించలేదు, ఖండించలేదు. సాధారణంగా ఇరాన్ తన అత్యున్నత నాయకుల ఆరోగ్య స్థితిగతులను అత్యంత రహస్యంగా ఉంచుతుంది. గతంలో కూడా అలీ ఖమేనీ ఆరోగ్యంపై అనేక పుకార్లు వచ్చినప్పుడు ఇరాన్ నిశ్శబ్దంగానే ఉంది. ఇదే క్రమంలో వెనిజులా, ఇరాన్ తర్వాత క్యూబాపైనే అమెరికా సైన్యం దాడులు జరపనున్నట్లు ట్రంప్ హెచ్చరించారు. వెనిజులా, ఇరాన్‌పై అమెరికా సైన్యాలు విజయం సాధించాయని ట్రంప్ గొప్పగా చెప్పుకున్నారు. అమెరికా సైన్యపు విజయాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఈ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం ఇటీవలి వారాల్లో క్యూబా నాయకత్వంలోని కొన్ని వర్గాలతో చర్చలు ప్రారంభించాం.. అమెరికా సైన్యం క్యూబాపై ప్రత్యక్ష సైనిక చర్యకు పాల్పడవచ్చని ' అని కూడా ఈ సందర్భంగా ట్రంప్ చెప్పారు. కొన్నిసార్లు సైన్యాన్ని ఉపయోగించాల్సి వస్తుంది. అన్నట్టు తర్వాతి వంతు క్యూబాదే' అని అన్నారు. ఈ మాటలు అన్నతర్వాత ట్రంప్ మరలా.. నేను అలా అనలేదని అనుకోండి అని ట్రంప్ అన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో జరగబోయే సైనిక ఘర్షణను నివారించే ప్రయత్నంలో తమ దేశం అమెరికాతో చర్చలు జరుపుతోందని క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ అంగీకరించారు. ఇప్పటికే అమెరికా ఆంక్షల వల్ల క్యూబాకు సరఫరా అయ్యే చమురు దిగుమతులు తగ్గాయి. ఇరాన్‌పై యుద్ధం విషయంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు చేశారు. అనుకున్న దానికంటే ముందుగానే.. మరికొన్ని వారాల్లో ఆ దేశంపై దాడులు ముగిస్తామన్నారు. టెహ్రాన్‌పై భూతల దాడులు చేయకుండానే తాము అనుకున్న లక్ష్యాలను సాధించగలమని ధీమా వ్యక్తంచేశారు. రాబోయే రెండు వారాల్లో తమ దాడులు పూర్తయ్యేసరికి టెహ్రాన్ చరిత్రలో ఎన్నడూ లేనంత బలహీనంగా మారిపోతుందన్నారు. ఫ్రాన్స్‌లో ఉ7 ప్రతినిధులతో సమావేశమైన అనంతరం రూబియో విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

# చిన్నారులను హత్య చేసిన తల్లి

- పిల్లల గొంతు నులిమి తల్లి ఉరేసుకొని ఆత్మహత్య
- గతంలో రోడ్డు ప్రమాదంలో భర్త మృతి
- జీవితంపై విరక్తి చెంది పిల్లలతో సహా బలవన్మరణం
- కంది మండలం జులకల్ గ్రామంలో సంఘటన





సంగారెడ్డి, మార్చి 28 (జనంసాక్షి) : అభం శుభం తెలియని చిన్నారుల గొంతు నులిమి హత్య చేసిన తల్లి తాను ఉరి వేసుకుని బలవన్మరణం చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లాలోని కంది మండలం జుల కల్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని మక్త అల్లూరు గ్రామానికి చెందిన మమత(35) ను అదే మండలంలోని జులకల్ గ్రామానికి చెందిన ప్రవీణ్‌తో వివాహం జరిగింది. రోడ్డు ప్రమాదంలో భర్త ప్రవీణ్ ప్రాణాలు కోల్పోగా పిల్లల మణికంఠ (6) ప్రణయశ్రీ (4) తో తన తల్లిదం డ్రులు, మేనత్తతో కలిసి జుల కల్ గ్రామంలో ఉంటుంది. శనివారం తన మేనత్త పింఛన్ డబ్బుల కోసం వెళ్లగా ముందుగా తన ఇద్దరు పిల్లలైన మణికంఠ, ప్రణయశ్రీలను గొంతు నులిమి చంపి. తర్వాత తానూ ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మనం చేసుకుంది. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, డీఎస్పీ సత్తయ్యగౌడ్ పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పోలీస్ ఫుట్‌బాల్‌లో రాజస్థాన్ గెలుపు



- మహిళల విభాగంలో జార్ఖండ్‌పై ఎస్ఎస్‌బీ గోల్స్ సునామీ

హైదరాబాద్, మార్చి 28 (జనంసాక్షి) : నగర వేదికగా జరుగుతున్న 74వ బి.ఎన్. మల్లిక్ మెమోరియల్ ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో శనివారం ఉదయం జరిగిన మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. పురుషుల విభాగంలో తెలంగాణ జట్టు పై రాజస్థాన్ జట్టు తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఆర్టిలరీ గ్రౌండ్‌లో జరిగిన గ్రూప్–ఎఫ్ మ్యాచ్‌లో రాజస్థాన్ 3–0 తేడాతో తెలంగాణపై విజయం సాధించింది. ఆరంభం నుంచే వ్యూహాత్మక దాడులతో విరుచుకుపడిన రాజస్థాన్ ఆటగాళ్లు, తెలంగాణ రక్షణ శ్రేణిని ఛేదిస్తూ వరుసగా మూడు గోల్స్ చేసి మ్యాచ్‌ను ఏకపక్షం చేశారు. మరోవైపు శ్రీనిధి ఎఫ్.సి మైదానంలో జరిగిన గ్రూప్–బి పోరులో బి.ఎస్.ఎఫ్ జట్టు 3–0 గోల్స్ తేడాతో అరుణాచల్ ప్రదేశ్‌ను ఓడించింది. గ్రూప్–డి లో జరిగిన రసవత్తర పోరులో పంజాబ్ 2–1తో ఉత్తరప్రదేశ్‌ను ఓడించింది. ఇతర మ్యాచ్‌ల్లో తమిళనాడుపై కేరళ (2–0), ఉత్తరాఖండ్‌పై మిజోరాం (3–0) జట్లు సునాయాస విజయాలను నమోదు చేశాయి. ఇక మహిళల విభాగంలో ఎస్ ఎస్ బి జట్టు మైదానంలో గోల్స్ సునామీ సృష్టించింది. హైదరాబాద్ ఎఫ్.సి గ్రౌండ్‌లో జరిగిన గ్రూప్–ఏ మ్యాచ్‌లో ఎస్ఎస్‌బీ ఏకంగా 16–0 తేడాతో జార్ఖండ్ జట్టును మట్టికరిపించి టోర్నీలోనే భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఇదే గ్రూపులో జరిగిన మరో మ్యాచ్‌లో సి.ఐ.ఎస్.ఎఫ్ జట్టు 1–0తో సి.ఆర్.పి.ఎఫ్ పై విజయం సాధించింది. అదేవిధంగా, అస్సాం రైఫిల్స్ 5–0 స్కోర్ తో చండీగఢ్ పై, ఐటిబిపి ఆర్పిఎఫ్ పై 2–0 స్కోర్ తోను, జమ్ము కాశ్మీర్ కర్ణాటక పై 2–0 స్కోర్ తోను, త్రిపుర మధ్యప్రదేశ్ పై 3–1 స్కోర్ తోను విజయం సాధించాయి.

# అత్యవసరంగా ల్యాండ్ అయిన ఇండిగో

న్యూఢిల్లీ, మార్చి28 (జనంసాక్షి) : విశాఖపట్నం నుంచి ఢిల్లీకి ప్రయాణిస్తున్న ఇండిగో విమానం శనివారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. విమానం గాలిలో ఉండగా ఒక ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పైలట్లు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో రన్‌వే 28 వద్ద అధికారులు పూర్తిస్థాయి ఎమర్జెన్సీ ప్రకటించారు. విమానాశ్రయం వద్ద ముందు జాగ్రత్తగా అగ్నిమాపక యంత్రాలు, వైద్య బృందాలను సిద్ధంగా ఉంచారు. మొత్తం 160 మంది ప్రయాణికులతో ఉన్న ఈ విమానం ఉదయం 10:59 గంటలకు సురక్షితంగా ల్యాండ్ అవ్వడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులందరూ క్షేమంగా ఉన్నారని, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్ వర్గాలు తెలిపాయి.

# హామీలు నేరవేర్చక కాలయాపానా?

**తెలంగాణ రాష్ట్ర జేఏసీ ఉద్యమకారుల, ఉద్యోగ సంఘాల అసెంబ్లీ ముట్టడి**



హైదరాబాద్ (జనంసాక్షి) : అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కాలయాపన చేస్తున్నందుకు నిరసనగా తెలంగాణ రాష్ట్ర జేఏసీ ఉద్యమకారుల, ఉద్యమ సంఘాలు అసెంబ్లీని ముట్టడించాయి. తెలంగాణ స్వీయ అస్తిత్వ పునాదిగా భాషా సంస్కృతుల పరిరక్షణకై, మోసాలు దోపిడీ పీడన, అణచివేత, వివక్షలపై ప్రతిఘటణగా ప్రజా పోరాటాలు కొనసాగాయని, ఈ విస్తృత సార్వత్రిక పోరాట లక్ష్యాన్ని సంక్షిప్తంగా చెప్పడానికి ప్రొఫెసర్ జయశంకర్ నిర్దిష్టంగా నీళ్లు నిధులు నియామకాలకై తెలంగాణ అస్తిత్వ పోరాటం చేశారని, 2014లో మనం సాధించుకున్నది కేవలం భౌగోళిక తెలంగాణ మాత్రమే, యుద్ధం ఇంకా మిగిలే ఉంది అన్న సంగతి మనం మర్చిపోరాదని నాయకులు హెచ్చరించారు. ప్రజలు కేంద్రంగా, బావ వైరుధ్యాల నడుమ సామాజిక రాజకీయ అసమానతనలపైన, ప్రాంతీయుల దోపిడీ మోసాల పైన, ప్రాంతీయ వనరుల, అడవుల పరిరక్షణకై, ఈ యుద్ధం కొనసాగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తెలంగాణను సాధించినటువంటి ఉద్యమకారులను విస్మరించడం అన్యాయం, ఎన్నో సాధక బాధలను ఎదుర్కొంటూ తెలంగాణను సాధించిన తర్వాత, కూడా నిలువ నీడలేని ఉద్యమకారులు ఎందరో ఉన్నారని, పిల్లలను చదివించలేని స్థితిలో వైద్యం కోసం ఖర్చులు వేల్లదీయలేని స్థితిలో సతమతమవు తున్నారని, వీరిని ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం కింద, మొన్నటి ఎన్నికలలో హామీలు ఇచ్చిందని, అందుకే గత పది సంవత్సరాల దోపిడీ పరిపాలనను కాదని కొత్త నాయకత్వాన్ని తెచ్చుకున్నామని, వీళ్ళు వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న హామీల నెరవేర్పులో తస్సారం చూస్తూ ఉన్నారని తెలిపారు. గత నెలలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించిన విధంగా, ఉద్యమకారుల హామీల నెరవేర్పుకై క్యాబినెట్ సబ్ కమిటీని వెంటనే నియమించాలని, అభయ హస్తం స్కీమ్ కింద అప్లై చేసినటువంటి ఉద్యమకారులందరికీ 250 గజాల ఇంటి స్థలాన్ని, అదేవిధంగా అర్హులైన వారికి సుమారు 25 వేల రూపాయల పెన్షన్, ఇవ్వాల్సిందిగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, అన్ని ఉద్యమ సంఘాలు డిమాండ్ చేశాయి. జేఏసీ చైర్మన్ రామగిరి ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీరకాయల పోచయ్య మధుసూదన్, వశపాక నరసింహ, పాశం భరత్ రెడ్డి, షాబాద్ అలీ ఖాన్, మోతే రమేష్ వర్మ, తదితరులు పాల్గొన్నారు. ప్రఫుల్ రామిరెడ్డి, సుల్తాన్ యాదగిరి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నుండి, అదేవిధంగా సామా అంజిరెడ్డి తొలి మలి దశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం నుంచి పాల్గొన్నారు.

# బాసర ఐఐఐటీపై బద్నాం ఆపండి

- గత తప్పిదాలను ప్రస్తుత బాధ్యులకు అంటగట్టడం సరికాదు
- అనారోగ్యం, ఇతర వేరే కారణాలతో విద్యార్థులు మరణిస్తే దుష్ప్రచారాలు సహేతుకం కాదు




హైదరాబాద్ (జనంసాక్షి) : గొంతులేని వాళ్ల తరఫున గొంతెత్తాల్సింది పోయి, తమ జేబులు నింపుకునే అక్రమార్జన వృత్తిగా మారుతుంది జర్నలిజం. సరిగ్గా ఇప్పుడు బాసరలో మీడియా ఇలాగే తయారైంది. వెనుకబడిన ప్రాంత అభివృద్ధి కోసం, స్వయంగా చదువులమ్మ ఒడి అని బాసరలో ట్రిపుల్ ఐటీని ఏర్పాటు చేశారు నాటి సీఎం వై.ఎస్.ఆర్. దీని ద్వారా మెరికల్లాంటి విద్యార్థులను తయారు చేసి దేశానికి అందించాలని, సాంకేతిక విద్యా ప్రతీ గ్రామానికి అందాలనే సదాశయం దీని వెనకాల ఉంది. కానీ, కొంతమంది జర్నలిస్టులుగా చెప్పుకునే పరాన్నజీవులకు మాత్రం ఇదొక బంగారు గుడ్లు పెట్టే బాతులా కనిపించింది. అందుకే వారు ఈ విద్యా సంస్థ మీద పడి బతకడానికి అలవాటు పడ్డారు. నిరాధార, వాస్తవాలను వక్రీకరిస్తూ రాతలు రాస్తూ నాలుగో స్తంభాన్ని దిగజార్చే చర్యలకు ఒడిగడుతున్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఇప్పటికీ ఆరుగురు వీసీలు మారారు. ఆ ఆరుగురిని వేధించింది బాసర మీడియా తమకు కమీషన్లు ఇవ్వాలని, తమకు కాంట్రాక్టులు ఇవ్వాలని ఈ మీడియా సదరు యూనివర్సిటీ అధికారులను వేధింపులకు గురిచేసింది. ఇంకా చేస్తూనే ఉంది. వీరికి దొరికే అతి ముఖ్యమైన ఆయుధం ఆత్మహత్యలు, విద్యార్థులు రకరకాల కారణాలతో సూసైడ్లు చేసుకుంటే కన్నవారికి కడుపుకోత, వారికి చదువులు చెప్పిన వారికి గుండెకోత. విద్యార్థి చనిపోయారని తెలిస్తే.. నిజానిజాలు తెలుసుకోకుండా కట్టుకథలు వండి, వార్చి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తారు. ఈ చావుల ద్వారా కూడా డబ్బు సంపాదించాలనే నీచమైన ఆలోచనలకు ఒడిగట్టడం సిగ్గుచేటు. విద్యార్థులను కూడా రెచ్చగొట్టేలా వారి జీవితాల్లోకి పరకాయ ప్రవేశం చేయడం ఏ మేరకు సమంజసమో మరి ఈ కలం యోధులకే తెలవాలి. బాసర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న సత్రాలను సైతం వీరి చీకటి బాగోతాలకు వాడుతున్నారనేది పచ్చి నిజం. ఏ కొత్త వీసీ, అధికారులు వచ్చినా వీరు వెంటనే కాంట్రాక్టుల కోసం లాబీయింగ్ మొదలుపెడతారు. అవి దక్కాయా సరే, లేకుంటే కనీసం మంచి ప్యాకేజ్తో కూడిన కమీషన్ అయినా ఇవ్వమంటారు. పైకి అక్షర సైనికుల్లా బిల్డప్ ఇస్తూ, ఇలాంటి బ్లాక్ మెయిలింగ్ పాలిటిక్స్ మాత్రం తెరవెనక దండిగా చేస్తుంటారు. ఒక్క బాసరలోనే ఇలాంటి మీడియా అని చెప్పుకునేవి యాభై దాకా ఉంటే, పక్కనే ఉన్న బైంసాలో దాదాపు 250 మీడియా చానళ్లు, పత్రికలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బాసర ఎల్లో జర్నలిస్టు ట్రిపుల్ ఐటీని, బాసర పుణ్యక్షేత్రాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. బడిని, గుడిని భ్రష్టు పట్టిస్తున్నారు. తమ డిమాండ్లను కాదన్న వీసీ, అధికారులపై కక్షగట్టి, వారి వల్లనే కొంపలు అంటుకుపోతున్నట్టు లేనిపోని కట్టుకథల వార్తలు. రాయడం, సోషల్ మీడియాలో ప్రచారం చేయడం వీరికి అలవాటుగా మారడం శోచనీయం.

### సంబంధం లేని సంఘటనలపైనా...

బాసరలో గడిచిన పద్దెనిమిది నెలల్లో కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే చనిపోయారు. అందులో ఒకరు వ్యక్తిగత కారణం (లవ్ ఎఫెయిర్)తో చనిపోగా, మరొకరు లుకేమియా క్యాన్సర్‌తో చనిపోయారు. ఈ రెండు చావులకు మేనేజ్ మెంట్‌కు ఏ మాత్రం సంబంధం లేదు. అయినా సరే బాసర ఎల్లో మీడియా ఈ రెండు చావుల మీద లెక్కకు మించిన కథనాలు, అబద్ధాలు, అడ్డగోలు ప్రచారాలు చేసి., ఎక్స్‌గ్రేషియా డ్రామాలు ఆడారు. సూసైడ్ చేసుకున్న తల్లిదండ్రులకు సైతం లేనిపోని ఆశలు రేపారు. విద్యార్థులు వ్యక్తిగత కారణాల వల్ల చనిపోయినప్పుడు ఎంతో బాధపడుతూ ప్రతీసారి యూనివర్సిటీ సంజాయిషీలు ఇచ్చుకోవాల్సి వస్తుంది. వారికి తెలియని నిజాలూ చాలా ఉన్నాయి. దేశంలో 2008–2025 మధ్య కాలంలో ఐఐటీలలో 120 నుండి 160మంది విద్యార్థులు సూసైడ్లు చేసుకున్నారు. ఇక సెంట్రల్ యూనివర్సిటీలలో 40 నుండి 70 మంది చనిపోగా, ఇతర విద్యాసంస్థల్లో 30 నుండి 50 మంది కన్నుమూశారు. ఇట్లా మొత్తంగా 250 నుండి 350 మంది విద్యార్థులు ఈ ఉన్నత విద్యాసంస్థల్లో అసువులు బాశారు. ఈ నిజాలేవీ తెలియని కొందరు జర్నలిస్టులు వారి బాగోతాన్ని నడపడం వల్ల నాలుగో స్తంభం నలిగిపోతోంది. నిజంగా యాజమాన్యం విధి విధానాల వల్ల, ఒత్తిడి వల్ల, తప్పుడు పద్ధతుల వల్ల సూసైడ్ చేసుకుని ఉంటే, ప్రభుత్వం, లా అండ్ ఆర్డర్, ప్రజాసంఘాలు, పౌర సమాజం కోర్టులో కేసులు వేయవచ్చు. చట్టబద్ధంగా అన్ని చర్యలు తీసుకోవచ్చు. సదరు విద్యాసంస్థను మెరుగుపరచవచ్చు. ఇవేవి చేయకుండా కేవలం తమకు కాంట్రాక్టులు ఇవ్వలేదనో, కమీషన్లు దక్కలేదనో రాసే తప్పుడు రాతలను, చిల్లర కూతలను విద్యార్థులు అర్థం చేసుకోవాలి. ఇవాళ ప్రధాన స్రవంతి మీడియా ప్రపంచ సంక్షోభం చుట్టూ, యుద్ధ భీభత్సం చుట్టూ వార్తా కథనాలు వెలువరిస్తుంటే, బాసర సూడో జర్నలిస్టులు మాత్రం అక్రమ సంపాదనే అతిపెద్ద యుద్ధం కావడం విడ్డూరం. దీనివల్ల నిజాయితీగా సమాజం కోసం పనిచేసే అసలైన పాత్రికేయులు బాధపడుతుండటం గమనార్హం. ఎల్లో మీడియా దాడి నుండి బాసరను కాపాడుకోవడం ఇప్పుడు ప్రతీ విద్యార్థి బాధ్యత. ప్రతీ పేరెంట్ కర్తవ్యం..!!

# నిర్మల్ జిల్లా 'పోలీస్ అక్క'కు 'స్కోచ్' అవార్డు

**నిర్మల్ జిల్లా ఎస్పీని, సిబ్బందిని అభినందించిన డిజిపి బి.శివధర్ రెడ్డి**



హైదరాబాద్ (జనంసాక్షి) : నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ వినూత్నంగా చేపట్టిన 'పోలీస్ అక్క' కార్యక్రమం అరుదైన గుర్తింపును సొంతం చేసుకుంది. ఈ కార్యక్రమానికి 'స్కోచ్' అవార్డు ప్రకటించడంతో శనివారం జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల అవార్డును అందుకున్నారు. 'పోలీస్ అక్క' కార్యక్రమానికి అవార్డు దక్కడం పట్ల తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి శివధర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.కరుణతో కూడిన పోలీసింగ్‌కు 'పోలీస్ అక్క' ఒక నిలువుటద్దమని డిజిపి కొనియా డారు. కేవలం రక్షణ కల్పించడమే కాకుండా, విద్యార్థినుల్లో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ వారిని భావిపౌరులుగా తీర్చిదిద్దడంలో ఈ కార్యక్రమం పని చేస్తోందని ప్రశంసించారు. నిర్మల్ జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల నేతృత్వంలో ఈ పథకం విజయవం తంగా అమలు కావడం గర్వకారణమని పేర్కొన్నారు.

జిల్లాలోని మహిళా పోలీస్ సిబ్బంది విద్యార్థినులకు అక్కల్లా అండగా నిలుస్తూ, వారికి సరైన మార్గదర్శకత్వం అందిస్తున్నారని డిజిపి కొనియాడారు. మహిళా పోలీసులు సమాజంలో రోల్ మోడల్స్‌గా నిలుస్తూ సామాజి క మార్పునకు శ్రీకారం చుట్టడం అభినందనీ యమన్నారు. సురక్షితమైన, పటిష్టమైన సమాజ నిర్మాణానికి ఇదొక గొప్ప ముందడుగు అని ఆయన ప్రశంసించారు.ఢిల్లీలో శనివారం నాడు జరిగిన అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల స్వయంగా హాజరై ఈ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా నిర్మల్ జిల్లాలో ప్రారంభమైన ఈ కమ్యూనిటీ పోలీసింగ్ మోడల్, అతి తక్కువ కాలంలోనే దేశవ్యాప్త ప్రశంసలు అందుకోవడం విశేషం. కేవలం చట్టాన్ని అమలు చేసే యంత్రాంగంగానే కాకుండా, సమాజంలో బాధ్యతాయుతమైన మార్పుకు నాంది పలికేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. నేటి సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న వేధింపులు, గృహహింస, సైబర్ నేరాల వంటి సమస్యల పరిష్కారానికి 'పోలీస్ అక్క' ఒక భరోసాగా నిలుస్తోంది. పోలీసులను సంప్రదించడానికి సంకోచించే విద్యార్థినులకు ఒక కుటుంబ సభ్యురాలిలా, అక్కలా అండగా నిలవడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా మహిళా పోలీసు అధికారులు కేజీబీవీ పాఠశాలల్లో రాత్రిపూట బస చేస్తూ విద్యార్థినుల సమస్యలను వింటున్నారు. వారికి గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. ఇప్పటివరకు సుమారు 7,000 మందికి పైగా విద్యార్థినులు, మహిళలు ఈ కార్యక్రమం ద్వారా నేరుగా ప్రయోజనం పొందారు. గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ, డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందిస్తూ బాధితులకు త్వరితగతిన న్యాయం అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జి.జానకి షర్మిల మాట్లాడుతూ, ఒక చిన్న ఆలోచనగా మొదలైన ఈ ప్రయాణం నేడు జాతీయ స్థాయి గౌరవాన్ని సొంతం చేసుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ విజయం జిల్లాలోని ప్రతి మహిళా పోలీస్ సిబ్బంది కృషి, నిబద్ధతకు దక్కిన ప్రతిఫలమని కొనియాడారు. విద్యార్థినులు భయం వీడి తమ సమస్యలను ధైర్యంగా చెప్పుకోగలగడమే ఈ కార్యక్రమం సాధించిన అసలైన విజయమని ఆమె అభిప్రాయపడ్డారు. స్కాచ్ అవార్డు రావడం తమపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో ఈ సేవలను మరింత విస్తరించి ప్రతి బాలికకు భద్రత, ధైర్యం కల్పించడమే తమ లక్ష్యమని ఎస్పీ స్పష్టం చేశారు. నిర్మల్ జిల్లా సాధించిన ఈ గౌరవం తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ కు గర్వకారణమని ఆమె హర్షం వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్ పార్టీలో భారీగా లండన్ ఎన్నారైలు చేరిక



లండన్ (జనంసాక్షి) : యూకే లోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఎందరో తెలంగాణ ఎన్నారైలు , ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం వారందరికీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భారీగా తెలంగాణ ఎన్నారైలు పార్టీలో చేరినట్టు మాజీ అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి తెలిపారు. కెసిఆర్ – కేటీఆర్ నాయకత్వంలో పనిచేయాలనే సంకల్పంతో పార్టీలో చేరుతున్నామని, అలాగే తెలంగాణ రాష్ట్రానికి కెసిఆర్ నాయకత్వమే శ్రీ రామ రక్షా అని భావిస్తున్నట్టు ఎన్నారైలు తెలిపారు. తరువాత ఎన్నారై బీఆర్ఎస్ యూకే ఉపాధ్యక్షుడు హరి బాబు నవపేట్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఎన్నారై బీఆర్ఎస్ యూకే కార్యవర్గసభ్యులంతా పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలుగా రానున్న రోజుల్లో అటు సోషల్ మీడియాలో మాత్రమే కాకుండా లండన్ లో ప్రత్యేక నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టాలని నిర్ణయించినట్టు ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి తెలిపారు. ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా లండన్ లో పార్టీ చేస్తున్న కార్యక్రమాలని అలాగే ఎన్నారైలు పార్టీకి అండగా ఉంటూ చేస్తున్నసేవలని నూతన సభ్యులకి వివరించి వారికి దిశా నిర్దేశం చేసారు. అలాగే కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు, పార్టీ నాయకత్వం ఎన్నారైలను ఎంతో ప్రోత్సహిస్తుందని, కష్టపడి పని చేస్తే గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఎన్నారై బీఆర్ఎస్ యూకే సలహామండలి చైర్మన్ సిక్కా చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ, ఉద్యమ సమయం నుండి నేటి వరకు ప్రపంచంలో అందరికీ ఆదర్శంగా నిలిచామని, అదే స్ఫూర్తి, క్రమశిక్షణ తో ముందుకు వెళ్లాలని తెలిపారు.

# ఐవీఎఫ్ బలోపేతానికి కృషి చేయాలి

- ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త
- నియామక పత్రాలు అందజేత



హైదరాబాద్ (జనంసాక్షి) : ఐవీఎఫ్ బలోపేతానికి కృషి చేయాలని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త సూచించారు. నాగోల్ లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంపు కార్యాలయంలో నూతన కమిటీ సభ్యులకు ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భగా ఐవీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా కొంపల్లి సత్యనారాయణ గుప్తకు ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షుడు అజయ్‌కి జాయింట్ సెక్రటరీ భరత్ , పవన్‌లకు అలాగే కోశాధికారిగా భార్గవ్‌కు పీఆర్‌వోగా హరి, వైస్ ప్రెసిడెంట్ గా రాంబాబు కార్యదర్శిగా సంతోష్ వైస్ ప్రెసిడెంట్ గా సప్తగిరి వైస్ ప్రెసిడెంట్‌గా పూర్ణ చందర్ , వైస్ ప్రెసిడెంట్ సనత్ కుమార్ బోడుప్పల్ డివిజన్ మహిళ అధ్యక్షురాలిగా కొంపల్లి కృష్ణవేణి , కుత్బుల్లాపూర్ మహిళ అధ్యక్షురాలు గా కొంపల్లి అనురాధ కూకట్పల్లి డివిజన్ వైస్ ప్రెసిడెంట్ గా దారం సరిత ఐవీఎఫ్ కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు దారం సంతోష్ బోడుప్పల్ డివిజన్ ప్రెసిడెంట్ గా కొంపల్లి ఉమ శంకర్‌లకు నియామక పత్రాలు అందజే శారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఐవీఎఫ్ బలో పేతానికి కృషి చేయాలని ఆర్య వైశ్యులకు అన్ని విధాలా అండగా ఉంటా మని ఆయన అన్నారు. నూతన నియామక పత్రాలు అందుకున్న వారికి అభినం దనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రధాన కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్ గుప్తా, యూత్ అధ్యక్షుడు కట్ట రవి కుమార్ గుప్త ఐవీఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ యూత్ ప్రెసిడెంట్ నవీన్ గుప్తా, ఐవీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోండి

- ఏఐఎస్‌వో నేత జి.రమేష్ నాయుడు
- ప్రాంతీయ పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులకు వినతి పత్రం

హైదరాబాద్ (జనంసాక్షి) : ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌వో నేత జి.రమేష్ నాయుడు కోరారు. ప్రాంతీయ పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులకు వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్ ప్రాంతీయ పాఠశాల విద్యా శాఖ పరిధిలోని కొన్ని విద్యా సంస్థలు, సంబంధిత అధికారుల నుండి ఎలాంటి అధికారిక ప్రకటనలు లేకుండానే ఎస్సెస్సీ బోర్డు అడ్మిషన్లను ముందుగానే నిర్వహిస్తున్నట్లు తమ ఏఐఎస్‌వో దృష్టికి వచ్చిందని, సరైన అనుమతులు లేకుండా నడుస్తున్న కొన్ని విద్యాసంస్థలు కూడా ఈ ముందస్తు అడ్మిషన్లలో పాల్గొంటున్నాయని సమాచారం అందిందని తెలిపారు. గతంలో ఇటువంటి అనధికార చర్యలు విద్యార్థులలో గందరగోళాన్ని సృష్టించి, విద్యా షెడ్యూల్‌ను దెబ్బతీసి, వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన సందర్భాలున్నాయని, ఈ విషయాన్ని అత్యంత గంభీరంగా పరిగణించి, ఇటువంటి అక్రమాలను తక్షణమే అరికట్టాలని, అడ్మిషన్లు కేవలం అధికారిక మార్గదర్శకాల ప్రకారమే నిర్వహించబడేలా చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు, రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ (ఆర్‌జేడీ, హైదరాబాద్) దృష్టికి ఏఐఎస్‌వో టీజీ తీసుకువచ్చారు. విద్యార్థుల ప్రయోజనం, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం దృష్ట్యా ఈ విషయంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# డాక్టర్‌పై దాడి కేసులో నలుగురు అరెస్ట్



నిర్మల్ రూరల్, మార్చి28,(జనంసాక్షి) నిర్మల్ పట్టణంలోని ఎస్ వి ఆర్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో డాక్టర్, సిబ్బందిపై దాడి ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్ కోసం బిల్లును పెంచాలని కోరగా డాక్టర్ నిరాకరించడంతో నిందితులు దాడికి దిగినట్లు పోలీసులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా సల్మాన్, షౌకత్, షాబాద్ అలీ, ఆజాద్ హుస్సేన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వైద్యులపై దాడులు తీవ్రమైన నేరమని, ఇలాంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల హెచ్చరించారు.

# కొందరు న్యాయమూర్తుల "రాజును మించిన రాజభక్తి"!



"కొందరు న్యాయమూర్తులు రాజును మించిన రాజభక్తి చూపుతున్నారు". ఈ మాట ఎవరో ప్రభుత్వ విమర్శకులు ఉబుసుపోకకో, కేవలం విమర్శించడం కోసమో అన్న మాట కాదు. ఈ మాట అన్నది సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్. పదిహేను సంవత్సరాలుగా న్యాయమూర్తిగా ఉన్న ఉజ్జల్ భూయాన్ గౌహతి, బొంబాయి, తెలంగాణ హైకోర్టులలో న్యాయమూర్తిగా, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు. ఆ మాట అన్న సందర్భం కూడా తప్పుడు నేరారోపణలతో ప్రభుత్వం కేసులు పెడుతుంటే, ఐదేళ్లు, ఆరేళ్లు చార్జిషీటు పెట్టకుండా, చార్జెస్ ఫ్రేమ్ చేయకుండా జైలులో మగ్గేలా చేస్తుంటే, కొందరు న్యాయమూర్తులు ఆ ఖైదీలకు బెయిల్ కూడా ఇవ్వకుండా "రాజును మించిన రాజభక్తి ప్రదర్శిస్తున్నారు" అన్నారాయన.

ఇటువంటి వ్యాఖ్యలు గత పన్నెండు సంవత్సరాల్లో కొత్తవి కావు. ప్రతిపక్ష పార్టీలు, సంఘ్ పరివార్ కన్నా భిన్నమైన అభిప్రాయాలున్నవారు, న్యాయవాదులు, జాతీయ, అంతర్జాతీయ న్యాయకోవిదులు ఎన్నోసార్లు ఇటువంటి వ్యాఖ్యలు చేశారు. జకియా జాఫ్రీ కేసు, అధికరణం 370 కేసు, ఢిల్లీ మూకదాడుల కేసు, భీమా కోరేగాం కేసు, బాబ్రీ మసీదు – రామ జన్మభూమి స్థలం కేసు, రాఫేల్ యుద్ధ విమానాల కుంభకోణం కేసు, ప్రొ. జి ఎన్ సాయిబాబా కేసు వంటి డజన్ల కేసులలో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, చివరికి ప్రధాన న్యాయమూర్తులు చట్టాన్నీ పాటించలేదు, సహజ న్యాయ సూత్రాలనూ పాటించలేదు, సాధారణ తర్కాన్నీ పాటించలేదు. అధికారంలో ఉన్న ప్రభుత్వం, ఆ ప్రభుత్వాన్ని నడిపే భావజాల సంస్థ కనుసన్నల్లో అనేక తీర్పులు ఇచ్చాయి.

అయితే ఇప్పుడు ప్రత్యేకత ఏమంటే ఇన్నాళ్లూ విమర్శకులు అన్న మాటల స్ఫూర్తిని కొనసాగిస్తూ, వాటికి విశ్వసనీయతను ఇస్తూ, కొన్ని సందర్భాలలో మరింత తీవ్రమైన వ్యాఖ్యలు ఒక సిట్టింగ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి నుంచి వచ్చాయి. అది కూడా మరెంతో మంది న్యాయమూర్తులు, వందలాది మంది సుప్రీం కోర్టు న్యాయవాదులు ఉన్న సభలో... ఆ మాట మొత్తం న్యాయవ్యవస్థ పని తీరు మీదనే ఒక పదునైన విమర్శ. ఆ మాటతో పాటు ఆయన భారత న్యాయవ్యవస్థ గురించీ, సామాజిక వ్యవస్థ గురించీ, భవిష్యత్తు గురించీ మరెన్నో తీవ్రంగా ఆలోచించవలసిన వ్యాఖ్యలు కూడా చేశారు. ఆ వ్యాఖ్యలను వివరంగా పరిశీలించే ముందు ఆ సందర్భాన్ని కూడా గమనంలోకి తీసుకోవాలి.

అది ఏడు దశాబ్దాలకు పైగా నడుస్తున్న ప్రతిష్ఠాత్మక సుప్రీం కోర్ట్ బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఒక చర్చావేదిక. సుప్రీం కోర్టులో వాదించే మూడు వేలకు పైగా న్యాయవాదులు సభ్యులుగా ఉన్న సుప్రీం కోర్ట్ బార్ అసోసియేషన్ తన మొట్టమొదటి మహాసభను బెంగళూరులో మార్చ్ 21–22 తేదీల్లో జరుపుకుంది. ఈ మహాసభ ప్రధాన ఇతివృత్తం 'రీఇమేజినింగ్ జుడిషియల్ గవర్నెన్స్: స్ట్రెంథెనింగ్ ఇన్స్టిట్యూషన్స్ ఫర్ డెమోక్రటిక్ జస్టిస్' (న్యాయ పాలన పునరాలోచన: ప్రజాస్వామిక న్యాయం కోసం సంస్థా నిర్మాణాలను బలోపేతం చేయడం). భారత ప్రధాన న్యాయమూర్తితో సహా పది మంది సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, మరెందరో విభిన్న హైకోర్టుల న్యాయమూర్తులు పాల్గొన్న ఆ రెండు రోజుల సదస్సులో ఐదు అంశాల మీద చర్చావేదికలు నిర్వహించగా, రెండో రోజు 'వికసిత్ భారత్ లో న్యాయవ్యవస్థ పాత్ర' అనే అంశం మీద చర్చావేదికలో జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మాట్లాడారు. 'సమాజంలో న్యాయవ్యవస్థ పాత్ర' అని ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో ఒక పాఠం ఉన్నందుకు, ఆ పాఠంలో నాలుగంటే నాలుగు వాక్యాలు న్యాయవ్యవస్థ అవినీతి గురించి ఉన్నందుకు, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో సహా న్యాయమూర్తులు మండిపడ్డారు. ఏకంగా ఆ పాఠ్యపుస్తకాన్నే నిషేధించారు. ఆ పరిణామాలన్నిటినీ ఇటీవలనే దేశం చూసింది. దాదాపు అటువంటి ఇతివృత్తం మీదనే ఇప్పుడు ఈ చర్చావేదిక ఏర్పాటయింది.

ఆ చర్చావేదికలో జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మాట్లాడిన మాటలు ఈ దేశం మీద ప్రేమ ఉన్నవారందరూ, ఈ దేశంలో కొనసాగుతున్న అవ్యవస్థ మారాలని కోరుకునేవారందరూ, ప్రత్యేకంగా న్యాయవ్యవస్థ పని తీరు మీద అసంతృప్తితో ఉన్నవారందరూ తప్పనిసరిగా గుర్తించవలసినవి, అర్థం చేసుకోవలసినవి, ప్రచారం చేయవలసినవి.

న్యాయవ్యవస్థ పాత్ర గురించి ఆయన ఒక్కమాటలో 'న్యాయవ్యవస్థ న్యాయవ్యవస్థగా ఉండాలి' అన్నారు. అంటే ప్రస్తుతం అది అట్లా లేదని మరొక మాటల్లో చెప్పడమే. న్యాయవ్యవస్థ బాధ్యత భజన కాదు, నింద కాదు, ప్రశంస కాదు, విమర్శ కాదు. న్యాయవ్యవస్థకు రాజ్యాంగ నిర్మాతలు ఇచ్చిన బాధ్యత రాజ్యాంగ ఆదర్శాలను, ప్రవేశికను, ప్రాథమిక హక్కులను, ఆదేశిక సూత్రాలను గౌరవించడం, వ్యాఖ్యానించడం, అమలయ్యేలా చూడడం, పరిరక్షించడం అని ఆయన అన్నారు. ఈ పనిలో న్యాయవ్యవస్థ చట్ట సభల నుంచి, అధికార యంత్రాంగం నుంచి దూరంగా ఉండాలనీ, స్వతంత్రంగా ఉండాలనీ ఆయన అన్నారు.

భారతదేశం 2047కల్లా అభివృద్ధి చెందిన దేశంగా, వికసిత్ భారత్ గా మారుతుందనీ, మారుస్తామనీ ఇవాళ అధికారంలో ఉన్న పాలకులు పదే పదే చెపుతున్నారు. ఆ నేపథ్యంలోనే వికసిత్ భారత్ లో న్యాయవ్యవస్థ పాత్ర గురించి మాట్లాడుతూ జస్టిస్ భూయాన్ అసలు వికసిత్ భారత్ అంటే ఏమిటో కూడా వివరించారు. వికసిత్ భారత్ అనేది కేవలం ఆర్థిక రంగ పరిణామం కాదని, ప్రజాస్వామ్యం పరిఢవిల్లినప్పుడే, రాజ్యాంగ ఆదర్శాల పరిరక్షణ జరిగినప్పుడే వికసిత్ భారత్ ఏర్పడుతుందన్నారు. భిన్నాభిప్రాయాన్ని నేరంగా చూసే ప్రభుత్వం ఉన్నచోట వికసిత్ భారత్ ఏర్పడదు అని ఆయన నిర్ద్వంద్వంగా ప్రకటించారు. తీవ్రవాద వ్యతిరేక చట్టాల కింద వేలాది మందిని అర్థరహితంగా నిర్బంధించే చోట, లోతైన అసమానతలను యథాతథంగా ఉంచే చోట వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరదు అని ఆయన కచ్చితంగా చెప్పారు.

ఈ అర్థరహితమైన అరెస్టులు అనే వ్యాఖ్యను వివరిస్తూ ఆయన పార్లమెంటులో హోమ్ శాఖ సహాయ మంత్రి ఇచ్చిన గణాంకాలను చదివి వినిపించారు. స్వయంగా హోమ్ మంత్రిత్వ శాఖ చెప్పిన ఆ సమాచారం ప్రకారం 2019 నుంచి 2023 మధ్య ప్రతి సంవత్సరం అరెస్టుల సంఖ్యకూ, నేరారోపణలు నిరూపణ జరిగి, శిక్షలు పడిన సంఖ్యకూ మధ్య తీవ్రమైన అంతరం ఉందని ఆయన చూపించారు. 2019లో 1948 మందిని అరెస్టు చేయగా, కేవలం 34 మంది మీద మాత్రమే ఆరోపణలు నిరూపణ అయి, శిక్ష పడింది. 2020 లో 1321 మంది అరెస్టు, శిక్ష పడినవారు 80, 2021లో 1621 మంది అరెస్టు, శిక్ష పడినవారు 60, 2022 లో 1631 మంది అరెస్టు, శిక్ష పడినవారు 41, 2023లో 2941 మంది అరెస్టు, శిక్ష పడినవారు 118 – – మొత్తం మీద చూస్తే కేవలం 5 శాతం కన్నా తక్కువ మంది మీద మాత్రమే ప్రభుత్వం చేసిన ఆరోపణలు రుజువై, శిక్షలు పడ్డాయి.


ఆ ఆరోపణల మీద వాళ్లను ఐదేళ్లు, ఆరేళ్లు జైళ్లలో నిర్బంధించి, చార్జిషీటు కూడా ఇవ్వకుండా, విచారణ ప్రక్రియలో కీలకమైన చార్జెస్ ఫ్రేమ్ చేయకుండా కాలం గడుపుతున్నారు. గరిష్ట శిక్ష ఏడు సంవత్సరాలు ఉండగా విచారణ జరగకుండానే ఏడు సంవత్సరాలు జైలులో ఉంచుతున్నారు. చివరికి కేసు కొట్టేసి నిర్దోషులుగా వాళ్లను వదిలేస్తున్నారు. అన్ లాఫుల్ ఆక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్ (ఊపా), ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పి ఎం ఎల్ ఎ) వంటి చట్టాలను దుర్వినియోగం కాదు, మితిమీరి వినియోగిస్తున్నారు. ఆధారాలు లేకుండానే అత్యుత్సాహంతో కేసులు పెడుతున్నారు. న్యాయస్థానాల మీద భారం పెరిగిపోతున్నది. ఇటువంటి తప్పుడు కేసులలో నిందితులను కనీసం బెయిల్ మీద విడుదల చేయవలసిన న్యాయస్థానాలు ఆ పని చేయడం లేదు అంటూ "కొందరు న్యాయమూర్తులు రాజును మించిన రాజభక్తి ప్రదర్శిస్తున్నారు" అన్నారు. ఊపా, పిఎంఎల్ఎ కేసుల్లో ఎవరిని సంవత్సరాల తరబడి నిర్బంధంలో ఉంచుతున్నారో, వారికి బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తున్న న్యాయమూర్తులు ఎవరో, రాజు ఎవరో అందరికీ తెలుసు.

ఈ వాదననే కొనసాగిస్తూ దేశంలో రాజ్యాంగ విలువలు ఉండాలా, రాజకీయ నినాదాలు ఉండాలా అని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం అంటే చర్చను నేరంగా చూడడం కాగూడదని అన్నారు. భిన్నాభిప్రాయాల పట్ల, విమర్శ పట్ల సహనం ఉండాలని ఆయన హితబోధ చేశారు. ఈ సందర్భంలోనే చిన్న చిన్న సమస్యల మీద నిరసన తెలుపుతున్నవారి మీద, ఆందోళన చేస్తున్నవారి మీద, చివరికి విద్యార్థుల మీద కూడా ఎఫ్ఐఆర్ లు తయారు చేస్తున్నారని అంటూ, ఇది వికసిత్ భారత్ కు వెళ్లే మార్గం కాదు అన్నారు.

న్యాయవ్యవస్థలో లోపాల గురించి ప్రస్తావిస్తూ, జనాభాలో సగంగా ఉన్న మహిళలకు న్యాయమూర్తులుగా అవకాశం రాకపోవడం గురించి, న్యాయమూర్తులను నియమించే అధికారం ఉన్న కొల్లీజియమ్ ను సున్నితంగా విమర్శించారు. సుప్రీంకోర్టులో 1950 నుంచి గడిచిన 75 ఏళ్లలో 287 మంది న్యాయమూర్తులు పని చేయగా, అందులో కేవలం 11 మంది మాత్రమే మహిళా న్యాయమూర్తులని, అది రెండు శాతం మాత్రమేనని, 50 శాతం జనాభాకు రెండు శాతం ప్రాతినిధ్యం ఇవ్వడం వికసిత్ భారత్ కు తగదని అన్నారు. అలాగే దేశంలోని 25 హైకోర్టులలో కేవలం 14 శాతం మంది మాత్రమే మహిళా న్యాయమూర్తులున్నారని ఆయన ఎత్తి చూపారు. కాకపోతే కింది స్థాయి న్యాయ వ్యవస్థలో న్యాయమూర్తుల పదవులలో మహిళలకు తగిన ప్రాతినిధ్యం ఉన్నదని, కాని రాజ్యాంగ న్యాయస్థానాలైన హైకోర్టు, సుప్రీం కోర్టులలో పరిస్థితి మారాలని అన్నారు. వికసిత్ భారత్ నెలకొనాలంటే సర్వోన్నత న్యాయస్థానం ఇంద్ర ధనుస్సులా ఉండాలి. దేశంలో ఉన్న వైవిధ్యానికంతా అద్దం పట్టేలా, అన్ని సమూహాలకూ ప్రాతినిధ్యం ఉండేలా ఉండాలి అన్నారాయన.


వికసిత్ భారత్ ను నిర్వచించే క్రమంలో ఆయన తీవ్రమైన అసమానతలతో వికసిత్ భారత్ ఏర్పడదని అంటూ, దళిత సమస్యను లేవనెత్తారు. ఇవాళ్టికీ దళితులను బైట, కారిడార్లలో నిలబెట్టడం, దళితుల మీద మూత్రం పోయడం, దుర్భాషలాడడం, దళిత స్త్రీలు మధ్యాహ్న భోజనం వండే పాఠశాలలకు తమ పిల్లలను పంపబోమని తల్లి దండ్రులు అనడం వంటివి జరుగుతున్న చోట వికసిత్ భారత్ రూపొందదు అని కూడా ఆయన అన్నారు. రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు నిర్దేశించిన సామాజిక సంపద పంపిణీ, తీవ్రమైన సామాజిక అసమానతల రద్దు వంటి కర్తవ్యాలు పూర్తి కాకుండా వికసిత్ భారత్ రూపొందదు అని ఆయన అన్నారు.

భిన్నాభిప్రాయాల, భిన్న రాజకీయ, సామాజిక, మత విశ్వాసాలు ఉన్నవారి పట్ల అసహనం, విష, విద్వేష ప్రచారం ముమ్మరంగా, హింసాత్మకంగా అధికార మద్దతుతో సాగుతున్న దేశంలో, సమయంలో ఇటువంటి మంచి మాటలు రుచించకపోవచ్చు. వ్యతిరేకత కూడా రావచ్చు. కాని ఎంత ఎదురుగాలిలోనైనా ఒక మనిషి స్థిరంగా నిలబడి మంచి మాట చెప్పడం అవసరం. ఎంత చీకటిలోనైనా ఒక కొవ్వొత్తి వెలిగించడం అవసరం.



**ఎన్ వేణుగోపాల్**
కవి, సాహిత్య విమర్శకుడు, పాత్రికేయుడు, ప్రజా వక్త, వ్యాఖ్యాత, రాజకీయ, ఆర్థిక,సామాజిక అంశాలపై కాలమిస్ట్.

# సమస్య ఒకటే పరిష్కారాలు అనేకం



ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. సమస్య ఒకటే. పరిష్కారాలు అనేక రకాలుగా ఉంటాయి. ఈ రెండు విషయాలు అర్థం అయితే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. సమస్యను జటిలం చేసే మహానుభావులు

సమస్యను ఎన్ని రకాలుగా విశ్లేషించినా చివరకు పరిష్కారం జరగడమే ముఖ్యం.

కొందరు సమస్యను రకరకాలుగా విశ్లేషించి గందరగోళం సృష్టిస్తారు. పరిష్కారాన్ని జటిలం చేస్తారు. భార్యాభర్తల పంచాయతీలో , కొందరు మహానుభావులు ఎగదోలి సంసారాలు విచ్చిన్నం చేస్తారు. వాళ్లు తల్లి దండ్రుల కూడా కావచ్చు. ఇటీవల అమెరికాలో కూతురు దగ్గరికి వెళ్లి ఆరు నెలలు ఉండి వస్తే విడాకులైపోయిన సంఘటనలు చాలా జరుగుతున్నాయి. సంపాదించే బిడ్డ చేజారి పోయిందని స్వార్థం కావచ్చు. తాము వద్దన్న కులం వాడిని పెళ్లి చేసుకుందని లోలోపల రగిలే పగ కావచ్చు. కొందరైతే సంపాదించే బిడ్డ చేజారిపోతే ఎట్లా? అంతగనం కష్టపడి చదివిస్తిమి కదా అని సొంత తల్లి దండ్రుల పెళ్లి సంబంధాలు ఎత్తగొడుతుంటారు. 23 – 30 ఏండ్ల లోపు బిడ్డకు పెళ్లి చేయక పోతే ఆడపిల్లలు, మెచ్చినా సరే ఏవో సాకులు చెప్పి ఎత్తగొట్టే తమ తల్లితండ్రులను అనుమానించి తమ తోవ తాము చూసు కోవాల్సిందే! లేకపోతే జీవితం తెర్లయి పోవచ్చు.. తనతోటి వాళ్ల పిల్లలు ఇంటర్ కు వచ్చాక జ్ఞానోదయమా పెళ్లి చేసుకుందామంటే వయసు మీరి పోయి డైవోర్సీలను చేసుకోవాల్సి రావచ్చు.

### రాజకీయాల్లో నాయకులు కూడా ఇంతే

రాజకీయాల్లో కూడా ఎంత చేసినా తమను వాడుకోవడమే తప్ప తమకు ప్రమోషన్ గాని, పార్టీ టికట్ గాని, కాంట్రాక్టు గాని, తగిన గుర్తింపు గానిఇవ్వక పోతే , ఇప్పించు పోతే తనదారి తాము చూసుకోవాల్సిందే. తల్లితండ్రులు సంబంధాలు ఎత్త గొట్టినట్టే తమ అనుచరులకు సహచరులకు అవకాశాలు ఎత్తగొడుతారు. టికట్ వస్తే ఓడించే కుట్ర చేస్తారు. ఉద్యోగం ఇప్పిస్తానని ఏండ్ల తరబడి వెంట తిప్పుకొని ఎట్టి చాకిరి చేయించుకునే వారెందరో! అనుచరుల్లో చాలామంది ఇలాంటి వారే!


### శ్లోకాలు, సిద్ధాంతాలు వల్లించే వారి పట్ల జాగ్రత్త

మరి కొందరు పరిష్కారాల గురించి చర్చించి విశ్లేషించి పరిష్కారాన్ని జటిలం చేస్తారు. పిడుగుకు బియ్యానికి ఒకటే మంత్రం . బ్రహ్మలకు దానం చెయ్యి. ఆ పూజ చెయ్యి అంటారు. గ్రహగతులా బాగలేవని కుంగ తీస్తారు. మరి కొందరైతే అనేక రకాలుగా వాదించి తాము చెప్పిన పరిష్కారమే సరైనదని, అదే ఏకైక మార్గం, అని అంటారు. వీళ్లు సిద్దాంత వాదులన్న మాట! నిత్య జీవితం మొదలుకొని రాజకీయాలు, సామాజిక సమస్య సందర్భంగా ఇవన్నీ గమనించవచ్చు.

సమస్యను ఎంత సేపు వల్లించినా అది పరిష్కారం అనబడదు.. అది సమస్యను మరింత పెంచవచ్చు. భార్యాభర్తల సంవాదాలు, కుటుంబంలో, స్నేహితుల సంబంధాలలో సమస్య చర్చల ముఖ్యం కాదు. పరిష్కారం ముఖ్యం.

సైకాలజీ సమస్య మీద దృష్టి పెడుతుంది. ఎన్ఎల్పి ( న్యూరో లింగ్విస్టిక్ ప్రోగ్రామ్ ) పరిష్కారం మీద దృష్టి పెడుతుంది. అలోపతి రోగ నిర్ధారణ సమస్య మీద దృష్టి పెడుతుంది . అందుకు డయాగ్నస్టిక్ పరీక్షలు పెరిగాయి. రోగ నిర్ధారణ పేరిట ఎన్నో టెస్టులు. మందుల కన్నా వీటికే ఖర్చు ఎక్కువ. అదొక వ్యాపార వలయం.

ఆయుర్వేదం , ప్రకృతి చికిత్స ,వనమూలికల వైద్యం సరిష్కారం మీద దృష్టి పెడుతుంది. నాడి చూసి వైద్యం చేసి రోగం తగ్గించే మందులు రాస్తారు. ఆయుర్వేదం లో రకరకాల టెస్టుల పద్ధతి , రోగ ిర్ధారణ వద్దతులు అంతగా అభివృద్ధి చెందలేదు. ఎందుకంటే వాళ్ళు చూచాయగా విషయం అర్థం అయ్యాక మందులు పత్యాలు చెప్తారు. వనమూలికల వైద్యం కూడా అంతే. ప్రకృతి చికిత్సలో సమస్యలను అర్థం చేసుకుని ఆహారం లో, మార్పు ద్వారా, శరీరం లో పేరుకు పోయిన



చెత్తను, మృత కణాలను తొలగించడం ద్వారా శరీరం తనకు తానే ఆరోగ్యంగా మారే పరిస్థితి కి తెస్తారు. ఇలా రోగం అనే సమస్యకు పరిష్కారాలు అనే రకాలు .

### సమస్యను వాడుకనేవారు

రాజకీయాల్లో అనేక సమస్యలు చర్చకు వస్తాయి. ఒక పార్టీ ఒక రకంగా, మరో పార్టీ మరో రకంగా చర్చను ముందుకు తెస్తారు. అంతే తప్ప వారు పరిష్కారం చేయరు. అధికారం ఇస్తే , అధికారంలోకి వస్తే పరిష్కారం చేస్తామంటారు. ప్రజలను కదిలిస్తారు. పత్రికలు సమస్యలను ప్రచారం చేస్తాయి. పరిష్కారం వాళ్లకు ముఖ్యం కాదు. పరిష్కారమైన సమస్యలకు ప్రచారం ఉండదు. మంచి వాళ్ల గురించి ప్రచారం తక్కువ. చెత్త వార్తలు ఎక్కువ.

### నెగెటివ్ థింకర్స్- మందిని తప్పు పడుతారు

సమస్యలు అదే పనిగా ఏకరువు పెట్టే వారిని, ఫిర్యాదులు చేసేవారిని నెగెటివ్ థింకర్స్ అని, మంది మీదకు తోసేసే వారిని, పలాయన వాదులని అంటారు. చాలా మంది, చాలా ఉద్యమాలు ప్రభుత్వాల ను తప్పు పట్టడానికి విమర్శిస్తారు. ఫిర్యాదులు చేయడం, విమర్శించడమే వారి లక్ష్యం. పరిష్కారంలో వారు పాల్గొనరు.

### సంఘ సంస్కర్తలు

సంఘ సంస్కర్తలు, విమర్శతో పాటు వరిష్కారం కోసం కృషి చేస్తారు. విప్లవ కారులు సమస్యలను ప్రచారం చేస్తారు. వారికి పరిష్కారాలు ప్రధానం కాదు. ఆ సమస్యల పరిష్కారం కోసం మా ఉద్యమం లో చేరండి . పోరాడి సాధించుకుందాం అంటారు. అనగా వారికి రిక్రూట్మెంట్ ప్రధానం. అన్ని పార్టీలు ఇలాగే ప్రవర్తిస్తాయి. రిక్రూట్మెంట్ కోసం సమస్య ను పరిష్కరించే బదులు వాయిదా వేస్తారు. పరిష్కారం అయితే తమ వెంట రారు కద! కనక సాగదీస్తారు. దున్నే వారికి భూమి అంటారు. ఇక తరాల తరబడి అదే నినాదం. అంబేద్కర్ ఈ విషయంలో భూమిని జాతీయం చేయాలన్నారు. ఒక చట్టంతో అవసరమైన అందరికీ భూమి పంచబడుతుంది. కనక తరాల తరబడి ఉద్యమాల అవసరమే లేదు.

### ఉద్యోగ కార్మిక ట్రేడ్ యూనియన్ సంగాలు

తెలివైన ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక సంగాలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన తో ప్రచారం చేసి పార్టీల ప్రజల మద్దతు కూడగట్టి వాడుకొని తమ సమస్యలు కోరికలు తీర్చుకుంటారు. ఎన్ని ఉద్యమాలు చేసినా పరిష్కరించాల్సింది ప్రభుత్వాలు, యాజమాన్యాలు! అపుడపుడు కోర్టులు కూడా!

### పేదల కోసం

పల్లెల్లో కూలీలు పెంచే చట్టాలు ఎన్ని చేసినా కూలీలు పెంచరు. అందుకని ప్రభుత్వం అందుకు పరిష్కారంగా, ఉచితంగా బియ్యం, ఆసరా పథకం, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, హాస్టల్లు, రెసిడెన్షియల్ స్కూల్స్ ముందుకు తెస్తుంది. వంద రోజులు పని కల్పనతో వారికి ఉపాధి కల్పించడం ద్వారా ప్రయివేటు వ్యక్తులు కూలడంతో కూలి ఇవ్వాలనే బేరం చేసే శక్తి పెరుగుతుంది. ఓర్వ లేని వారు వాటిని విమర్శిస్తారు. గరికపాటి గుడ్లు ఎందుకు? మధ్యాహ్న భోజన మెందుకు ? అని వాగి ఎండి రాలిన ఆకుతో, గడ్డి పోచతో సమానమయ్యాడు.

### శాంతియుత సహజీవనం కోసం ప్రభుత్వాలు

పేదలకు సరైన కూలి, ఉపాధి, పోషకాహార సమస్యలను పరిష్కరిం చక పోతే సామాజిక సంఘర్షణలు పెరుగుతాయి. అందుకని అనేక పథకాలు ప్రవేశ పాడుతాయి. ప్రభుత్వం ప్రభుత్వ విద్య వైద్యం అందించ లేక స్కాలర్ షిప్ప, ఆరోగ్యశ్రీ ప్రవేశ పెడుతుంది. మహి ళా చైతన్యం పెంచడానికి ఎన్నో సమస్యలు చర్చిస్తారు. మహిళలకు వంచిత బస్సు సౌకర్యం తో వారి కదలికలు పెరుగుతాయి. చైతన్య వంతులవుతారు. ఉచిత బస్సు సౌకర్యంతో ఎన్ని మీటింగులైనా పోవచ్చు . తామే మీటింగులు పెట్టుకోవచ్చు.

ఇలా సమస్య ఒకటే అయినా పరిష్కారాలు అనేక రకాలు. ఉద్యోగం లేక పోతే స్వయం ఉపాధి. కట్నాలు ఎక్కువైతే కులాంతర వివాహాలు చేసుకోవచ్చు. బయటి నీరు చాలక పోతే ఇంకుడు గుంతలతో నీల్లు నిలుపుకొని బావి నీల్లు చేదుకోవచ్చు. బెంగుళూరులో లక్షల బావులు తవ్వుకుంటున్నారు.

వాతావరణంలో వేడి పెరిగితే ఏసీ పెట్టు కోవచ్చు. ఇంటి చుట్టూ చక్కని చెట్లు పెంచుకోవచ్చు.


పెళ్లయ్యాక రాజీ పరస్పరం గౌరవంగా ప్రవర్తిస్తే సమస్య పరిష్కారమవుతుంది కుదరక పోతే విడాకులు తీసుకోవచ్చు. మరో పెల్లి చేసుకోవచ్చు. అట్లే ప్రభుత్వం నచ్చక పోతే ఓడించి ప్రభుత్వాన్ని మార్చుకోవచ్చు.

ఇలా ఒకే సమస్యకు అనేక పరిష్కారాలు ఉండడం వల్ల ఆయా పార్టీలు సమస్యల పరిష్కారానికి వేర్వేరు ఎన్నికల మ్యానిఫెస్టోలు ప్రవేశపెట్టాయి. ఆకర్షణకు ఓట్లు కూడా పడే విధంగా ప్రకటిస్తారు. ప్రేమికుల మధ్య కూడా ఇలా రకరకాలుగా హామీలు ఇస్తున్నారు. ఓటు పడ్డాక ఎన్నికల హామీల వలెనే ఏ గ్యారంటీ ఉండదు . కనక ప్రేమించేటపుడే ఓటు వేసేటప్పుడే, జాగ్రత్తగా ఉండాలి.

### సైన్సు టెక్నాలజీతో పరిష్కారాలు

రైలు బస్సు వచ్చి అన్ని కులాలను ఒకచోట సమానంగా కూర్చునే అవసరాన్ని తెచ్చింది. అంటరాని తనం విషయంలో సంఘ సంస్కర్తలు చేయ లేక పోయిన పనిని బస్సులు, హోటల్లు, సినిమా హాల్లు , స్కూల్లు చేసాయి. ఆయా శాఖల్లో కుల మతాతీతంగా లంచాలు పంచుకునే సమానత పెరిగింది. చర్చీల్లో, మీటింగుల్లో సామూహికంగా పెళ్లిళ్లు జరపడం ఒక పరిష్కారం.

కుల నిర్మూలన జరగాలి అనడం ఒక ప్రచారం. అన్ని కులాలు కలిసి జీవించడం పరిష్కారం. ప్రతి ఇంట్లో ఇతర కులాల అల్లుళ్లు , కోడళ్లు రావడం ఒక పరిష్కారం. భారత రాజ్యాంగం అందరూ సమానమే అని ఓటు హక్కు ఇచ్చింది. ఓటు హక్కుతో తమ సమస్యలను పరిష్కరించుకోవడం తెలివైన వారి పరిష్కారం. ఇలా ఇంకా ఎన్నో రకాల పరిష్కారాలు.



**- బి ఎస్ రాములు**
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# "డీలిమిటేషన్"పై దక్షిణాది రాష్ట్రాలలో ఆందోళన



రాబోయే డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియ భారత రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీసింది. జనాభా ప్రాతిపదికన లోక్ సభ స్థానాల పునర్విభజన జరగనున్న నేపథ్యంలో, ఇది ఉత్తరాది రాష్ట్రాలకు అనుకూలంగా, దక్షిణాది రాష్ట్రాలకు ప్రతికూలంగా మారుతుందన్న ఆందోళన బలంగా వ్యక్తమవుతోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఓ టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో ఈ ప్రతిపాదనను "బీజేపీ-అంకెల గారడీ"గా అభివర్ణించి అందులో ఉన్న మర్మాన్ని విప్పిచెప్పారు. తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల నేతలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం గమనార్హం . ఈ వివాదం కేవలం రాజకీయ వైరంగా కాకుండా, భారత సమాఖ్య నిర్మాణానికి మూలస్తంభమైన సమాన ప్రాతినిధ్యం అనే సున్నితమైన అంశంపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది.

డీలిమిటేషన్ ప్రక్రియపై దక్షిణాది నేతల ఆందోళనకు ప్రధాన కారణం గణాంకాలు. 1971లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ చేసిన రాజకీయ నిర్ణయం కారణంగా లోక్ సభలో రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని ఆ ఏడాది జనాభా ప్రాతిపదికన స్తంభింపజేశారు. కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు ఆ స్తంభన ఒక రకమైన రక్షణగా నిలిచింది . ప్రస్తుతం ప్రతిపాదితమైన కొత్త డీలిమిటేషన్ ఈ 1971 జనాభా లెక్కలను తొలగించి, తాజా జనాభా ప్రాతిపదికన స్థానాలను కేటాయిస్తే, దక్షిణాది రాష్ట్రాలు విజయవంతంగా అమలు చేసిన జనాభా నియంత్రణకు శిక్ష అనుభవించినట్లవుతుంది.

రేవంత్ రెడ్డి లెక్కల ప్రకారం, ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల వద్ద 543 లోక్సభ స్థానాల్లో 130 ఉన్నాయి. స్థానాల సంఖ్యను 50 శాతం పెంచితే (అంటే మొత్తం 815 స్థానాలు), దక్షిణాది వాటా కేవలం 195కి పెరుగుతుంది. కానీ ఉత్తరాది రాష్ట్రాలు 413 నుంచి 620 స్థానాలకు ఎగబాకుతాయి . ఈ లెక్క ప్రకారం, ఉత్తరప్రదేశ్ ఒక్కటే ప్రస్తుతం ఉన్న 80 స్థానాల నుంచి సుమారు 120 స్థానాలకు చేరుకుంటుంది. తమిళనాడు, పుదుచ్చేరి కలిపి 40 నుంచి 60కి మాత్రమే పెరగడం ఈ అసమానతను స్పష్టం చేస్తుంది . ఈ పరిణామం వల్ల ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాలు కలిసి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత బలాన్ని సంపాదించుకుంటాయని, దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా అప్రస్తుతం అవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ ఆందోళనలోని వాస్తవికతను అర్థం చేసుకోవాలంటే, భారతదేశంలోని ఆర్థిక, సామాజిక వైవిధ్యాన్ని గమనించాలి. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలోనే కాదు, తలసరి ఆదాయం, మానవ అభివృద్ధి సూచీ, విద్య, ఆరోగ్య రంగాల్లోనూ ఉత్తరాది రాష్ట్రాల కంటే చాలా ముందున్నాయి. ఈ రాష్ట్రాల తలసరి ఆదాయం ఉత్తరాది రాష్ట్రాల కంటే దాదాపు రెట్టింపు ఉంటుంది. కానీ, జనాభా ప్రాతిపదికన మాత్రమే రాజకీయ ప్రాతినిధ్యాన్ని నిర్ణయిస్తే, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్న రాష్ట్రాలకే ఎక్కువ అవకాశం లభించి, అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలను వెనక్కు నెట్టినట్లవుతుంది. కర్ణాటక సీఎం సిద్దరామయ్య ఈ విషయాన్ని "డెమోగ్రాఫిక్ పనిష్మెంట్" (జనాభా ఆధారిత శిక్ష)గా అభివర్ణించారు .

అయితే, ఈ సమస్యకు మరో కోణం కూడా ఉంది. 1971 నుంచి జనాభా ప్రాతిపదికన స్థానాలను స్తంభింపజేయడం వల్ల ఉత్తరాది రాష్ట్రాలు గత ఐదు దశాబ్దాలుగా తమ జనాభాకు తగిన ప్రాతినిధ్యాన్ని పొందలేకపోతున్నాయి. బీహార్ జనాభా తమిళనాడు కంటే దాదాపు రెట్టింపు ఉన్నా, లోక్సభలో రెండు రాష్ట్రాల స్థానాల సంఖ్యలో పెద్దగా తేడా లేదు. ప్రజాస్వామ్యంలో "ఒక్కో వ్యక్తికి ఒక్కో ఓటు, ఒక్కో ఓటుకు ఒక్కే విలువ" అనే సూత్రం ప్రాథమికమైనది. ఈ సూత్రం ప్రకారం చూస్తే, జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ స్థానాలు రావడం సహజం.ఈ వాదనను బీజేపీ, ఇతర ఉత్తరాది రాష్ట్రాల నేతలు ముందుకు తెస్తున్నారు.

రెండు వైపుల వాదనల్లోనూ నిజం ఉన్నా, ఇది కేవలం సంఖ్యాపరమైన చర్చ మాత్రమే కాదు. సమాఖ్య నిర్మాణం ఉన్న ప్రతి దేశంలోనూ ప్రాతినిధ్యం, వనరుల కేటాయింపు విషయంలో ఇటువంటి సవాళ్లు ఎదురవుతాయి. దక్షిణాది రాష్ట్రాలు భారత జీడీపీకి, పన్ను ఆదాయానికి చేస్తున్న సహకారం అపారమైనది . రాజకీయ ప్రాతినిధ్యం తగ్గడం వల్ల వాటి ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఒకవేళ దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి 100 శాతం స్థానాలు గెలుచుకున్నా, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని పరిస్థితి ఏర్పడుతుందన్నది వాస్తవమైన ఆందోళన.

ఈ సందిగ్ధ పరిస్థితికి పరిష్కారం చర్చల ద్వారానే సాధ్యం. డీలిమిటేషన్ ను జీరో-సమ్ గేమ్ (ఒకరి లాభం మరొకరి నష్టం)గా చూడకుండా, మొత్తం లోక్ సభ స్థానాల సంఖ్యను పెంచడం, హైబ్రిడ్ ఫార్ములాను అనుసరించడం వంటి ప్రత్యామ్నాయాలపై చర్చ జరగాల్సి ఉంది. జర్మనీ, యూరోపియన్ పార్లమెంట్లో అనుసరించే "డైగ్రెసివ్ ప్రొపోర్షనాలిటీ" (జనాభా పెరుగుదలకు అనుగుణంగా స్థానాలు పెంచడం, కానీ పూర్తి ప్రాతినిధ్యం కల్పించకపోవడం) వంటి మోడల్స్ కూడా ఇందుకు ఉపయోగపడతాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కూడా డీలిమిటేషన్ తో ముడిపడి ఉండటంతో, ఈ సమస్యకు త్వరితగతిన పరిష్కారం అవసరమైంది.

ఈ సందర్భంలో, ఉత్తరాది-దక్షిణాది విభజన రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం కంటే, దేశ సమగ్రతకు, సమాన ప్రాతినిధ్యానికి భంగం కలగకుండా చూసే విధానం అవసరం. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో చేసిన కృషిని గౌరవించాలి. అదే విధంగా, ఉత్తరాది రాష్ట్రాల ప్రజలకు వారి జనాభాకు తగిన ప్రాతినిధ్యాన్ని కల్పించడం కూడా ప్రజాస్వామ్య విలువల్లో భాగమే. ఇది ఏ ఒక్క పార్టీకి అనుకూలమో, ప్రతికూలమో కాదు; భారత ప్రజాస్వామ్యం యొక్క పరిపక్వతకు సంబంధించిన ప్రశ్న. ఈ సున్నితమైన సమతుల్యతను దెబ్బతీసే ఏ నిర్ణయమైనా దేశంలోని సమాఖ్య స్ఫూర్తికి, సామాజిక సామరస్యానికి నిలువెత్తు మచ్చగా మిగిలిపోతుంది.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

# సమాన పనికి సమాన వేతనం కల్పించాలి

- ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్ ఏజెన్సీలను రద్దు చేయాలి
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ...




**ముషీరాబాద్, మార్చి 28 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో, సంస్థలలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ డైలీ వేజెస్ వంటి వివిధ రూపాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, దశలవారీగా వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు ఑ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్ ఏజెన్సీలను రద్దు చేయాలనీ, వివిధ రూపాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె. వెంకటేష్ మాట్లాడుతూ రెండు లక్షలకు పైగా ఉద్యోగులు గత 25 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలలో ఇద్దరు రూపంలో పనిచేస్తున్నారని, పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ సమాన వేతనాలు కల్పించడం లేదని, సెలవులు, ఆరోగ్య బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి సదుపాయాలు ఏవీ లేవనీ, ఉద్యోగులు తీవ్రమైన పనిభారం, వేధింపులు తదితర తమ సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ సమయంలో రూ.10 లక్షలు గ్రాట్యుటీ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యే లోగా రాష్ట్ర ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని, లేని పక్షంలో తమ కార్యాచరణను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉపాధ్యక్షులు ఎం. పద్మశ్రీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ తలరాతలు మారతాయని ఉద్యమంలో పాల్గొన్నారనీ, రాష్ట్రమైతే వచ్చింది కానీ, ఈ ఉద్యోగుల జీవితాల్లో మార్పు రాలేదని అన్నారు. గత ప్రభుత్వం ఏజెన్సీ విధానం రద్దు చేస్తానని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత కలుగుతుందని భావించిన వీరికి నిరాశే ఎదురైందన్నారు. ఏజెన్సీ విధానం రద్దు కాకపోగా అనేక శాఖల్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తొలగింపుకు గురై రోడ్ల పై పడుతున్నారని, కొనసాగింపు ఉత్తరువుల కోసం నెలల తరబడి అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. విద్య, ఆరోగ్య, వైద్య శాఖల్లో నైతే నెలల తరబడి జీతాలు రాక, కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియక మానసికంగా కుంగిపోతున్నారన్నారు. అప్పుల బాధతో ఆర్థికంగా చితికిపోతున్నారనీ, మరోపక్క ఏజెన్సీ సంస్థలు వీరిని దోచుకుంటున్నాయనీ చెప్పారు. అనేక డిపార్ట్మెంట్లలో జీఓ. నెం.60 ప్రకారం వేతనాలు చెల్లించట్లేదు. వీటన్నింటికీ తోడు రాష్ట్ర ప్రభుత్వం 30 వేల మంది కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను తొలగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు కుమారస్వామి, జగదీష్ లు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ గురించి ఊసే లేదనీ, 25 సంవత్సరాలకు పైగా ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల భవిష్యత్ అగమ్య గోచరంగా మారిందన్నారు. పని భారం, మానసిక వేదన కారణంగా ఇటీవల అనేక మంది కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అకాల మరణం పాలవుతున్నారనీ, ప్రభుత్వం తక్షణమే స్పందించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు ఑ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిూస్ సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఏప్రిల్ 19 న రాష్ట్రస్థాయి భారీ సభ ను జరిపి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు రాజిరెడ్డి, వై. సోమన్న, తుమ్మల సాంబయ్య, గిరి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ సంస్థల దోపిడీ ఆపాలి

- చికెన్ వ్యాపారుల ఆవేదన
- ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా దుకాణాల మూసివేతకు పిలుపు




**మల్కాజిగిరి, మార్చి 28 (జనంసాక్షి) :** పౌల్ట్రీ రంగంలో కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యం వల్ల చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని మల్కాజిగిరి చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ ఆరోపించింది. శనివారం మల్కాజిగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కోళ్ల ఫారాల నుంచి రిటైల్ మార్కెట్ వరకు కార్పొరేట్ సంస్థలే నిర్ణయాధికారం చెలాయిస్తూ, సామాన్య వ్యాపారుల కడుపు కొడుతున్నాయని మండిపడ్డారు. ఇష్టానుసారంగా ధరలను పెంచడం, తగ్గించడం వల్ల రిటైల్ వ్యాపారులు భారీగా నష్టపోతున్నారు. వ్యాపారులకు రావాల్సిన కనీస మార్జిన్‌ను తగ్గించి, లాభాలన్నీ సంస్థలే పొందుతున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 50 వేల చికెన్ షాపుల నిర్వాహకులు ఈ దోపిడీ వల్ల ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని వివరించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి కార్పొరేట్ సంస్థల ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయాలని, లేనిపక్షంలో ఏప్రిల్ 1వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా చికెన్ దుకాణాలను మూసివేసి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన అసోసియేషన్ సభ్యులు, చికెన్ వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చేర్యాల పట్టణంలో మూతపడ్డ హోటళ్లు

- గ్యాస్ కొరతనే కరణమంటున్న వ్యాపారులు



**చేర్యాల, మార్చి 28 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో శనివారం టిఫిన్ సెంటర్లు, హోటళ్లు ముసివేయడంతో చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సాధారణంగా చేర్యాల పట్టణంలో ఉదయం నుండి రాత్రి వరకు రద్దీగా ఉండే హోటళ్లు, టిఫిన్,టీ సెంటర్లు ఎప్పుడూ రద్దీగా ఉంటాయి. అటువంటి హోటళ్లు మూసివేయడంతో టిఫిన్స్, భోజనానికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హోటల్ యజమానులను ఈ విషయంపై సంప్రదించగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ కొరత కారణం అని చెబుతున్నప్పటికీ, ఇన్ని రోజులు లేని గ్యాస్ కొరత ఇప్పుడే ఎందుకు వచ్చినట్టు, ఇన్ని రోజులు సజావుగా నడిచిన హోటళ్లు ఇప్పుడే ఎందుకు మూతపడట్టు...ఈ విషయంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా హోటలు వ్యాపారులు గ్యాస్ సరఫరాలో అంతరాయం అని చెబుతున్న కావాలనే ప్రభుత్వంపై చెడ్డపేరు తీసుకురావాలనే కారణంతో ఇలా చేతున్నారు అనే అపవాదు ఉంది అని కొందరు అంటున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు హోటల్లపై ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తుండటం ప్రధాన కారణం అని తెలుస్తుంది. పట్టణంలోని చాలా హోటల్లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకు బదులు ఇంట్లో వాడే సిలిండర్లను వాడుతునట్టు అధికారులకు సమాచారం ఉందని,ఈ విషయంపై శనివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలకు వస్తున్న ఈ విషయం హోటల్ యజమానులను తెలియడంతోనే పట్టణంలోని హోటళ్లు ముసివేసినట్టు సమాచారం. సంబంధిత అధికారులు స్పందిస్తేనే అసలు కారణం ఏమిటో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టులు



**అయిజ, మార్చి 28 (జనం సాక్షి) :** అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు అన్నారు. అలంపూర్ నియోజకవర్గశీ అయిజ మండల కేంద్రంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆశా వర్కర్లు తలపెట్టిన 'చలో అసెంబ్లీ' తలపెట్టారు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమైన ఆశా వర్కర్లను పోలీసులు శనివారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా అయిజ మండలం నుండి భారీ సంఖ్యలో ఆశా వర్కర్లు హైదరాబాద్‌కు తరలివెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అయితే, ఈ పర్యటనను భగ్నం చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు అర్ధరాత్రి నుంచే రంగంలోకి దిగారు. పలువురు యూనియన్ నాయకురాళ్ల ఇళ్ల వద్ద నిఘా ఉంచడంతో ఆశ వర్కర్ల నాయకురాలను అరెస్టు చేశారు.

### పోలీస్ స్టేషన్ వద్ద భారీ నిరసన

అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఆశా వర్కర్లు అయిజ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిక్స్డ్ వేతనాలను పెంచాలని,ఎన్నికల హామీ ప్రకారం నెలకు రూ. 18,000 కనీస వేతనం తక్షణమే అమలు చేయాలన్నారు. బకాయిల వెంటనే విడుదల చేయాలని,నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని ఆశా వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యాలు కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. అనంతరం "నాయబద్ధంగా, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేస్తోంది. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు. మా సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదని వారు అన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగంవచేసుకోవాలి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**నారాయణపేట, మార్చి 28 (జనం సాక్షి) :** పేద ప్రజలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకో వాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నా రు.శనివారం ఆయన కార్యాలయంలో నారాయ ణపేట నియోజక వర్గానికి చెందిన ప్రవీణ్ కు సి ఎం రిలీఫ్ ఫండ్ కింద 20 వేల చెక్కును అందజేశారు.నారా యణపేట పట్టణానికి చెంది న అనారోగ్యంతో బాధపడిన వారికి వైద్య ఖర్చుల నిమి త్తం ప్రభుత్వం పరంగా చెక్కు లుఅందజేశారు.ఈ సంద ర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడు తూ ప్రతి వ్యక్తి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథ కాలను సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయ వాది నందు నామాజీ మాట్లాడుతూ చెక్కు అందజేసిన మంత్రి కిషన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గోపాల్ యాదవ్,నవీన్ , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సమాజంలో ప్రశాంతత నెలకొల్పడమే లోక్ అదాలత్ లక్ష్యం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డిఎల్ఎస్ఎ చైర్మన్ రమాకాంత్




**నాగర్‌కర్నూల్, మార్చి 28 (జనంసాక్షి) :** సమాజంలో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పవడమే లోక్ అదాలత్ లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ రమాకాంత్ పేర్కొన్నారు. శనివారం జిల్లా ప్రధాన న్యాయస్థానం కోర్టు హాలులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ (డి ఎల్ ఎస్ ఎ)ఆధ్వర్యంలో లుక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులను ఉద్దేశిస్తూ ఆయన మాట్లాడుతూ, సమాజంలో కొంతమంది విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతూ, కేసుల పాలవుతూ కోర్టు ల చుట్టూ తిరుగుతున్నారని ఇలాంటి కేసులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని అన్నారు. సంవత్సరాల తరబడి పరిష్కారానికి నోచుకోకుండా కేసుల కోసం కక్షిదారులు కోర్టు ల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికోసం సత్వర పరిష్కారం అందించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రధాన న్యాయస్థానం ఆదేశానుసారం లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా కక్షిదారులు ఇరుపక్షాల అంగీకారంతో కేసులు పరిష్కరించుకుంటే సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ద్వారా కక్షిదారుల డబ్బులు, సమయము వృధా కాకుండా చూడటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. వివాహ సంబంధిత కేసుల్లో పిల్లలు ఉన్న దంపతులు పట్టుదలకు వెళ్లి విడిపోవడానికి సిద్ధమవుతున్నారనీ దాని ఫలితంగా పిల్లల భవిష్యత్తు అంధకారంగా మారుతుంది అని అన్నారు. ఇలాంటి వివాహ సంబంధిత కేసులలో పిల్లల భవిష్యత్తుకు సంబంధించి కొంచెం కలవరపెడుతుంది అని అన్నారు. భార్యాభర్తలు ఇరువురు ఒకరికొకరు అర్థం చేసుకొని కలిసి ఉంటే వారి పిల్లల భవిష్యత్తు వారి భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. కేసుల పరిష్కారం కోసం ప్రధాన న్యాయస్థానం ఆదేశానుసారం మధ్యవర్తిత్వం (మీడియేషన్) ద్వార అనుభవజ్ఞులైన న్యాయవాదులను నియమిస్తూ మీడియేషన్ కార్యక్రమం ద్వారా ఇరుపక్షాలను సంతృప్తి పరుస్తూ కేసులను పరిష్కరించేందుకు వారిని నియమించింది అని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ సమాజంలో ప్రశాంతమైన, గౌరవమైన జీవితాన్ని కోరుకోవాలంటే, చట్టాలను, తోటివారిని గౌరవిస్తూ గౌరవప్రదమైన జీవితాన్ని సొంతం చేసుకోవాలని అన్నారు. సమాజ హితం కోసం నేర రహిత సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలు న్యాయ పరిష్కారం కోసం ఏర్పాటు చేయబడినవని దీనిని కక్షిదారులు అందరూ వినియోగించుకుని న్యాయం పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫోక్సో న్యాయమూర్తి నసీమా సుల్తానా తోపాటు బార్ ప్రెసిడెంట్ కె. రవి కాంతారావు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, పోలీసు శాఖ, బ్యాంకు మేనేజర్లు, కక్షిదారులు పాల్గొన్నారు.

## మహిళలు స్వయంకృషితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు బి.ఎన్.రామ్మోహన్




**శామీర్‌పేట, మార్చి 28 (జనం సాక్షి) :** మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగితేనే సమాజంలో తగిన గుర్తింపు దక్కుతుందని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు బి.ఎన్.రామ్మోహన్ అన్నారు. కీసర సర్కిల్ శామీర్‌పేట డివిజన్ లోని రోషిని స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ జరిగిన పట్టభద్రుల వేడుకల కార్యక్రమానికి బి.ఎన్.రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రోషిని స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. కుటుంబంలో ఒక మహిళ ఎదుగుదల ఆ కుటుంబంతో పాటు సమాజం, దేశంపై కూడా ప్రభావం ఉంటుందన్నారు. నేర్చుకున్న పరిజ్ఞానం వృధా కాకుండా నిరంతరం కష్టపడి సమాజంలో ప్రేమ, గౌరవాన్ని దక్కించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రోషిని స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ లో టైలరింగ్, కంప్యూటర్, బ్యూటిషన్ రంగాల్లో శిక్షణ పొందిన 102 మంది మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అదేవిధంగా చిన్నపిల్లల తల్లులకు బేబీ కిట్లను అందజేశారు. ఈ వేడుకల్లో పలువురు మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ట్రైల్ బ్లైజర్ ఫౌండేషన్ ఇండియా, రోషిని స్కిల్ డెవలప్మెంట్ వ్యవస్థపాక డైరెక్టర్ డి.ఆర్.రాగ్లాండ్, పాస్టర్ శిబు పరయిల్, డా.రుబెల్లా రాగ్లాండ్, ఇంచార్జి సోలేమాన్, విన్సెంట్,టీచర్లు విజయలక్ష్మి, నయుమి, ప్రియా, తదితరులు పాల్గొన్నారు.

# మాతా శిశు మరణాలను నివారించాలి

- కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ బాదవత్ సంతోష్



**నాగర్‌కర్నూల్, మార్చి 28 (జనంసాక్షి) :** అధిక ప్రమాదకర గర్భవతులను ముందే గుర్తించి వెంటనే తగిన సంరక్షణ చికిత్స అందించడం ద్వారా మాతా శిశు మరణాలను నివారించవచ్చని కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ బాదవత్ సంతోష్ తెలిపారు. శనివారం నాడు నాగర్కర్నూల్ జిల్లా కలెక్టరేటులోని సమావేశ మందిరంలో అధిక ప్రమాదకర గర్వధారణ నిర్వహణ మరియు నియమవళి పై ఏఎన్ఎం లకు ఒక రోజు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నాగర్ కర్నూల్ జిల్లాలో 1000 మంది మగ శిశువులకు 894 అమ్మాయిలే పుడుతున్నారు, దీనివలన భవిష్యత్తులో సమాజంపై తీవ్రమైన ప్రభావం ఉంటుంది. కావున ఆరోగ్యశాఖ మరియు ఇతర శాఖలతో కలిసి సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి భ్రూణ హత్యలను నివారించి అమ్మాయిలను సంరక్షించాలని వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లాలో ఏదైనా స్కానింగ్ సెంటర్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్టు మీ దృష్టికి వస్తే వ్యక్తిగతంగా తన దృష్టికి తీసుకురావాలని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గర్భిణీ స్త్రీలు మొదటి రెండవ పరీక్ష తదనంతరం మూడవ, నాలుగవ పరీక్షకు రాని వారిపై ప్రత్యేక దృష్టిసారించాలని, మొదటి కాన్పులో ఆడ శిశువు కలవారు రెండవసారి గర్భధారణ ధరించినప్పుడు వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని, ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారని సిబ్బందికి తెలియచేశారు. ప్రమాదకర గర్భవతులను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన సంరక్షణ, చికిత్స ప్రారంభించడం వల్లన మాతా శిశు మరణాలను అరికట్టగలమని తెలియజేశారు. అమ్మాయిలకు గర్భాశ ముఖద్వారా క్యాన్సర్ రాకుండా 14 సంవత్సరాలు నిండిన బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు కలిగించి హెచ్ పి వి టీకాకరణ కార్యక్రమాన్ని విజయవంతం సిబ్బందికి సూచించారు. జిల్లాలో గుర్తించిన 86 హైరిస్క్ గ్రామాలలో ప్రత్యేక టీబి నిర్ధారణ పరీక్షా శిబిరాలు నిర్వహిస్తున్నారు కనుక 14 సంవత్సరాలు పైబడిన వారందరికీ శిబిరానికి హాజరై పరీక్షలు నిర్వహించుకునే విధంగా ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని తెలియజేశారు. తదనంతరం ఆర్మన్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర శిక్షకులు డాక్టర్ కావ్య, డాక్టర్ శ్రావణి అధిక ప్రమాదకర గర్భధారణ నిర్వహణపై మరియు నియమావళి (పైపిపిటి) ద్వారా శిక్షణ అందించారు. ఆన్లైన్లో ప్రీ టెస్టు, పోస్ట్ టెస్టు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ డాక్టర్ కే రవికుమార్, డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ తారా సింగ్, డాక్టర్ భీమా నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ రఫీక్, డాక్టర్ ప్రదీప్, పర్యవేక్షణ సిబ్బంది కోట్ర నిరంజన్, విజయ్ కుమార్, రాజేశ్వర్, హెల్త్ ఎడ్యుకేటర్ నరసింహ, రాధా, పి హెచ్ ఎన్ మంగమ్మ, డీడీఎం నవీన, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు కూలి డబ్బులను వెంటనే చెల్లించాలి



**గద్వాల టౌన్, మార్చి 28 (జనంసాక్షి) :** శనివారం గద్వాల మండలంలోని శెట్టి అత్మూర్,సంఘాల గ్రామాలలో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేర్ నరసింహ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచే విధంగా చర్యలు తీసుకుంటోందని విమర్శించారు.గ్రామీణ పేదలు,వ్యవసాయ కూలీలు,నిరుద్యోగ యువతకు ఉపాధి హామీ చట్టం ఎంతో మేలు చేస్తోందని కానీ నిధులు తగ్గించడం ద్వారా పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని అన్నారు.శెట్టి అత్మూర్,సంఘాల గ్రామాల్లో కూలీలకు రెండు నెలలుగా కూలి డబ్బులు ఇవ్వకపోవడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు.పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం,రెండు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లినా ప్రయాణ భత్యం లేకపోవడం వంటి సమస్యలను ప్రస్తావించారు.నెలల తరబడి కూలి డబ్బులు ఇవ్వకపోతే కూలీలు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగానే సరిపడ నిధులు కేటాయించకుండా ఉపాధి పథకాన్ని బలహీనపరుస్తున్నాయని ఆరోపించారు.పేదలకు నష్టం కలిగించే విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ నెల 30న నిర్వహించే ధర్నాలో జిల్లాలోని ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, సవారన్న,చిన్న హనుమంతు, రాజయ్య, సునీత, లక్ష్మి, జయమ్మ, మహేశ్వరి, యశోద, మహేష్, రాజేశ్వరి, రాము తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
29 మార్చి 2026

# జాతీయ సంపదను తోడేస్తుండ్రు..!

- అక్కడ అక్రమార్కులకు పర్మిషన్లు అక్కర్లేదు..
- అక్కడ అక్రమార్కులకు అధికారులే అండదండలు..
- అక్కడ సక్రమార్కులకు మాత్రమే నియమా నిబంధనలు ..
- యథేచ్ఛగా నదులు, వాగులు, వంకలు
- గుట్టలలోని జాతీయ సంపదను
- కొల్లగొడుతున్న గుడ్లప్పగించి చోద్యం చూస్తున్న అధికారఘనం..
- అక్రమార్కులకి ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా..
- నడిగడ్డలో భవిష్యత్తు తరాల మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది అంటున్న పర్యావరణ సాధకులు..



**జోగులాంబ గద్వాల జిల్లా, మార్చి 27 (జనంసాక్షి) :** జోగులాంబ జిల్లాలో గత కొన్నేళ్లుగా ఇష్టారాజ్యంగా ఎలాంటి అనుమతులు లేకుండా అధికారుల కళ్ళు కప్పి గద్వాల ఇరువైపులా కృష్ణానది, తుంగభద్రా నది లలో ఇసుకను తోడేసి, గుట్టలలో ఉన్న మట్టిని తవ్వేసి అమ్ముకుంటున్న పిడికిటి మందిని అదుపు చేయలేక పోతుంది అధికార ఘనం. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ఇసుక పాలసీ సామాన్యులకు చుక్కలు చూపిస్తూ దళారులకు కాసులు కురిపిస్తోంది. అధికార గణం ప్రజాప్రతినిధుల అండదండలతో దోపిడీ కొనసాగిస్తున్నారని, పలుమార్లు పెద్ద ఎత్తున అధికారులకు తమ ప్రాంతాల్లో రేయి పగలు తేడా లేకుండా ఇసుక, మట్టి దందాను కొనసాగిస్తున్నారు. జిల్లాలో నిత్యము ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కావాలి అని అధికారులకు మొరపెట్టుకుంటున్న ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక గగనం అయిపోయింది కానీ అక్రమార్కుల ఇసక మట్టి మాఫియా మాత్రం ఇదేచ్ఛగా తోడేసి తవ్వేసి అక్రమార్జనకు ఒడిగట్టుతున్నారనే ఆరోపణలు వెల్లువేత్తుతున్నాయి . జోగులాంబ గద్వాల జిల్లా తుంగభద్ర పరివాహక ప్రాంతం నుంచి రాజధాని హైదరాబాదుకు లారీలతో ఇసుకను తరలించకపోతున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఆమ్యాతులకు మ్యామ్యాలు ఒక్కో లారీకి నెలకు 30 వేల రూపాయలు ఇస్తున్నట్లు కదా కొన్నేళ్లుగా పుకార్లు షికారు చేస్తూనే ఉన్నాయి, కానీ నేటికీ ఈ ప్రాంతం నుండి జాతీయ సంపద అక్రమంగా తరలిపోతలేదనేటువంటి విషయాన్ని అధికారులు ప్రజాప్రతినిధులు ఖండించడం లేదు అని అంటే ఎవరెవరికి ఎంతెంత దండుకుంటున్నారని ప్రచారం జరుగుతా ఉంది. ఈ ప్రాంతంలో ఏనాడు కూడా వారిపై వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేయలేదు, కానీ ఈ రెండు నదులలో తట్టేడు ఇసుక లేకపోవడం భవిష్యత్తులో ప్రాంత ప్రజల నీటి దాహార్తిని తీర్చడం ఎలా అనే అంశాన్ని మరిచిపోయి సోయి తప్పినట్టు ఉన్నారు అక్రమార్కులు. ఈ ప్రాంతం నుంచి రాజధాని హైదరాబాదుకు ఇసుక తరలింపు వెళ్లిపోతా ఉంటే జోగులాంబ గద్వాల జిల్లా కు కర్ణాటక నుంచి అక్రమ మార్గాల నుండి రాత్రిళ్ళు టిప్పర్ల ద్వారా ఇసక, మట్టి తరలిస్తున్నారు. ఇక్కడ కూడా ఎవరి వాటాలు వారికి అప్ప చెబుతూ, పట్టు పడినప్పుడు మాత్రంతూ తూ మంత్రంగా ఫైన్ లు వేసి మీరు హ్యాపీ మేము హ్యాపీ అన్న చందంగా తయారయింది,ఈ ప్రాంత ప్రభుత్వ అధికారుల తంతు. భూగర్భ జల శాఖ, మైనింగ్ శాఖ అధికారుల తీరుతో అక్రమార్కులు విచ్చలవిడిగా తమను ఎవరు అడిగే వారు లేరని తమ వ్యాపారాన్ని వారి అండదండతో మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నారు. నిన్నటికి నిన్న కర్ణాటక నుంచి వచ్చిన ఇసుకలోడుతో ఉన్న భారీ వాహనం కేటీ దొడ్డి మండలంలోకి వచ్చిందన్న సమాచారం పోలీసులకు, రెవెన్యూ అధికారులకు చేరింది, దీంతో అధికారులు ఆ వాహనం పట్టుకునేందుకు ప్రయత్నించారు, వాహన యజమానికి ఈ విషయం తెలియడంతో మైలగడ్డ సర్కిల్లో ఆ టిప్పర్ ఇసుకను అలాగే రోడ్డుపై పోసి పరారయ్యారు. రోడ్డుపై పోసిన ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో జాతీయ సంపదను కొల్లగొడుతున్న మాఫియాకు ప్రభుత్వంలోని భాగ్యస్వాములు, ప్రజాప్రతినిధుల అండదండలు, మీడియా మాధ్యమాల ప్రతినిధులు, ఎవరికి వారు చేతనైనంత నీకింత మాకింత అన్న చందంగా దోచుకుంటున్నారని, ఈ జాతీయ సంపదను కాపాడుకునేందుకు వందలాది ఫిర్యాదులు ఉన్నతాధికారులకు ప్రజలు తమ గ్రామ పరిసరాల్లో ఉన్న గుట్టలను ఇసుకను తరలించకపోతున్నారని నేరుగా ఫిర్యాదులు చేసినా,ఆయా శాఖల అధికారులు మాత్రం పై అధికారులని బురిడీ కొట్టించి తమ జేబులు నింపుకుంటున్న వైనంపై మీడియా మాధ్యమాలు పతాక శీర్షికల్లో రాసిన ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికైనా అక్రమార్కుల వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని, ఇలాగే ఈ దందా కొనసాగితే ఈ ప్రాంతంలోని ప్రజలకు నీటి నిలువలు లేక సాగునీరు తాగునీరుకు ఇక్కట్లు పడాల్సి వస్తుందని,ఆ కొంత మంది కోసం లక్షలాది ప్రజల నీటి దాహార్తిని ఆగం చేయొద్దని అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రజలు కోరుకుంటున్నారు.

## ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

- ప్రపంచ శాంతిని కాపాడాలి
- పెరిగిన గ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు



**సంగారెడ్డి టౌన్, మార్చి 28 (జనం సాక్షి) :** ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దాడులను వెంటనే ఆపాలని, దాడులు ఆపి ప్రపంచ శాంతిని కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్య వాదానికి తలొగ్గి దేశ ప్రయోజనాలను మోడీ ప్రభుత్వం తాకట్టు పెడుతుందని అన్నారు. ఇరాన్ పై దాడి వల్ల దేశంలో రోజు రోజుకు అన్ని వర్గాల జీవనోపాధిపై ప్రభావం పడుతుందని అన్నారు. అమెరికా అధ్యక్షుడు మన దేశ అంతర్గత విషయాల్లో పెత్తనం చేస్తూ ఉంటే మోడీ ఎందుకు నోరు ఎత్తడం లేదన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం ప్రజల మధ్య వైశమ్యాలను పెంచి పోషిస్తుందని, మతాల మధ్య అగ్గి రాజేస్తూ వాటి మధ్యలో కూర్చొని చలికాచుకుంటుందన్నారు. దేశంలో లౌకికవాదాన్ని మంట కలుపుతూ మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజా సమస్యలను దారిమల్లిస్తూ నియంతలాగా దేశాన్ని మోడీ పరిపాలిస్తున్నారని వాపోయారు. మహిళలు, ప్రజలు నడ్డి విరిచే విధంగా వంట గ్యాస్ ధరలు పెంచి ప్రజలకు తీవ్ర బారాలు వేసిందని ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ కలిపి చేస్తున్న యుద్ధం వలన ప్రజలపై భారం పడుతోందని న్నారు. దేశంలో వంట గ్యాస్ ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి, చిల్లర వర్తకులు తీవ్ర ఇబ్బందులు పడతారని తక్షణమే వంట గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యవసర వస్తువులు ధరలు పెద్ద ఎత్తున పెరిగాయని కార్మికుల ఉద్యోగులు వేతనాలు మాత్రం పెంచడం లేదని వెంటనే ధరలు తగ్గించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, కృష్ణ, నాయకులు అశోక్, సతీష్ , రాజేష్, అర్జున్, విఠల్, శివ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతో విస్తృతంగా కెమెరాల ఏర్పాటు

- కెమెరాలతో దొంగతనాలకు అడ్డుకట్ట
- ఒక్క కెమెరా వంద మంది పోలీసులకు సమానం
- మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 28 (జనం సాక్షి) :** నేర రహిత సమాజ నిర్మాణంలో సీసీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానమని ఆయన అన్నారు.మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మున్సిపల్ చైర్మన్, మాజీ చైర్మన్, కౌన్సిలర్ల సహకారంతో 60 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల ప్రారంభోత్సవాన్ని జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. దొంగతనాలు, చోరీలు జరిగితే సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను సులభంగా గుర్తించి పట్టుకోవచ్చని చెప్పారు. ఇప్పటికే అనేక కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడినట్లు వెల్లడించారు. జిల్లాలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా సీసీ కెమెరాల ఏర్పాటు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజల సహకారంతో మరింత భద్రత కల్పించడమే లక్ష్యమని చెప్పారు. ప్రతి కాలనీ, గ్రామంలో కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలపై నియంత్రణ సాధ్యమవుతుందని సూచించారు.దాతలకు జిల్లా ఎస్పీ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, టౌన్ సీఐ మహేష్, ప్రజాప్రతినిధులు, దాతలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలతో సత్వర న్యాయం

- లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు
- న్యాయమూర్తి ఎం. హేమలత




**నర్సాపూర్, మార్చి 28 (జనం సాక్షి) :** జాతీయా లోక్ అదాలతో సత్వర న్యాయం జరుగుతుందని న్యాయమూర్తి ఎం హేమలత అన్నారు నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో న్యాయమూర్తి ఎం హేమలత పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని, లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని అన్నారు కక్షిదారులు గ్రామీణ ప్రాంతాల్లో క్షణికావేశంలో ఇరువర్గాలు తగదా పడి కోపతాపాలు పెంచుకొని పరస్పరం కేసులు నమోదు చేయించుకొని కోర్టు చుట్టూ తిరుగుతూ తమ తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోవడం మంచిది కాదని సూచించారు రాజీ చేయదగ్గ కేసులలోఇరు వర్గాలు రాజీ కుదుర్చుకొని జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకొని ప్రేమానురాగాలతో కలిసిమెలిసి ఉండడమే ఉత్తమం అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.రాఘవేందర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ డి.శ్రీధర్ రెడ్డి, బార్ అధ్యక్షులు జి.శ్రీనివాస్ గౌడ్,లీగల్ సర్వీస్ బెంచ్ మెంబర్ న్యాయవాది మధు శ్రీ శర్మ,లీగల్ సర్వీస్ న్యాయవాది సి.హెచ్. స్వరూప రాణి, సీనియర్ న్యాయవాది ఏ.అంజిరెడ్డి, ఏ.శ్రీనివాస్, సత్యనారాయణ, సుధాకర్, ఆనంద్ కుమార్, ప్రభు, రాజు నాయక్, రవినాయక్, ఎం.ఏ.బేగ్, బ్యాంకు మేనేజర్స్, కోర్ట్ పోలీస్ కానిస్టేబుల్స్, లీగల్ సర్వీస్ సిబ్బంది కోర్టు సిబ్బంది కక్షి దారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆధునిక పద్ధతులతో లాభదాయక పంటల సాగుపై దృష్టి పెట్టాలి

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్, మార్చి 28 (జనంసాక్షి) :** అధిక సాంద్రత కలిగి పత్తి సాగు చేస్తే రైతులకు మేలైన దిగుబడి తోపాటు పంట లాభదాయకంగా ఉంటుందని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. నివారం పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు అధిక సాంద్రత పత్తి పంట సాగు పై కిసాన్ మేళా, పంట ప్రదర్శన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ, రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తూ లాభదాయక పంటల సాగుపై రైతుల దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలలో వేసిన పంటలే వేయకుండా పంట మార్పిడి చేయాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో రైతులందరూ వరి సాగుపైనే ఎక్కువ దృష్టి పెడతారని, దీనివల్ల నాలుగు నెలల్లో వచ్చే ఆదాయం అనుకున్నదానికంటే చాలా తక్కువగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఉన్న వ్యవసాయ క్షేత్రంలో కొంత భాగంలో వరి వేసుకుని మిగతా భాగంలో పంట మార్పిడితో కూరగాయలు పండించడం, వివిధ రకాల తోటల పెంపకం, పండ్ల తోటలు, ఆయిల్ ఫామ్ సాగు చేయాలని కలెక్టర్ తెలిపారు. రైతులు ఒకే రకమైన పంట పండించకుండా, పంట మార్పిడితో అధిక సాంద్రత కలిగిన పత్తి సాగు వల్ల ఎకరానికి సుమారు 25 వేల మొక్కలు వస్తాయని, తక్కువ పంట కాలం వల్ల ఒకేసారి పంట కాలం వల్ల ఒకేసారి పంట తొందరగా చేతికి అందుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు తెలిపిన ప్రకారం రైతులు లాభదాయకమైన అధిక సాంద్రత కలిగిన పత్తి పంట సాగు చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులను కోరారు. ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగును ఎక్కువగా ప్రచారం చేస్తోందని, రైతుకు ఎకరాకు 51 వేల రూపాయలు ఆయిల్ ఫామ్ మొక్కలు, డ్రిప్, మెయింటెనెన్స్ ఖర్చు, ఫామ్ పౌండ్స్ ఇలా రకరకాలుగా ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. రైతులు క్రమంగా మూడు సంవత్సరాలు ఆయిల్ ఫామ్ సాగు చేస్తే నాలుగో సంవత్సరం నుంచి ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ మూడు సంవత్సరాల్లో కూడా మొక్క వేళ్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అంతర్ పంటలు వేసుకునే అవకాశం ఉందన్నారు. మూడు సంవత్సరాల తర్వాత కూడా ఇతర అంతర్ పంటల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. వివిధ రకాల వ్యవసాయ ప్రదర్శనలను కలెక్టర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో పాలెం వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ సుహాసిని, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శైల, డాక్టర్ ఆదిశంకర్, జిల్లా హార్టికల్చర్ అధికారి వెంకటేశం, వ్యవసాయ అధికారి పూర్ణచంద్రారెడ్డి, హార్టికల్చర్ అధికారులు జగన్, లక్ష్మణ్, ఇతర అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తలాపునే గోదారి గలగలలు అయినా రైతులకు తిప్పలు

- రైతులు ట్యాంకర్లతో పొలాలు తడుపుతున్న దుస్థితి
- ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కాలువల పనులు పూర్తి చేయాలి



**నంగునూరు, మార్చి 28 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో రైతుల ఆవేదన రోజురోజుకూ పెరుగుతోంది. ఎండలు తీవ్రరూపం దాల్చడంతో పంటలకు అవసరమైన సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పంట చివరి దశలో నీరు అత్యవసరంగా ఉండగా, ప్రస్తుతం నీటి కొరత రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే చెక్‌డ్యాంలు పూర్తిగా అడుగంటిపోయాయి. బావులు, బోర్లు కూడా నీటి మట్టం గణనీయంగా పడిపోవడంతో రైతులు వంతుల వారీగా నీటిని వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పంటలకు సమయానికి తడులు అందించడం కష్టంగా మారింది.ఒక వైపు పచ్చగా మెరిసే వరిగొలుసుల పొలాలు కనిపిస్తుండగా, మరోవైపు నీరు అందక ఎండిపోయిన పైరు రైతుల దుస్థితినిస్పష్టంగాతెలియజేస్తోంది. బద్దిపడగ గ్రామానికి చెందిన రైతు తప్పేట పరుశరాములు తనకున్న ఎకరం రెండు గుంటల భూమిలో అద్దెకరం వరి సాగు చేస్తున్నారు. చేతికొచ్చిన పంటనీరులేకఎండిపోతుండటంతో ఆయన తీవ్రంగా కలత చెందుతున్నారు. ట్రాక్టర్ సహాయంతో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చి పంటను కాపాడేందుకు శ్రమిస్తున్నా పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. చేతికొచ్చిన పంటను నిలబెట్టుకోవడానికి పడుతున్న కష్టం వర్ణనాతీతమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, గ్రామం సమీపంగా ప్రవహించే కాల్వ ద్వారా పంట పొలాలకు నీరు అందించాలనే ఉద్దేశంతో గతంలో భూ సేకరణ చేపట్టారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొందరు రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వగా, మరికొందరికి నష్టపరిహారం చెల్లించి భూసేకరణ పూర్తి చేశారు. అయితే అనంతరం కాల్వ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం యాసంగి పంటల సమయంలో బోరుబావులు ఎండిపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. చేతికొచ్చిన పంటను కాపాడుకోవడానికి ట్రాక్టర్ల ద్వారా నీటిని తరలిస్తూ అత్యవసర చర్యలు చేపడుతున్నారు. తలాపునే గోదావరి గలగలలాడుతున్నా రైతులకు మాత్రం నీటి కొరత తీరకపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కాల్వ నిర్మాణాలను పూర్తి చేసి సాగునీరు అందించాలని రైతులు వేడుకుంటున్నారు. లేకపోతే భారీ పంట నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# యాసంగి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్
- ధాన్యం కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలి
- ధాన్యం కొనుగోలులో రైతులు దళారులను ఆశ్రయించొద్దు
- అకాల, వడగండ్ల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి




**మెదక్, మార్చి 28 (జనం సాక్షి) :** యాసంగి వరి ధాన్యం కొనుగోలుకు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారుల ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సివిల్ సప్లై, వ్యవసాయ, పోలీస్, గ్రామీణ అభివృద్ధి, రెవెన్యూ, రవాణా, రైస్ మిల్లర్ అసోసియేషన్ యాజమాన్యాలతో యాసంగి వరి ధాన్యం కొనుగోలుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు లో రైతులు దళారులను ఆశ్రయించవద్దన్నారు. ప్రభుత్వశీ ఒక క్వింటాల్ ఏ గ్రేడ్ ధాన్యానికి 2,389 ,సాధారణ రకానికి 2,369 గా నిర్ణయించిందన్నారు. ఏప్రిల్ 1 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు పెద్ద ఎత్తున ప్రారంభించాలని పిలుపునిచ్చారు. యాసంగి సీజన్ కు 4’45’466 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడానికి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 413 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందులో ఐకెపి 154, పిఏసిఎస్ 224, డీసీఎంఎస్ 9, ఎఫ్‌పిఓ 26, మొత్తం 413 కేంద్రాలు ప్రారంభం కానున్నాయి అన్నారు. రైతుల వద్ద ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటామన్నారు. ధాన్యం కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. వడగండ్లు, అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సరైన తేమశాతాన్ని నమోదు చేసి, ట్యాబ్ ఎంట్రీ చేయాలన్నారు. ప్యాడి క్లీనర్లు అందుబాటులో ఉన్నాయని, ప్యాడి క్లీనలలో సమస్యల తలెత్తితే ఉన్నత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ ఆర్డిఓ రమాదేవి, గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి... దేవ్ కుమార్.. జిల్లా సివిల్ సప్లై అధికారి. నిత్యానంద్ , సివిల్ సప్లై మేనేజర్. జగదీష్. ట్రాన్స్పోర్ట్ అధికారినీ.. శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు కొండంతా అండ ముఖ్యమంత్రి సహాయ నిధి

- వీరన్నపేట మాజీ సర్పంచ్ కొండపాక భిక్షపతి
- లబ్ధిదారుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



**చేర్యాల, మార్చి 28 (జనంసాక్షి) :** పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిది కొండంత అండగా నిలుస్తుందని వీరన్నపేట మాజీ సర్పంచ్ కొండపాక బిక్షపతి అన్నారు. చేర్యాల మండలంలోని వీరన్నపేట గ్రామానికి చెందిన బింగి మల్లేశం తండ్రి కనకయ్య గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది వేలాది రూపాయలు ఖర్చు అయిన విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ కొండపాక భిక్షపతి ఈ విషయాన్ని చేర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంజే మల్లేశం ఆదేశాలతో సీఎం రిలీఫ్ ఫండ్ కు పంపించగా రూ. 35 వేల రూపాయల చెక్కు రావడంతో శనివారం మాజీ సర్పంచ్ కొండపాక బిక్షపతి, గ్రామ శాఖ అధ్యక్షులు సుర్ణ శ్రీకాంత్, యూత్ అధ్యక్షులు పెద్దింటి రాకేష్, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు పొన్నబోయిన ఎల్లయ్య, నాయకులు బాలకృష్ణారెడ్డి, కొమ్ము శంకరయ్య, కొండాపురం మధు, గూడెపు నరసయ్య, మీసాల శీను చేతుల మీదుగా అబ్దిదారునికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు చెక్ రావడానికి సహకరించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

# వరంగల్ పోలీస్ రేంజ్ కార్యాలయ నూతన భవనం ప్రారంభం



**వరంగల్ బ్యూరో, మార్చి 28 (జనం సాక్షి) :** నూతనంగా ఏర్పాటు చేసిన వరంగల్ పోలీస్ రేంజ్ పరిపాలన కార్యాలయ భవనాన్ని శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రారంభించారు. హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ రోడ్లో ఏర్పాటు చేసిన నూతన వరంగల్ పోలీస్ రెంజ్ కార్యాలయంలో వరంగల్ రెంజ్ పోలీస్ అధికారులకు సంబందించిన శాఖ పరమైన పరిపాలన కార్యకలాపాలు ఈ భవనం నుండి కొనసాగనున్నాయి. ఈ నూతన కార్యాలయంను ప్రారంభించిన సీపీ కార్యాలయంలో సదుపాయాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ అధికారుల శాఖపరమైన సమస్యలపై రెంజ్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలని, పరిపాలన పనితీరులో పారదర్శకంగా, బాధ్యతాయుతమైన పని తీరు ఉండాలని వరంగల్ సీపీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు దార కవిత, అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు సురేష్ కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్ రావు, రేంజ్ కార్యాలయం సూపరింటెండెంట్ యుగేందర్, ఏసీపీలు సత్యనారాయణ, నర్సింహా రావు, సురేంద్రతో పాటు ఆర్. ఐలు, ఇన్స్ పెక్టర్లు ఇతర రెంజ్ కార్యాలయ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ పాలిత ప్రాంతాల్లో మహిళలకు రక్షణ కరువు

- మీడియా సమావేశంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ




హనుమకొండ ప్రతినిధి మార్చి 28 (జనం సాక్షి) :భారతీయ జనతా పార్టీకి చెందిన 44 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు అత్యాచార, లైంగిక వేధింపుల కేసుల్లో ఉన్నారనీ వారికి బిజెపి రక్షణ కల్పిస్తుందని హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. మీడియా సమావేశంలో ఎర్రవెల్లి స్వర్ణ మాట్లాడుతూ మహిళలు అంటే గౌరవం లేని పార్టీ బిజెపి పార్టీ నే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ మహిళకు గౌరవం ఇవ్వాలని అంటారు. మహిళల సంరక్షణ గురించి మాట్లడుతుతారు. దేశంలో మహిళల మీద జరుగుతున్నా దాష్టీకాల మీద మాత్రం పెదవి విప్పరు. మహిళా మంత్రులు మౌనంగా ఉంటారు, కేంద్రం సహా బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కొందరు మంత్రుల వ్యవహారం ఆందోళన కలిగిస్తుంది.గోవాలో బిజెపి కౌన్సిలర్ కొడుకు చిన్నపాటి బాలికలను అత్యాచారానికి గురి చేసిన కేసు, మహారాష్ట్రలో 58 మంది మహిళలను అత్యాచారానికి గురి చేసిన అశోక్ ఖరత్ కేసు, ఉత్తరాఖండ్ అంకితా భండారీ హత్య కేసు, ఉన్నావ్ అత్యాచార కేసు, హిమాచల్ ప్రదేశ్లో ఒక ఎమ్మెల్యే మైనర్తో అత్యాచారానికి పాల్పడిన కేసు, హర్యానా మహిళా కోచ్ను వేధింపులకు గురి చేసిన సందీప్ సింగ్ కేసు వంటి ఉదాహరణలు ఇస్తూ, ఈ కేసుల్లో బిజెపి రాజకీయ రక్షణ కల్పిస్తోంది. గుర్మీత్ రామ్ రహీమ్కు పరోల్ మంజూరు చేయడం, బిల్కిస్ బానో కేసులో దోషులకు క్షమాబిక్ష ఇవ్వడం వంటి ఎన్నో కేసులు ఉన్నాయి. అని అన్నారుకేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, మంత్రుల పరిస్థితి రేపిస్తులను వెనుకేసుకురావడ, విద్వేషాలు రెచ్చగొట్టెలా మతపరమైన స్టేట్మెంట్లు ఇవ్వడం బిజెపి లోని కొందరు ప్రజా ప్రతినిధులకు పరిపాటిగా మారింది. ఇలాంటి చర్యలు, విధానాలతో అధికారం చేపట్టాలని, ఉన్న అధికారాన్ని కాపాడు కోవాలని బిజెపిభావిస్తుంది.మహిళలు, బాలికలపై పెరుగుతున్న నేరాలు, అలాగే కొన్ని కేసుల్లో నిందితులకు కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం రక్షణ లభిస్తున్నట్లు కనిపిస్తున్న పరిస్థితులపై ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అత్యవసరంగా సర్కులర్ జారీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు నీలం పద్మ, బంక సరళ, నునావత్ రాధా, రాష్ట్ర జిల్లా మహిళా నాయకులు, మండల మరియు డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భవనాల ఆస్తి పన్నుల చెల్లింపులపై దృష్టి సారించండి

- హనుమకొండ జిల్లా కలెక్టర్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- కాశీ బుగ్గ ఈ-సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ



**వరంగల్ ఎంజీఎం, మార్చి 28(జనంసాక్షి):** ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్నుల చెల్లింపుల పై దృష్టి సారించి వసూళ్లు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ పరిధి లోని కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయ ఆవరణ లో గల ఈ-సేవా కేంద్రం తో పాటు వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న పన్ను వసూళ్ల విధానాన్ని పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయ ఆవరణ లో గల ఈ-సేవా కేంద్రం లో ఆకస్మికంగా సందర్శించి పన్నుల సేకరణ తీరును, ప్రభుత్వ ఆస్తుల బిల్లుల చెల్లింపు తదితర అంశాలను అడిగి తెలుసుకొని మొండి బకాయి ల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నగర పరిధి లోని బకాయి లు పడి ఉన్న రైల్వే, పోస్టాఫీసులు, కే ఎం సి తదితర ప్రభుత్వ కార్యాలయాల కు నోటీసులు అందజేసి వెంటనే పన్నులు చెల్లించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి రెవెన్యు అధికారులు రావుల ఆనంద్, శ్రీనివాస్, ఆర్ ఐ సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ వేదికపై మరోసారి విరాజిల్లిన నిర్మల్ జిల్లా ఖ్యాతి

- ఢిల్లీ వేదికగా స్వీకరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు



**నిర్మల్ బ్యూరో, మార్చి28 (జనంసాక్షి) :** జాతీయ వేదికపై మరోసారి నిర్మల్ జిల్లా ఖ్యాతి ప్రజరిల్లింది. జిల్లాకు రెండు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డులు దక్కాయి. వివిధ జిల్లా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన వినూత్న కార్యక్రమాలకుగాను అవార్డ్ లు నిర్మల్ జిల్లా సొంతం చేసుకుంది. ఢిల్లీ వేదికగా జరిగిన ఈ అవార్డులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, సంబంధిత శాఖలతో కలిసి స్వీకరించారు. నిర్మల్ జిల్లాకే తలమాణికమైన కొయ్య బొమ్మల పరిరక్షణ, చారిత్రాత్మక వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో.. కొయ్య బొమ్మల తయారీకి ఉపయోగించే పొనికి కర్రల పెంపకం కోసం ఏర్పాటు చేసిన పొనికి వనానికి గాను లభించిన జాతీయస్థాయి స్కోచ్ అవార్డును జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మితో కలిసి స్వీకరించారు. జిల్లాలో అమ్మరక్షిత అనే వినూత్న కార్యక్రమం ద్వారా మాతృత్వ మరణాలు తగ్గించినందుకు లభించిన మరో స్కోచ్ అవార్డును వైద్యరోగ్య శాఖ అధికారి రాజేందర్ తో కలిసి కలెక్టర్ స్వీకరించారు. అవార్డు స్వీకరణ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, మరోసారి జిల్లాకు జాతీయ వేదికలో అవార్డు రావడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. అధికారుల ఉత్తమ పనితీరుతో ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేసి, అవార్డు సాధనలో కృషి చేసిన అధికారులు అందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## పాకాల వాగులో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి

- రైతుల ఆవేదనపై స్పందించిన మాజీ ఎంపీ కవిత మాలోత్



**మహబూబాబాద్ ప్రతినిధి, మార్చి 28 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల పరిధిలోని గోవిందాపురం, లక్ష్మీపురం, దుబ్బగూడెం, కట్టుగూడెం, రెడ్యాల గ్రామాల్లో పాకాల వాగు పరివాహక ప్రాంతాల్లో సాగు నీటి కొరత తీవ్రంగా కనిపిస్తోంది. నీరు అందక పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తమ సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. రైతుల ఆవేదనను విన్న భారాస జిల్లా అధ్యక్షులు, మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు కవిత మాలోత్ వెంటనే స్పందించారు. ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి పాకాల వాగు ద్వారా వెంటనే సాగునీటిని విడుదల చేయాలని కోరారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యపై స్పందించిన కవిత మాలోత్కు కృతజ్ఞతలు తెలిపారు.

# పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జడ్పి హెచ్ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్న 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మి ప్రసన్నను పరీక్షలకు హాజరైన విద్యార్థుల సంఖ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో మొత్తం 200 మంది రెగ్యులర్ విద్యార్థులు, ముగ్గురు ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, శనివారం నిర్వహించిన గణితం పరీక్షకు మొత్తం 203 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. అలాగే, పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందులు, చికిత్సలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అస్వస్థత కలిగినా వెంటనే వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అత్యవసర మందులతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగరాజు, డిపార్ట్మెంటల్ అధికారి లక్ష్మి పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలపై

# కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**మహబూబాబాద్, మార్చి 28 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం చిన్నగూడూరు మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ సరళిని పరిశీలించిన కలెక్టర్, జిల్లాలో మార్చి 14 నుండి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు మొత్తం 45 కేంద్రాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 8157 మంది విద్యార్థులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్, ప్రతి కేంద్రానికి ఒక సిట్టింగ్ స్క్వాడ్, సుమారు 528 మంది సిబ్బంది, 45 వైద్య బృందాలు పనిచేస్తున్నాయని వివరించారు. అదనపు కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు నిరంతర పర్యవేక్షణలో పరీక్షలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రశ్నపత్రాల ఓపెనింగ్, క్లోజింగ్ ప్రక్రియలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారని, విద్యాశాఖ ప్రధాన కార్యాలయం నుండి వైర్లెస్ సెట్ ద్వారా సూచనలు అందుతున్నాయని చెప్పారు. డీఈవో వి. రాజేశ్వర్ సహా అధికారులు వివిధ కేంద్రాలను తనిఖీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ రోజు 8165 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై 99.89 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. ఏప్రిల్ 16 వరకు జరిగే పరీక్షల నిర్వహణలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉందని వెల్లడించారు. అనంతరం కలెక్టర్ అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి, హాజరు రిజిస్టర్లు, రికార్డులు, ఆహార నిల్వలను తనిఖీ చేశారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారికి అర్థమయ్యే విధంగా విద్యను బోధించాలని సూచించారు. బాలింతలు, గర్భిణీలు, చిన్నపిల్లలకు బలవర్ధక ఆహారం అందించాలని, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం మెరుగుపర్చాలని ఆదేశించారు. అన్ని విద్యాసంస్థల్లో ఆరోగ్యం, విద్య, పోషణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల అధికారులకు ఇప్పటికే సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్ సంతోష్ రాజ్పై దాడి చేసిన వారిని శిక్షించాలి

**ఆర్ఎంపీ డాక్టర్ల ఫిర్యాదు**



**సారంగాపూర్, మార్చ్ 28 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కేంద్రంలో డాక్టర్ సంతోష్ రాజ్ పై జరిగిన దాడిని నిరసిస్తూ వైద్యులు సారంగాపూర్ ఆర్ఎంపి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. చికిత్స బిల్లుల వివాదంతో రోగి బంధువులు వైద్యుడిపై భౌతిక దాడికి పాల్పడటం సమంజసం కాదని, నిందితులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని సారంగాపూర్ పోలీస్ స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశారు.

## అఖండ హరినామ సప్తలో పాల్గొన్న ఆత్రం సుగుణక్క



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 28(జనంసాక్షి) :** నార్నూర్ మండలం ఖంపూర్ గ్రామంలో వారం రోజులుగా భక్తి శ్రద్ధలతో కొనసాగు తున్న అఖండ హరినామ సప్త కార్యక్రమానికి శనివారం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కుమరం భీమ్ ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క హాజరయ్యారు. ముందుగా హనుమాన్ ఆలయంలో కార్యక్రమ నిర్వాహకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హరినామ సప్తలో పాల్గొని ప్రవచనాలు విన్నారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ భగవంతుని నామస్మరణతో మనసుకు ప్రశాంతత లభిస్తుందని, సమాజంలో ఐక్యత,ధార్మిక చింతనలు పెరుగుతాయని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో సానుకూల వాతావరణాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడావి షేవంతాబాయి,భీర్ షావ్,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బానోత్ ప్రణిత,యూత్ కాంగ్రెస్ మండలం అధ్యక్షుడు షేక్ మహామ్మద్, మానే సంతోష్, బిర్జులాల్, మనుమంత్ రావ్,దశరత్ పాల్గొన్నారు.

## ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ

# ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్

- కలెక్టర్ సమక్షంలో రైస్ మిల్లర్ల సమస్యలపై చర్చ....సానుకూల స్పందన
- రైస్ మిల్లర్స్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి : బాదం ప్రవీణ్ విజ్ఞప్తి



**ములుగు బ్యూరో,మార్చి28(జనం సాక్షి):** ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో, ములుగు జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్, అదనపు కలెక్టర్ మహేం దర్ జి చేతుల మీదుగా తెలుగు పరాభవ నామ సంవత్సర నూతన డైరీ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమం అనంతరం బాదం ప్రవీణ్ కలెక్టర్ను కలిసి రైస్ మిల్లర్స్ ఎదు ర్కొంటున్న పలు సమస్యల ను వివరించారు. ముఖ్యంగా మిల్లింగ్, ధాన్యం కొనుగోలు, చెల్లింపుల ఆలస్యం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కా రం చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలపై స్పందించిన కలెక్టర్ గారు సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని సానుకూలంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# వేషం మార్చి.. స్టూడెంట్గా మారి..

- టేకుమట్లలో మహిళా ఎస్సై హల్ చల్
- ఆకతాయిల పని పట్టేందుకు కొత్త వ్యూహం
- విద్యార్థినిగా వ్యవహరించిన తీరు అద్భుతం
- చేతిలో ప్యాడ్, చుట్టూ విద్యార్థినులు
- ఎస్సై అని తెలిసి నాలుక్కరుచుకున్న స్టూడెంట్స్





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/టేకుమట్ల, (జనంసాక్షి):** జిల్లాలో పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. అయితే పరీక్షా కేంద్రాల వద్ద కొంతమంది అకతాయిలు విద్యార్థినిలను ఈవ్ టీజింగ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇలాంటి ఆకతాయిలను పట్టుకోవాలనే ఉద్దేశంతో ఓ మహిళ ఎస్సై వేషం మార్చి, స్టూడెంట్ గా మారింది. చేతిలో పరీక్షా ప్యాడు పట్టుకొని, విద్యార్థినీల్లో కలిసిపోయి ముచ్చట్లు పెట్టింది. మరోవైపు విద్యార్థినిలను ఎవరైనా అకతాయిలు వేధిస్తున్నారా అనేదానిపై నిఘా పెట్టింది. ఆ తర్వాత ఎస్సై అని తెలియడంతో పలువురు స్టూడెంట్స్ నాలిక్కరుచుకున్నారు. టేకుమట్ల ఎస్ఐ గైక్వాడ్ అమూల్య ఆకతాయిలను పట్టుకునేందుకు మారువేషంలో అక్కడ వ్యవహరించిన తీరు అద్భుతం అని స్థానికులు చెప్పుకోవడం విశేషం. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుత రోజుల్లో ఏదో ఒకచోట కొంతమంది అకతాయిలు పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను వేధింపులకు గురి చేస్తూ, ఈవ్ టీజింగ్ లకు పాల్పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో టేకుమట్ల మహిళా ఎస్సై అమూల్య శనివారం కొత్త వ్యూహంతో విద్యార్థుల్లో కలిసిపోయి ప్రత్యేక నిఘా వేసి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు టేకుమట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో పదవ తరగతి పరీక్షల సందర్భంగా, పరీక్షా కేంద్రం వద్ద బాలికలపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈవ్ టీజింగ్ను పూర్తిగా అరికట్టాలనే ఉద్దేశంతో టేకుమట్ల ఎస్సై అమూల్య సాధారణ విద్యార్థిని వేషధారణలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులతో కలిసి ఉండి పరిస్థితులను నిశితంగా పరిశీలించింది. పరీక్షా కేంద్రం పరిసరాల్లో అల్లరి చేసే యువకులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి, బాలికలు నిర్భయంగా పరీక్షలు రాసేలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించేలా సిబ్బందికి సూచనలు ఇచ్చారు.



ఎస్సై అమూల్య మాట్లాడుతూ విద్యార్థినుల భద్రత పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్యత అని, పరీక్షా కేంద్రాల వద్ద ఈవ్ టీజింగ్, వేధింపులు, అనుచిత ప్రవర్తనపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలు ధైర్యంగా చదువుపై దృష్టి పెట్టి పరీక్షలు రాయాలని సూచించారు. ఈవ్ టీజింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎవరైనా ఈవ్ టీజింగ్ పాల్పడితే తమకు వెంటనే సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని చెప్పారు. ఈవ్ టీజింగ్ కు పాల్పడిన వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష, జరిమానా రెండు విధించబడతాయని ఆమె చెప్పారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
29 మార్చి 2026

## పెట్రోల్ బంకుల తనిఖీ నిల్వలను పరిశీలించిన గ్రామాభివృద్ధి అధికారి శ్రీనివాస్




**మదుగులపల్లి, మార్చి 28 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని పలు పెట్రోల్ బంకులను శనివారం గ్రామాభివృద్ధి అధికారి పెద్దమాం శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు సరిపడా ఉన్నాయా లేదా అనే అంశాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఇంధన సరఫరా నిరంతరాయంగా సాగాలని, స్టాక్ విషయంలో ఎటువంటి తప్పుడు సమాచారం ఇవ్వకూడదని బంకు నిర్వాహకులను ఆదేశించారు వినియోగదారులకు నాణ్యమైన ఇంధనాన్ని అందించాలని, కొలతల్లో తేడాలు రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు నిల్వలు ఉన్నప్పటికీ లేవని చెప్పి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## లోక్ అదాలత్ ద్వారా 546 కేసులు పరిష్కారం

- కక్షిదారులకి కుదిరిన ఒప్పందం



**రామన్నపేట, మార్చి 28 (జనంసాక్షి) :** రామన్నపేట కోర్టు పరిధిలో మొత్తం 546 కేసులకు పరిష్కారం లభించింది. శనివారం రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జ్ జి.సబిత, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి. సత్తయ్యలు కలిసి కోర్టు హాల్ లో జాతీయ లోక్ అధాలత్ ను నిర్వహించారు. రామన్నపేట జ్యుడిషియల్ సంబంధించి రామన్నపేట, వలిగొండ, మోత్కూరు, అడ్డగూడూరు స్టేషన్ పరిధిలో సివిల్, క్రిమినల్, బ్యాంకు, ప్రీ లిటిగేషన్, ఇతర ప్రీ లిటిగేషన్, పిట్టి కేసులు పరిష్కరించుకున్నారు. బ్యాంక్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసుల ద్వారా రూ. 5,18,350 అమౌంట్ రికవరీ చేయబడినట్లు తెలిపారు. అనంతరం జడ్జీ మాట్లాడుతూ క్షణికావేశాలతో అప్పటి పరిస్థితులలో కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బులు, సమయం వృధా చేసుకోవడం బదులు రాజీ మార్గమే రాజ మార్గంగా కోర్టు పరిధిలో నిర్వహించే లోక్ అధాలత్ వినియోగించుకొని సమస్యలు పరిష్కరించుకోవడానికి కక్షిదారులు ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ లు, పలు మండలాల ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్లు, వివిధ పోలీస్ స్టేషన్ ల సిబ్బంది, కోర్టు సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం పలికిన మంత్రి తుమ్మల, కలెక్టర్



**బూర్గంపహాడ్, మార్చి 28 (జనంసాక్షి) :** భద్రాచలంలో శనివారం జరిగిన శ్రీరామ మహాపట్టాభిషేక కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా హాజరు కావాల్సిన ఆయన తొలుత మండల పరిధిలోని సారపాకలో బీపీఎల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ కు హెలీకాప్టర్లో చేరుకున్న రాష్ట్ర గవర్నర్ కు వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు లు పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఐటీసీ విశ్రాంత గృహానికి చేరుకుని, ఆ తర్వాత జరిగే శ్రీరామ మహాపట్టాభిషేకానికి రోడ్డు మార్గాన బయలుదేరి భద్రాచలం వెళ్లారు. స్వాగతం పలికిన వారిలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణతో పాటు పలువురు జిల్లా అధికార యంత్రాగం వున్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన



**వలిగొండ, మార్చి 28 (జనం సాక్షి) :** మండలంలోని వేములకొండ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని సర్పంచ్ ఏర్పుల వెంకటేశం, ఉప సర్పంచ్ అంబటి సాయికుమార్, డాక్టర్లు ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ , ఉప సర్పంచ్ మాట్లాడుతూ... ఇతర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో ఉన్న వారికి ఉచిత వైద్య శిబిరం ఎంతో ఆసరాగా నిలిచిందని అన్నారు.దాదాపు 350 నుండి 400 మందికి ఎముకలు, దంత, కంటి, సాధారణ వ్యాధులకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సోనీ రెడ్డి, భార్గవి,ఉమామహేశ్వరి, వేణు, మాధవి, వార్డ్ మెంబర్లు అంబటి గిరి, ఏర్పుల పద్మ, కాడిగళ్ల రామ నరసింహ , ఇంజమూరి శ్రీను, సలిబద్రి అభినయ్, కట్ట జ్యోతిలక్ష్మి, పులి పలుకులు అండాలు, మడుగుల స్వర్ణలత, బత్తుల స్వర్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాచకొండలో రిజర్వాయర్‌తోనే నారాయణపురంకు సాగునీరు సాధ్యం

- మునుగోడు ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించాలి
- సిపిఐ ప్రచారజాతలో జిల్లా కార్యవర్గ సభ్యులు గాలయ్య

**సంస్థాన్ నారాయణపురం, మార్చి 28 (జనం సాక్షి) :** రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటు చేయడంతోనే సంస్థాన్ నారాయణపురం మండలానికి సాగునీరు సాధ్యం అవుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనబోని గాలయ్య అన్నారు. రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటు చేయాలంటూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వివిధ గ్రామాలలో ప్రచార జాతాను నిర్వహించారు. ఈ సందర్భంగా గాలయ్య మాట్లాడుతూ... శివన్న గూడెం ప్రాజెక్టుకు నీళ్లు వచ్చిన సంస్థాన్ నారాయణపురం మండలానికి సాగునీరు అందించే ప్రణాళిక లేదని అన్నారు. ఎత్తులో ఉన్న రాచకొండలో రిజర్వాయర్ ను ఏర్పాటు చేసి శివన్నగూడెం ప్రాజెక్టు నుండి లిఫ్ట్ ద్వారా




రాచకొండ రిజర్వాయర్ లోకి నీటిని తరలించాలని డిమాండ్ చేశారు. రాచకొండ రిజర్వాయర్లో నీటిని నింపడంతో గొలుసుకట్టు చెరువుల ద్వారా మునుగోడు వరకు సాగునీరును అందించవచ్చని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఈ అంశాన్ని ప్రస్తావించాలని వారు డిమాండ్ చేశారు. రాచకొండ రిజర్వాయర్ ఏర్పాటు చేసే వరకు రైతులతో కలిసి తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు రైతులతో కలిసి మహాధర్నాను తలపెట్టామని దీని అందరూ విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండు రోజులపాటు మండలంలోని అన్ని గ్రామాలలో ఈ ప్రచార జాత కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కురిమిద్ద శ్రీనివాస్, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్,జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య,కలకొండ సంజీవ, ప్రజానాట్యమండలి నాయకులు జగన్, గణేష్, సిపిఐ నాయకులు ఈద మల్లయ్య, ఎర్రోళ్ల లింగస్వామి, మహమ్మదాబాద్, కోతులాపురం సర్పంచ్ ముత్యాల అంజయ్య,కురిమిద్దె వినోద తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్‌పార్క్‌లో స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభించిన టీజిఐఐసి చైర్‌పర్సన్



**సంగారెడ్డి టౌన్, మార్చి 28 (జనం సాక్షి) :** సంగారెడ్డి పట్టణంలోని రాజీవ్ పార్క్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను శనివారం టీజేఐసీ చైర్మన్ నిర్మలా జగ్గా రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ మాధురి, సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజేఐసీ చైర్పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ... రాజీవ్ పార్క్ పక్కన ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడాభివృద్ధిలో భాగంగా సుమారు రూ. 20 లక్షల వ్యయంతో ఈ పూల్‌ను పునరుద్ధరించినట్లు తెలిపారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడానికి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడానికి ఇటువంటి సదుపాయాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పిల్లల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో స్విమ్మింగ్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈత ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తుందని పేర్కొన్నారు. స్పోర్ట్ అథారిటీ అధికారి అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ స్విమ్మింగ్ పూల్‌ను పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంచుతూ నెలవారీ, మూడు నెలల, ఆరు నెలల కార్డుల రూపంలో రేట్లు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి వయస్సు వారికి అనుకూలంగా సమయాలను కూడా కేటాయించినట్లు వెల్లడించారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో సంగారెడ్డి ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా పిల్లలు, యువత పాల్గొనాలని అఖిలేష్ రెడ్డి కోరారు. స్విమ్మింగ్ ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు క్రీడా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, క్రీడా విభాగం సిబ్బంది, కౌన్సిలర్‌లు శ్రీకాంత్, రమేష్, ప్రజాప్రతినిధులు , క్రీడాభిమానులు ,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తాజ్‌పూర్ గ్రామంలో రైతు సదస్సు



**భువనగిరి రూరల్, మార్చి 28 (జనంసాక్షి) :** భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం - యాదాద్రి భువనగిరి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలకు చెందిన గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమ విద్యార్థులు రైతు సదస్సు మరియు వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఎం. గోవర్ధన్ ( రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియట్ డీన్) మాట్లాడుతూ ముందుగా తాజ్ పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో తమ కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్, డా. డి. శ్రీలత (యాదాద్రి భువనగిరి జిల్లాలో టిఆర్‌వికెకు ప్రధాన శాస్త్రవేత్త), శ్రీనివాస్ మరియు మండల రైతులు కంచి మల్లయ్య, ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, ఎస్కె గాలిబి యాకుబ్, బొమ్మరపు రామకృష్ణ, బొమ్మారపు లక్ష్మీ బాలరాజు, బిట్కూరు మహేష్, వరిగంటి మానస నాగరాజు, ఎస్కేహైమద్ మరియు వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, భువనగిరి మండల పరిధి గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## గ్యాస్, పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి కొరత లేదు

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

రంగారెడ్డి ప్రతినిధి, మార్చి 28 (జనంసాక్షి) : జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ కు ఎలాంటి కొరత లేదు, ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ సమావేశ మందిరం నందు సివిల్ సప్లై అధికారులు, గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకుల నిర్వహకులతో జిల్లాలో గ్యాస్ పెట్రోల్, డీజిల్ సరఫరా, వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారి వనజాత, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు రామేశ్వరి దేవి, కేషు రామ్, వ్యవసాయ శాఖ అధికారి ఉషా, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, పెట్రోల్ బంకుల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.



## లోక్ అదాలత్‌లో ఒక్కటైన భార్యాభర్తలు



**తుంగతుర్తి, మార్చి 28 (జనం సాక్షి) :** మనస్పర్ధలతో విడిపోయి వేర్వేరు జీవితాలు గడుపుతున్న దంపతులు కుటుంబ విభేదాలతో దూరంగా ఉంటూ పోలీస్ స్టేషన్లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకొని కోర్టు మెట్లు ఎక్కారు, నాగారం మండల పరిధిలోని పనిగిరి గ్రామానికి చెందిన పులిగిల్ల వీరమల్లు తుంగతుర్తి మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామానికి చెందిన చిలకల సరిత కు 2012 సంవత్సరంలో వివాహం జరిగింది, ఈ దంపతులకు ఒక కూతురు కూడా ఉంది, వీరి మధ్య మనస్పర్ధలు రావడంతో సరిత 2021 సంవత్సరంలో భర్తపై తుంగతుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది కాగా ఇరువురు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు, శనివారం లోక్ అదాలత్ వేదికగా జరిగిన చర్చల ద్వారా తమ మనస్పర్ధలను పక్కనపెట్టి మళ్లీ కలిసే జీవిస్తామని నిర్ణయం తీసుకుంటామని జడ్జి ఎండి గౌస్ పాషా సమక్షంలో నిర్ణయం తీసుకొని ఒకటయ్యారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహారావు, ఎస్సై క్రాంతికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నే పర్తి జ్ఞాన సుందర్, న్యాయవాదులు కారింగుల వెంకటేశ్వర్లు, పర్వీన్ బేగం, రాజు, వేణు యాదవ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలు వాహనాలు నడపడం నేరం



నూతనకల్, మార్చి 28 (జనంసాక్షి) : పిల్లలు వాహనాలు నడపడంతో పాటు, ఎక్కువమంది వాహనాల పై ప్రయాణం చేయడం ప్రమాదకరమని ఎస్సై నాగరాజు అన్నారు.శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ప్రయాణ సమయంలో ప్రతిఒక్కరూ సురక్షితంగా గమ్యం చేరడం లక్ష్యంగా రాష్ట్ర పోలీసు శాఖ, రోడ్డు భద్రత అరైవ్ అలైవ్ ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. వాహనదారులు వాహనాలు నిదానంగా నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వాహనదారులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాజీ పడితే ఇద్దరూ గెలిచినట్టే..




**దేవరకొండ, మార్చి 28 (జనం సాక్షి) :** జాతీయ లోక్ అదాలత్‌లో చిన్న చిన్న తగాదాలను స్నేహ పూర్వక వాతావరణంలో రాజీచేసుకుంటే కుటుంబాల శ్రేయస్సుతోపాటు,ఆర్థిక ప్రగతి కలుగుతుందనీ దేవరకొండ సీనియర్ సివిల్ జడ్జి కమ్,మండలం న్యాయ సేవా సంస్థ అధికారి చైర్ పర్సన్ కె.అనిత పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని న్యాయవాదులు, పోలీసు శాఖ కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జితోపాటు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ పి స్నేహ పాల్గొన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్ట్ లలో కలిపి మొత్తం 837 కేసులు పరిష్కరించి డి డి, జరిమానాల ద్వారా 8,00,600/-రూపాయలు సమకూరాయని పేర్కొన్నారు.

# సత్వర న్యాయమే లోక్ అదాలత్ లక్ష్యం



**హుజూర్‌నగర్, మార్చి 28 (జనంసాక్షి) :** న్యాయస్థానాలను ఆశ్రయించిన కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అధాలత్‌ల లక్ష్యమని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్, ఆయేషా సరీన్ లు అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ లో వారు కక్షిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ హుజూర్ నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 10,400 కేసులు పెండింగ్ లో ఉన్నాయని లోక్ అదాలత్‌ల నిర్వహణమూలంగా పెండింగ్ కేసుల భారాన్ని భారీగా తగ్గించామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, కుక్కడపు బాలకృష్ణ, ఎమ్మెస్ రాఘవరావు,జక్కుల వీరయ్య, కొట్టు సురేష్, బానోతు నాగేశ్వరరావు, లతీఫ్, కమతం నాగార్జున, సతీష్, చక్రాల వెంకటేశ్వర్లు, అడవి రాముడు, సంధ్య, మీసాల అంజయ్య, చంద్రు, శంకర్, అంజయ్య, ఏజీపీ సురేష్ నాయక్, పిడమర్తి చంద్రయ్య, మద్దుల నాగేశ్వరరావు, నాగూర్ పాషా, న్యాయ సేవ అధికార సంస్థ సిబ్బంది అనిత, సుశీల, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ లోక్ అదావత్‌లో 24 సివిల్ కేసులు, 382 క్రిమినల్ కేసులు పరిష్కరించబడ్డాయి. వివిధ కేసులలో కక్షిదారులు తమ నేరాలను అంగీకరించడంతో 1,34200 రూపాయలను జరిమానాగా న్యాయమూర్తులు విధించారు. అలాగే వివిధ బ్యాంకులకు చెల్లించవలసిన బకాయి 460000 రూపాయలను కక్షిదారులు ఆయా బ్యాంకులకు చెల్లించారు.

# చిన్న చిన్న వివాదాల కోసం కోర్టుల చుట్టూ తిరగొద్దు

- లోక్ అదాలత్‌లను ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి, మార్చి 28 (జనం సాక్షి) :** చిన్న చిన్న వివాదాల కోసం కోర్టుల చుట్టూ తిరగొద్దని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ... లోక్ అదాలత్ వేదికగా పెండింగ్‌లో ఉన్న వివాదాలను సులభంగా, వేగంగా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబపరమైన వివాదాలు, వైవాహిక సమస్యలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి కేసుల్లో ఇరువర్గాలు పరస్పరం చర్చించుకుని రాజీకి రావచ్చని తెలిపారు. దీంతో కోర్టు విచారణలు, దీర్ఘకాల న్యాయ ప్రక్రియల వల్ల కలిగే ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. చిన్న చిన్న వివాదాలపై కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవడం కంటే పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని సూచించారు. పెండింగ్ కేసులను గుర్తించి, ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర మాట్లాడుతూ... లోక్ అదాలత్‌లు ప్రజలకు త్వరిత, తక్కువ వ్యయంతో న్యాయం అందించే సమర్థవంతమైన వేదికలని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా సేవలందిస్తున్న ఆమె, ఇరువర్గాలు పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకోవడం ద్వారా కోర్టులపై భారం తగ్గడమే కాకుండా సామరస్య వాతావరణం నెలకొంటుందని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, జిల్లా అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.






# మార్కెట్లు మళ్లీ ధమాల్

## ఐఫోన్ వినియోగదారుల కోసం వాట్సప్ డ్యూయల్ అకౌంట్ సదుపాయం

**న్యూఢిల్లీ:**మెటాకు చెందిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్, పలు కొత్త ఫీచర్లను శుక్రవారం ప్రకటించింది. ఇకపై ఐఫోన్ వినియోగదారులు ఒక ఫోన్‌లో, ఒకేసారి రెండు వాట్సప్ ఖాతాలు నిర్వహించుకోవచ్చు. దీంతో పాటు ఫోటో ఎడిటింగ్, మెసేజ్ డ్రాఫ్టింగ్ కోసం కొత్త కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్‌నూ సంస్థ తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగదారులకే 'టూ అకౌంట్స్, వన్ ఫోన్' ఫీచర్ అందుబాటులో ఉండగా.. ఇప్పుడు ఐఓఎస్ ప్లాట్‌ఫాం పైనా అందుబాటులోకి రానుంది. వ్యక్తిగత, వృత్తిపర సంభాషణలను నిర్వహించడానికి వినియోగదారులు రెండు వేర్వేరు ఫోన్లు వినియోగించాల్సిన అవసరం ఇకపై ఉండదని వాట్సప్ తమ బ్లాగ్‌లో పేర్కొంది. యాప్ కింద భాగంలో కనిపించే ప్రొఫైల్ పిక్చర్ ద్వారా ప్రస్తుతం ఏ ఖాతా యాక్టివ్‌గా ఉందో వినియోగదారులు గుర్తించొచ్చు. జనరేటివ్ ఏఐ ట్రెండ్‌కు అనుగుణంగా, వాట్సప్ నేరుగా చాట్‌లలో 'మెటా ఏఐ'ను అనుసంధానిస్తోంది. వినియోగదారులు ఇకపై మెటా ఏఐ ఉపయోగించి ఫోటోలను టచ్-అప్ చేయడం, అనవసరమైన అంశాలను తొలగించడం, బ్యాక్‌గ్రౌండ్ మార్చడం లేదా ఫోటో పంపే ముందు వివిధ స్టైల్స్ వాడటం వంటివి చేయొచ్చు. సంభాషణ సందర్భాన్ని బట్టి సమాధానాలను 'ఏఐ రైటింగ్ హెల్ప్' ఫీచర్ సూచిస్తుంది. ఏఐ టూల్స్ వల్ల భద్రతాపరమైన ఆందోళనలు తలెత్తవని, వినియోగదారుల చాట్‌లు పూర్తి 'ప్రైవేట్'గా ఉంటాయని వాట్సప్ స్పష్టం చేసింది. మెటా ఏఐ కొత్త ఫీచర్లు వినియోగదారులందరికీ వెంటనే అందుబాటులోకి రాకపోవచ్చని కంపెనీ తెలిపింది.

## మూసివేత వార్తల వేళ..

## టెక్ ప్రియులకు వన్‌ప్లస్ గుడ్‌న్యూస్

**న్యూఢిల్లీ:**చైనాకు చెందిన మొబైల్ తయారీ కంపెనీ వన్‌ప్లస్ టెక్ ప్రియులకు గుడ్‌న్యూస్ చెప్పింది. దేశంలో తమ సర్వీస్ నెట్‌వర్క్‌లను 50 శాతం విస్తరిస్తున్నామని ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న 400 సర్వీస్ నెట్‌వర్క్‌లను 600కు పెంచుతున్నామని తెలిపింది. గ్లోబల్ మార్కెట్లలో కంపెనీ మూతపడుతోందన్న వదంతుల నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. సొంత బ్రాండ్‌గా మొదలైన వన్‌ప్లస్.. ఇతర కంపెనీల పోటీతో ఏటా తన ప్రాభవాన్ని కోల్పోతోంది. ఈ క్రమంలోనే మాతృ సంస్థ బీబీకే ఎలక్ట్రానిక్స్‌కు చెందిన మరో స్మార్ట్‌ఫోన్ కంపెనీ ఒప్పోకు సబ్‌బ్రాండ్‌గా అవతరించింది. కొన్నేళ్లుగా ఆ కంపెనీకి సబ్‌బ్రాండ్‌గా కొనసాగుతూనే ఫోన్లను లాంచ్ చేస్తోంది. అయితే, మార్కెట్ వాటా క్రమంగా క్షీణిస్తుండటంతో వన్‌ప్లస్‌ను మూసివేస్తున్నారంటూ ప్రచారం జరుగుతోంది. తాజాగా వన్‌ప్లస్ సీఈఓ రాబిన్ లియు రాజీనామా చేయడంతో ఈ ప్రచారం మరింత బలపడింది. కాగా, ఈ వదంతులను కంపెనీ తోసిపుచ్చింది. సర్వీస్ నెట్‌వర్క్‌ను పెంచడం ద్వారా భారత్‌లో తమ కార్యకలాపాలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. వన్‌ప్లస్ తన సొంత సర్వీస్ సెంటర్లను నిర్మించడానికి బదులుగా ప్రస్తుతం ఉన్న ఒప్పో సెంటర్లనే వాడుకోనుంది. తద్వారా వినియోగదారులకు సులువుగా తమ సేవలు అందుతాయని తెలిపింది.

- సుంకం సెగతో కుప్పకూలిన షేర్లు
- రిలయన్స్ షేరు 4.5% కుదేలు



అంతర్జాతీయ విపణులకు ఎగుమతి చేసే పెట్రోలు, డీజిల్‌పై సుంకం విధించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో శుక్రవారం రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) షేరు భారీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యింది. బీఎస్‌ఈలో ఈ షేరు 4.55% నష్టపోయి రూ.1348.25 వద్ద ముగిసింది. ఒక దశలో రూ.1345 వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.87,013.80 కోట్లు తగ్గి రూ.18,24,515.62 కోట్లకు పరిమితమైంది. సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే. సెన్సెక్స్‌కు శుక్రవారం వచ్చిన 1,690 పాయింట్ల నష్టంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటాయే 21% ఉండొచ్చని అంచనా.

ఎందుకు ఇలా..

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు, గ్యాస్ దిగుమతులకు అవరోధాలు ఎదురవుతున్నాయి. దేశీయంగా ఇంధన కొరత పెరగకుండా చూసేందుకు, మనదేశం నుంచి పెట్రో ఉత్పత్తుల ఎగుమతులను నిరుత్సాహ పరచేందుకే, వాటిపై ఎగుమతి సుంకం విధింపునకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీ రిఫైనరీ నిర్వహిస్తోంది. ఇక్కడ ఉత్పత్తి చేసే పెట్రోలు, డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్)లో ఎక్కువ భాగం అంతర్జాతీయ విపణులకు రిలయన్స్ ఎగుమతి చేస్తోంది. మనదేశం కంటే అక్కడ ధర ఎక్కువగా లభిస్తుండటమే ఇందుకు కారణం. తాజాగా ఎగుమతి సుంకం విధించినందున, ఆర్‌ఐఎల్ ఆదాయాలపై ప్రభావం పడొచ్చని.. షేరు అమ్మకాల ఒత్తిడికి లోనుకావడానికి ఇదే కారణమంటున్నారు. కొన్ని నెలలుగా రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు ప్రదర్శన అంత మెరుగ్గా లేదు. నెల రోజుల వ్యవధిలో ఈ కంపెనీ షేరు 3%, 2026లో ఇప్పటివరకు 14% నష్టపోయింది. అయితే గత ఏడాది కాల వ్యవధిలో చూసుకుంటే, ప్రామాణిక సూచీల కంటే మెరుగ్గానే ఉంది. గత ఏడాది వ్యవధిలో నిఫ్టీ 50 సూచీ 3% నష్టపోగా.. ఇదే సమయంలో రిలయన్స్ షేరు 5.4% పెరిగింది. అంతర్జాతీయంగా చమురు ధరలు బాగా పెరగడం వల్ల, రిలయన్స్ మార్జిన్లపై సానుకూల ప్రభావం చూపించొచ్చనే అంచనాతో ఈ కంపెనీ షేరును 'కొనుగోలు' చేయొచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ విశ్లేషకులు సిఫారసు చేస్తున్నారు. జేఎం ఫైనాన్షియల్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఈ రెండు సంస్థలు వరుసగా రిలయన్స్ షేరుకు రూ.1,750; రూ.1,730 లక్ష్యాన్ని అంచనా వేస్తున్నాయి.

ఐపీఓ సమాచారం

బాస్మతీ బియ్యం ఎగుమతి సంస్థ అమిర్ చంద్ ఐపీఓ ముగిసే సరికి 3.23 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 1.36 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి. పవరికా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ముగింపునకు 1.45 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 15% బిడ్‌లు వచ్చాయి. సాయి పేరెంటరల్స్ ఐపీఓ చివరిరోజుకు 1.05 రెట్ల బిడ్లు వచ్చాయి. చిన్న మదుపర్ల విభాగంలో 12% స్పందనే లభించింది. రూ.8.86 లక్షల కోట్ల సంపద ఆవిరి

సూచీలకు భారీ నష్టాలు


రెండు రోజుల వరస లాభాల తర్వాత స్టాక్ మార్కెట్ మళ్లీ నేలచూపులు చూసింది. పెట్రో ఉత్పత్తులపై ఎగుమతి సుంకం ప్రభావంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు డీలాపడటంతో ప్రధాన సూచీలు 2% పైగా నష్టపోయాయి. బ్రెంట్ ముడి చమురు ధర 100 డాలర్ల ఎగువనే కొనసాగుతుండటం, రూపాయి తాజా జీవన కాల కనిష్ఠానికి పడిపోవడం, విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్‌ఐఐలు) అమ్మకాలు కూడా మదుపర్ల సెంటిమెంటును బలహీనపర్చాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 89 పైసలు తగ్గి రూ.94.85 వద్ద ముగిసింది. ఇది తాజా జీవనకాల కనిష్ఠ స్థాయి. బ్రెంట్ ముడి చమురు 4.09% పెరిగి 112.43 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.8,86,383.92 కోట్లు తగ్గి రూ.4,22,15,450.82 కోట్ల (4.47 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. భారీ నష్టాల్లో మొదలై..: ఉదయం బీఎస్‌ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 75273) నష్టాల్లో 74,883.79 పాయింట్ల వద్ద

## సైబర్ దాడులతో పౌరుల ప్రాణాలకు ప్రత్యక్ష ముప్పు..!

ఆరోగ్య సంరక్షణ, పవర్ గ్రిడ్‌ల వంటి కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని ఇటీవల సైబర్ దాడులు పెరుగుతున్న విషయం తెలిసిందే. అయితే, అవి కేవలం డేటా తస్కరణకు మాత్రమే పరిమితం కాలేదని, మానవుల ప్రాణాలకు ప్రత్యక్ష ముప్పు కలిగించే స్థాయికి చేరుకున్నాయని సైబర్ సెక్యూరిటీ నిపుణులు చెబుతున్నారు. దేశంలో డిజిటల్ పురోగతి అనే అంశంపై డెలాయిట్ ప్రతినిధి గౌరవ్ శుక్లా మాట్లాడుతూ.. సరికొత్త సాంకేతికతలు ఈ దాడుల అవకాశాలను మరింత పెంచాయన్నారు. తద్వారా విమానయానం, రవాణా, ప్రజా సేవల రంగాలకు ముప్పుగా పరిణమించనున్నాయన్నారు."గత రెండేళ్లుగా, సైబర్ దాడులు కేవలం ఐటీ వ్యవస్థలకు మాత్రమే పరిమితం కాలేదని గమనించాం. పరిధి దాటి వ్యాపిస్తున్నాయి. కీలక మౌలిక సదుపాయాలను సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా డిజిటల్ సాంకేతికతలో వచ్చిన మార్పులు ఈ దాడుల విస్తృతిని మరింత పెంచాయి. దీంతో అంతరాయాలు కలిగే అవకాశాలు పెరుగుతున్నాయి. వీటి పరిధి డేటా భద్రత నుంచి మానవ భద్రత వైపు మారుతోందని స్పష్టమవుతోంది" అని గౌరవ్ శుక్లా పేర్కొన్నారు.ప్రస్తుతం ఎనిమిది బిలియన్ల ప్రపంచ జనాభా 30 బిలియన్లకుపైగా ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) సెన్సర్లు కలిగి ఉన్నట్టు అంచనా.

## విద్యుత్ బైక్‌ల సబ్సిడీ పొడిగింపు

**న్యూఢిల్లీ:**విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా తీసుకొచ్చిన పీఎం ఇ-డ్రైవ్ పథకంపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎలక్ట్రిక్ టూ వీలర్ సబ్సిడీలను జులై 31 వరకు పొడిగించినట్లు తెలిపింది. అదేవిధంగా ఇ-రిక్షా, ఇ-కార్టుల వాహనాల సబ్సిడీలను 2028 మార్చి 31వరకు పొడిగించినట్లు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించారు.పీఎం ఇ-డ్రైవ్ పథకాన్ని 2024 అక్టోబర్ 1న ప్రారంభించారు. ఎలక్ట్రిక్ టూ వీలర్లు, త్రీవీలర్లు, ఇ- అంబులెన్సులు, ఇ-ట్రక్కులకు కేంద్రం రాయితీ ఇస్తోంది. ఇందులో భాగంగా 1.4 మిలియన్ల ఎలక్ట్రిక్ టూవీలర్లను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 2.48 మిలియన్ల వాహనాలు విక్రయించినట్లు కేంద్రం తెలిపింది. ఇందుకోసం సబ్సిడీ కింద రూ.1772 కోట్ల నిధులను కేటాయించగా, రూ.1,259.91 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొంది. ఇ-రిక్షా, ఇ-కార్టులకు సంబంధించి 36, 462 యూనిట్లను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 39,034 యూనిట్లు అమ్మకాలు జరిగినట్లు తెలిపింది. ఇప్పటివరకూ ఎలక్ట్రిక్ 2 వీలర్ కేటగిరిలో సుమారు 1 మిలియన్ వాహనాలు విక్రయించినట్లు కేంద్రం అంచనా వేసింది. ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ల విభాగంలో లక్ష్యాన్ని మించి 1,62,981 యూనిట్ల వాహనాలు అమ్మకాలు జరిగినట్లు తెలిపింది. కాగా, ఇ-రిక్షా, ఇ-కార్ట్ విభాగంలో ఆశించిన మేర విక్రయాలు జరగనందున, ఆ విభాగాల్లో నిధుల కేటాయింపును రూ. 192 కోట్ల నుంచి రూ.50 కోట్లకు తగ్గించడం గమనార్హం.




# ఇరాన్ నేర్పిన చౌకైనతంత్రం!

## షాహిద్ తరహా డ్రోన్లకు భారత్ ప్రాధాన్యం



**వాషింగ్టన్:**ప్రస్తుత పశ్చిమాసియా యుద్ధం.. ప్రపంచానికి అనేక పాఠాలను నేర్పుతోంది. అందులో ముఖ్యమైంది చౌకైన డ్రోన్లతో పోరాటం! ఇరాన్ తెరపైకి తెచ్చిన యుద్ధతంత్రం నుంచి అమెరికా సహా ప్రపంచదేశాలన్నీ నిశితంగా దృష్టిపెట్టాయి. ముఖ్యంగా టెహ్రాన్ రూపొందించిన షాహిద్-136 డ్రోన్లు.. అనేక దేశాలకు ప్రేరణగా నిలిచాయి. చౌకైన ఈ లోహవిహంగాల నుంచి స్ఫూర్తి పొంది అమెరికా కూడా 'లో కాస్ట్ అన్‌క్రూడ్ కంబాట్ అటాక్ సిస్టమ్' (లూకాస్) అనే డ్రోన్‌ను రూపొందించింది. భారత్ స్వదేశీ దీర్ఘశ్రేణి పోరాట డ్రోన్ల ద్వారా తన దాడి సామర్థ్యానికి మెరుగులు దిద్దుతోంది. షాహిద్-136 డ్రోన్ డిజైన్ సరళంగా ఉంటుంది. వెర్షన్‌ను బట్టి దీని ధర కేవలం 20వేల నుంచి 50వేల డాలర్ల మధ్య ఉంటుంది. 2,500 కిలోమీటర్ల దూరం వరకూ ప్రయాణించగలదు. 40-50 కిలోల వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదు. వీటిని భారీస్థాయిలో ఉత్పత్తి చేసేలా సరఫరా గొలుసు వ్యవస్థను కూడా ఇరాన్ సిద్ధం చేసుకుంది. వీటితో మూకదాడి చేసినప్పుడు ప్రత్యర్థి గగనతల రక్షణ వ్యవస్థ చేష్టలుడిగి చూస్తుండిపోతుంది. షాహిద్-136 డ్రోన్లను రష్యాకూ ఇరాన్ అందించింది. జెరాన్-2 పేరుతో ఉక్రెయిన్‌పై వీటిని మాస్కో ఉపయోగించింది. వాటిని నేలకూల్చడానికి ఉక్రెయిన్ కోట్ల డాలర్లను వెచ్చించాల్సి వచ్చింది. ఆర్మేనియా, అజర్‌బైజాన్ మధ్య జరిగిన పోరులో డ్రోన్లు సత్తా చాటాయి. ఇవి యుద్ధ తీరుతెన్నులను మార్చగలవని అప్పుడే వెల్లడైంది. ఆ పోరులో అజర్‌బైజాన్ గెలుపునకు ఇజ్రాయెల్, తుర్కియే అందించిన డ్రోన్లు ప్రధాన పాత్ర పోషించాయి. సమర్థ వైమానిక దళం లేని ఇరాన్‌కు ప్రస్తుత గల్ఫ్ యుద్ధంలో డ్రోన్లు వరంగా మారాయి. ఇవి ప్రత్యర్థి గగనతలంలోకి లోతుగా చొచ్చుకెళ్లి దాడులు చేస్తున్నాయి. 20 వేల నుంచి 50వేల డాలర్లు మాత్రమే పలికే షాహిద్-136 డ్రోన్‌ను కూల్చడానికి అమెరికా, ఇజ్రాయెల్‌లు ప్రయోగిస్తున్న పేట్రియాట్ క్షిపణి ఖరీదు 40 లక్షల డాలర్లు. ఇలాంటి మరికొన్ని క్షిపణులు ఒక్కొక్కటి 1.2 కోట్ల డాలర్ల ధర పలకడం పరిస్థితికి దర్పణం పడుతోంది. అమెరికాకు చెందిన ఎంక్యూ-9బి స్కై గార్డియన్ లేదా సీ గార్డియన్ డ్రోన్లను ప్రధానంగా వాడేది. ఇవి శక్తిమంతమైనవే! 40 గంటలకుపైగా గాల్లో ఉండగలవు. ఎక్కువ ఎత్తుకు వెళ్లగలవు. మెరుగైన సెన్సర్లు, పేలోడ్లు కలిగి ఉన్నాయి. అయితే ఈ డ్రోన్ ఒక్కొక్కటి 3నుంచి 8 కోట్ల డాలర్లు పలుకుతోంది. ఈ ఖర్చుతో 600 నుంచి 1,500 షాహిద్ డ్రోన్లను ఉత్పత్తి చేయవచ్చు. ఈ నేపథ్యంలో షాహిద్ డిజైన్ ఆధారంగా అమెరికా 35వేల డాలర్ల వ్యయంతో లూకాస్ డ్రోన్‌ను తయారుచేసింది. వీటిని ఇరాన్‌పై దాడుల్లో వాడింది.

**మనకూ ఆదర్శం**

షాహిద్-136 నుంచి స్ఫూర్తి పొంది భారత్ కూడా చౌకైన, దీర్ఘశ్రేణి డ్రోన్ల రూపకల్పనకు చర్యలు చేపట్టింది. నిజానికి మన దేశం వద్ద ఇప్పటికే స్వదేశీ డ్రోన్లు అనేకం ఉన్నాయి. ఇందులో అధునాతన మీడియం ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (మేల్), హై ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (హేల్) యూఏవీలు పరీక్షలు లేదా అభివృద్ధి దశలో ఉన్నాయి. చిన్నపాటి, నిఘా, మూకదాడి చేయగల డ్రోన్లు, పోరాట డ్రోన్లను ప్రైవేటు సంస్థలు, రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)లు రూపొందిస్తున్నాయి. ఇప్పటికే భారత త్రివిధ దళాలు కొన్ని దేశీయ సంస్థల నుంచి ఆత్మాహుతి డ్రోన్లను సమకూర్చుకున్నాయి. వీటిలో స్కై స్ట్రైకర్.. ఆపరేషన్ సిందూర్‌లో సేవలు అందించింది. స్వదేశీ యూఏవీలు కలిగిన ప్రత్యేక డ్రోన్ విభాగాలనూ భారత సైన్యం సిద్ధం చేస్తోంది. ఇప్పుడు చౌకైన షాహిద్ తరహా డ్రోన్లపై భారత్ దృష్టిసారించింది. ఈ విభాగానికి సంబంధించి ప్రధానంగా దేశంలో రెండు ప్రాజెక్టులు సాగుతున్నాయి. ఇందులో ఒకటి.. శేష్‌నాగ్-150. దీన్ని బెంగళూరుకు చెందిన అంకుర సంస్థ న్యూస్పేస్ రీసెర్చ్ అభివృద్ధి చేస్తోంది. రెండోది ప్రాజెక్ట్ కాల్. దీన్ని నొయిడాకు చెందిన ఐజీ డిఫెన్స్ చేపట్టింది. శేష్‌నాగ్-150 దీర్ఘశ్రేణి స్వార్మింగ్ డ్రోన్. ఇవి సమూహంగా వెళ్లి శత్రువుపై మూకదాడులు చేయగలవు. ఒక్కో డ్రోన్ బరువు 150 కిలోలు. 1,200 కిలోమీటర్లు ప్రయాణించగలదు. 40 కిలోల పేలోడ్‌ను మోసుకెళ్లగలదు. 40 కిలోల పేలోడ్‌ను మోసుకెళ్లగలదు.ఐదు గంటలకుపైగా గాల్లో ఉండగలదు. ఇందులోని కృత్రిమ మేధ ఆధారిత స్వార్మ్ పరిజ్ఞానం ఉంది. అందువల్ల ఈ డ్రోన్లు.. సొంతంగా నిర్ణయాలు తీసుకుంటూ ఒక సమూహంగా ఏర్పడి దాడి చేయగలవు. శత్రు గగనతల రక్షణ వ్యవస్థలను తప్పించుకోగలవు. శేష్‌నాగ్-150 తొలిసారిగా గత ఏడాది ఫిబ్రవరిలో గగనవిహారం చేసింది. ప్రాజెక్టు కాల్ ఆరంభ దశలో ఉంది. ఈ డ్రోన్ వెయ్యి కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. గాల్లో 5 గంటల వరకూ ఉండగలదు. అవసరాన్ని బట్టి ప్రయాణమార్గాన్ని సర్దుబాటు చేసుకోగలదు. హైదరాబాద్‌కు చెందిన పలు సంస్థలు కూడా ఇలాంటి చౌకైన డ్రోన్లను అభివృద్ధి చేస్తున్నాయి.





## పాకిస్థాన్ కూడా ఉగ్ర సంస్థలకు అడ్డానే!

పేర్కొంది. అంతేకాదు, తీవ్రవాదం వల్ల ఆ దేశం ప్రభావితమైందని పేర్కొంది. 2021లో అఫ్గాన్‌లో తాలిబన్లు అధికారం చేజిక్కించుకున్న తర్వాత ఈ ఉగ్ర సంస్థలు మరింత బలపడ్డాయని, దాడులు గణనీయంగా పెరిగాయని వెల్లడించింది.పాక్‌లో ఉన్న ఉగ్ర సంస్థలను కాంగ్రెషనల్ నివేదిక వివిధ వర్గాలుగా విభజించింది. దేశీయంగా, అంతర్జాతీయంగా, కొన్ని అఫ్గాన్‌కు సంబంధించి, భారత్-కశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకొని ఆయా సంస్థలు పని చేస్తున్నాయని తెలిపింది. అల్‌ఖైదా తీవ్రంగా బలహీనపడినప్పటికీ.. ఇతర సంస్థలతో కలిసి కార్యకలాపాలు కొనసాగిస్తోందని పేర్కొంది. తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) అనేది ఆ దేశంలో అత్యంత ప్రాణాంతక ఉగ్ర సంస్థగా ఉందని తెలిపింది.



# రష్యా నుంచి గ్యాస్!

## భారీ దిగుమతికి సన్నాహాలు

**న్యూఢిల్లీ:**అంతర్జాతీయంగా ముడిచమురు ధర పెరుగుతున్న నేపథ్యంలో, రష్యా చమురు విక్రయాలపై అమెరికా ఆంక్షలు సడలించింది. వెంటనే అక్కడి సంస్థల నుంచి ముడిచమురు దిగుమతి చేసుకునేందుకు మన రిఫైనరీలు ఆర్డర్లు పెట్టాయి. ఇప్పుడు ద్రవరూప సహజ వాయువు (ఎల్ఎన్‌జీ) కొనుగోళ్లనూ పునరుద్ధరించాలని భావిస్తోంది. హర్మూజ్ జలసంధి అవాంతరాలు ఇపుడిపుడే తొలగిపోయేలా కనిపించకపోవడమే ఇందుకు నేపథ్యం. గ్యాస్ విక్రయానికి కూడా అమెరికా ఆంక్షలు తొలగాల్సి ఉంది. దేశంలో కొరత ఎదురవుతున్నందున, ఎల్ఎన్‌జీ కోసం భారత్ ముందుకు వెళ్లాలనుకుంటే.. అమెరికా నుంచి త్వరగానే అనుమతులు రావచ్చని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ వార్తా సంస్థ 'రాయిటర్స్' తెలిపింది. రష్యా డిప్యూటీ ఇంధన మంత్రి పావెల్ సొరోకిన్‌తో భారత పెట్రోలియం, సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పురి ఈనెల 19న భేటీ అయ్యారు. ఈ సమావేశంలోనే ఎల్ఎన్‌జీ ఒప్పందంపై చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. రష్యా ఎల్ఎన్‌జీ కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉండాలని, దేశీయ ఇంధన దిగుమతిదార్లకు అప్పుడే సలహా ఇచ్చినట్లు సమాచారం. ఆంక్షల మినహాయింపు సాధ్యాసాధ్యాలపై అమెరికాను భారత్ సంప్రదించిందనీ అంటున్నారు.

మనకు మేలేనా?

రష్యా నుంచి ఎల్ఎన్‌జీ దిగుమతికి అనుమతులు వచ్చినా, ప్రయోజనాలు తక్కువేనని విశ్లేషకులు అంటున్నారు. రష్యాకు చెందిన గాజ్‌ప్రోమ్, భారత్‌కు చెందిన గెయిల్ మధ్య 2012లో కుదిరిన దీర్ఘకాల సరఫరా ఒప్పందంతో పోలిస్తే, తాజాగా కుదుర్చుకునే ఒప్పందం ఆర్థిక పరంగా అంతగా ఉపయోగపడకపోవచ్చని అంటున్నారు. అయితే కొరత నివారణే ఇప్పుడు ముఖ్యం కనుక, కేంద్రం ఏ విధమైన అడుగులు వేస్తుందన్నది ఇపుడు ముఖ్యం. ఇంధన భద్రత కోసం గత వారంలో పలు దేశాలతో భారత్ చర్చలు జరిపింది. రష్యా నుంచి తెచ్చుకునే ఎల్ఎన్‌జీ కేవలం వంటకు ఉపయోగించుకునేదే కాబట్టి ఆంక్షలు ఉండకపోవచ్చని సమాచారం. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ప్రారంభమయ్యాక, రష్యా నుంచి భారత్ 50-60 మి. బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసిందని అంచనా.

ఎల్ఎన్‌జీ సరఫరా యథాస్థితి ఎపుడు?

ప్రపంచ ఎల్ఎన్‌జీ రవాణాలో 20% హర్మూజ్ జలసంధి ద్వారానే జరుగుతుంది. ఇది ఆగింది. మనదేశానికి గ్యాస్ కీలక సరఫరాదారైన ఖతార్‌లోని అతిపెద్ద ఎల్ఎన్‌జీ ప్లాంటు, యుద్ధం వల్ల దెబ్బతింది. ఈ ప్లాంట్లలో కార్యకలాపాలు తిరిగి ప్రారంభించడానికి 3-5 ఏళ్ల సమయం పడుతుంది. అంటే ప్రస్తుతం ఏడాదికి 12.8 మిలియన్ టన్నుల గ్యాస్ సామర్థ్యం తగ్గినట్లు లెక్క. ఈ రెండు పరిణామాల నేపథ్యంలో.. అంతర్జాతీయంగా గ్యాస్ సరఫరా 35 మి. టన్నుల మేర తగ్గాయని అంచనా. ఇది 500 ఎల్ఎన్‌జీ కార్గో షిప్‌లకు సమానం. పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందు, అంతర్జాతీయంగా ఎల్ఎన్‌జీ సరఫరా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 10% పెరగొచ్చన్న అంచనాలుండేవి. అమెరికా, ఖతార్‌లలో కొత్త ప్లాంట్లు అందుబాటులోకి వస్తాయన్న అంచనాల మధ్య.. ఎల్ఎన్‌జీ సామర్థ్యం 460-484 మి. టన్నులకు పెరగొచ్చని భావించారు. దీనికి భిన్నమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. తాజా అంచనాల ప్రకారం.. ఖతార్, యూఏఈ నుంచి ఈ ఏడాది 33 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీ ఎగుమతి తగ్గొచ్చన్నది ఎస్ అండ్ పీ గ్లోబల్ అంచనా. 2027-29 మధ్య కూడా సరఫరా ఏటా 19 మి. టన్నుల వరకు తగ్గొచ్చని చెబుతోంది. ఈ లెక్కన ప్రపంచ ఎల్ఎన్‌జీ సరఫరా యథాస్థితికి రావడానికి కొన్నేళ్లు పట్టొచ్చు

## గ్యాసోలిన్‌పై రష్యా నిషేధం..

పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం నెలకొంది. ఇలాంటి సమయంలో రష్యా కీలక ప్రకటన చేసింది. ఏప్రిల్ ఒకటి నుంచి గ్యాసోలిన్ (పెట్రోల్) ఎగుమతులపై నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించింది. దేశీయ సరఫరాకు ప్రాధాన్యం ఇచ్చేందుకు, ధరలను స్థిరీకరించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో భారత్‌పై ప్రభావం గురించి విశ్లేషణలు వస్తున్నాయి భారత్ తన ఇంధన అవసరాలు తీర్చుకునేందుకు 80శాతం మేర ముడిచమురు దిగుమతులపైనే ఆధారపడుతోంది. అందులో 20 శాతం రష్యానుంచే వస్తున్నాయి. మన వద్దే భారీస్థాయిలో రిఫైనింగ్ సామర్థ్యం ఉండటంతో.. మన దిగుమతుల్లో గ్యాసోలిన్ లేక ఇతర శుద్ధి చేసిన ఉత్పత్తుల వాటా స్వల్పమే. దేశంలో రిఫైనరీలు రోజుకు 5.6 మిలియన్ల బ్యారెళ్ల మేర చమురును శుద్ధి చేస్తున్నాయి. ఈ రిఫైనింగ్ వల్ల దేశీయ అవసరాలు తీరడమే గాకుండా పలు ఉప ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి.కాబట్టి.. గ్యాసోలిన్ ఎగుమతిపై రష్యా నిషేధం భారత్‌పై చూపే ప్రభావం పరిమితమే.

# తాండూరు క్వారీ, స్టోన్ పరిశ్రమకు పెద్ద ఊరట


- మైనర్ మినరల్‌గా పునర్వర్గీకరణ, రాయల్టీ సవరణకు మంత్రి సానుకూలం
- స్లాబ్ ఆధారిత పాత రాయల్టీ విధానం తాత్కాలికంగా కొనసాగించనున్నారు
- మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి హామీ



**తాండూరు, మార్చి 28 (జనం సాక్షి):** తాండూరు మండలంలోని క్వారీ మరియు స్టోన్ పాలిషింగ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి సానుకూలంగా స్పందించి పెద్ద ఊరట కలిగించారు. తాండూరు మండల క్వారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు తాండూర్ స్టోన్ మార్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డితో కలిసి క్వారీ లీజ్ హోల్డర్లు, పాలిషింగ్ యూనిట్ యజమానుల ప్రతినిధి బృందం మంత్రిని కలిసి సమగ్ర నివేదిక సమర్పించింది. లైమ్ స్టోన్, షాహాబాద్ స్టోన్, నాపా స్లాబ్ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, ఈ రంగం ద్వారా 20,000 నుంచి 30,000 మందికి జీవనోపాధి లభిస్తోందని ప్రతినిధులు వివరించారు. క్వారీ కార్మికులు, పాలిషింగ్ యూనిట్ కార్మికులు, రవాణా దారులు, అనుబంధ రంగాల వారు ఈ సంక్షోభంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రధాన డిమాండ్లు: లైమ్ స్టోన్ స్లాబ్స్, షాహాబాద్ స్టోన్‌ను మైనర్ మినరల్‌గా పునర్వర్గీకరణ చేయాలి.
రాయల్టీ మరియు ఇతర ఛార్జీలను సవరించి సక్రమంగా నిర్ణయించాలి.
స్లాబ్ ఆధారిత పాత రాయల్టీ విధానం (ఓల్డ్ స్లాబ్ సిస్టమ్) కొనసాగించాలి.
మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి సానుకూలంగా స్పందించి, మైనర్ మినరల్‌గా పునర్వర్గీకరణ అంశాన్ని ప్రాధాన్యంగా పరిశీలిస్తామని తెలిపారు. రాయల్టీ మరియు ఇతర ఛార్జీల సవరణ అంశాన్ని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డితో చర్చించి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. స్లాబ్ ఆధారిత పాత రాయల్టీ విధానాన్ని తాత్కాలికంగా కొనసాగించడానికి అనుమతి ఇస్తామని హామీ ఇచ్చారు.
ఈ హామీలు క్వారీ యజమానులు, పాలిషింగ్ యూనిట్ యజమానులు మరియు ఈ రంగంపై ఆధారపడిన వేలాది కార్మికుల్లో నూతన ఆశలు, నమ్మకం కలిగించాయి. ప్రతినిధి బృందం మంత్రి మరియు ఎమ్మెల్యేకు వారి సహకారానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అబ్దుల్ రావూఫ్, ఎం.ఎ. నయీం (అప్పు), ఉపాధ్యక్షులు ఓం ప్రకాశ్ సోమాని, మొహమ్మద్ అన్వర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ జుబైర్ పాషా, తాండూర్ స్టోన్ మెర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తాండూర్ మండల క్వారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# చదువుకునేటప్పుడు ఎస్సీ..
# ఉద్యోగం కొట్టేటప్పుడు ఎస్టీ

- జనంసాక్షి కథనంపై విద్యాశాఖ అధికారుల విచారణ..
- నకిలీ కుల సర్టిఫికెట్‌తో టీచర్ ఉద్యోగం
- విచారణ అనంతరం చర్యలు..
- ఇబ్రహీంపట్నం విద్యాశాఖ అధికారి హీర్యా నాయక్




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) :**
చదువుకునేటప్పుడు ఎస్సీ కుల సర్టిఫికెట్‌తో విద్యాభ్యాసం చేసిన విద్యార్థిని, ఉద్యోగ నియామక సమయంలో ఎస్టీ కుల సర్టిఫికెట్‌తో అప్లై చేసి ఎస్జీటీ టీచరు (క్యాపెంటరీ) పోస్టు సాధించిన ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నం మండలంలో తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ ఘటనలో మండల విద్యాధికారి హీర్యా నాయక్ ఆధ్వర్యంలో విచారణ శనివారం నాడు కొనసా గింది. ఆమె రెండు వేర్వేరు కులాల సర్టిఫికెట్లు సమర్పించడం సందేహాలకు దారితీసింది. విచారణ సందర్భంగా ఆమె మరోసారి కొత్త సర్టిఫికెట్ సమర్పించాలని చెప్పినట్లు అధికారి తెలిపారు అయితే, ఆ సర్టిఫికెట్ స్పష్టత లేకపోవడంతో అధికారులు మరింత జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు.
అధికారులకు సమర్పించిన రికార్డుల ప్రకారం, ఆమె 2001లో ఎస్సీ కుల ధృవీకరణ పత్రంతో విద్యాభ్యాసం చేసినట్లు గుర్తించారు. అయితే 2002లో ఎస్టీ కుల సర్టిఫికెట్‌తో టీచర్ పోస్టుకు అప్లై చేసి, తాండూరు ప్రాంతంలోని ఎంపీపీ ప్రభుత్వ స్కూల్లో ఎస్జీటీ టీచర్‌గా ఎంపికైంది. 29 అక్టోబర్ 2002న డ్యూటీలో చేరినట్లు రికార్డులు ఉన్నాయి. ఒకే వ్యక్తి ఒక్క సమయంలో రెండు వేర్వేరు కులాలకు చెందినట్లు ధృవీకరించడం సాధ్యం కాదని అధికారులు స్పష్టం చేశారు.
జనంసాక్షి కథనంతో ఈ వ్యవహారం విద్యాశాఖలో కలకలం సృష్టించింది. విచారణ పూర్తి చేసి రిపోర్టు సమర్పించాల్సి ఉందని, ఆ తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆమెపై తగు చర్యలు తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఈ ఘటనను తీవ్రంగా పరిశీలించి, నిజానిజాలు బయటపెట్టి ఉద్యోగి మీద చట్టపరమైన చర్యలు చేపడతామని అధికారులు స్పష్టం చేశారు. ఇలాంటి కుల సర్టిఫికెట్ మోసాలు విద్యాశాఖలో ఇక ముందు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే టీచర్ల నియామకంలో కుల ధృవీకరణ పత్రాల సత్యతను కఠినంగా పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు..

> **స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ప్రజల ఆశలు**
> కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వికారాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై రాష్ట్ర శాసనసభాపతిగా బాధ్యతలు చేపట్టిన గడ్డం ప్రసాద్ కుమార్‌పై స్థానికులు ఆశలు పెట్టుకున్నారు. ఏడాదిన్నర గడుస్తున్నా రోడ్డు సమస్యలో ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో ప్రజల్లో నిరాశ వ్యాపించింది. హైదరాబాద్ నుంచి వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్, మర్పల్లి మండలాలకు వెళ్లాలంటే స్వయంగా స్పీకర్ ఈ రోడ్డు మీదుగానే ప్రయాణించాల్సి ఉంటుంది. అయినా తన సొంత నియోజకవర్గంలోని ఈ కీలక సమస్యపై స్పీకర్ పట్టించుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



# ఈ రహదారి గుంతలమయం

## 20 కి.మీ. ప్రయాణం నరకయాతన

- అధ్వానంగా ... శంకర్‌పల్లి-మోమిన్‌పేట్ రోడ్డు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదు
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి సమస్య





**బంట్వారం, మార్చి 28 (జనంసాక్షి):**
హైదరాబాద్ నుంచి పంచలింగాల్, బంట్వారం, మోమిన్‌పేట్ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి శంకర్‌పల్లి-మోమిన్‌పేట్ రోడ్డు అత్యంత అధ్వాన స్థితిలో ఉంది. శంకర్‌పల్లి నుంచి మోమిన్‌పేట్ వరకు సుమారు 30 కిలోమీటర్ల పొడవున్న ఈ రోడ్డు శంకర్‌పల్లి నుంచి వికారాబాద్ వెళ్లేందుకు కూడా ప్రధాన మార్గం. సగం భాగం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్నప్పటికీ రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది.
శంకర్‌పల్లి నుంచి లక్ష్మారెడ్డిగూడ గేటు వరకు ఇటీవలే రోడ్డు నిర్మాణం జరిగినా, అక్కడి నుంచి మోమిన్‌పేట్ వరకు సుమారు 20 కిలోమీటర్ల మార్గం ప్రయాణికులకు నరకయాతనగా మారింది. గుంతల మయమైన రోడ్డు వల్ల కొత్తగా వచ్చే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. చీమలదరి, దేవరంపల్లి, మోమిన్‌పేట్ చిలుకవాగు పైన నిర్మించిన బ్రిడ్జిలు కేవలం నిర్మించి వదిలేశారు. మోమిన్‌పేట్ నంది వాగు మీది పురాతన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలంలో ఈ వంతెనపై నీళ్లు ప్రమాదకరంగా పారుతాయి. దీంతో పోలీసులు రాకపోకలు నిలిపివేస్తారు. గత ఐదు-ఆరు సంవత్సరా ల్లో ఈ రోడ్డుపై పలువురు ప్రాణాలు కోల్పోయినా పాలకులు స్పందించడం లేదు.

### అభివృద్ధి కుంటుబడుతోంది

వికారాబాద్ నియోజకవర్గానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడం వల్ల అభివృద్ధి కుంటుబడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవాబ్ పేట్, మోమిన్‌పేట్, మర్పల్లి మండలాలు రోడ్డు సమస్య వల్ల అభివృద్ధికి నోచుకోవడం లేదు. రియల్ ఎస్టేట్, పెట్టుబడులు కూడా రావడం లేదు. ఇప్పటికైనా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తన నియోజకవర్గంలోని ఈ ప్రధాన రోడ్డు సమస్యను దృష్టిలో ఉంచుకుని వెంటనే నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# లోక్ అదాలత్ వివాదాల పరిష్కారం

## ఇరువురి అంగీకారంతో కేసుల రాజీ


- పోలీస్ శాఖ న్యాయవ్యవస్థకు సహకారం
- ప్రజలు పోలీస్ న్యాయవ్యవస్థపై విశ్వాసం ఉంచాలి
- జిల్లా న్యాయమూర్తి చంద్ర కిషోర్, జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా



**వికారాబాద్ జిల్లా బ్యూరో మార్చి 28 (జనం సాక్షి):** లోక్ అదాలత్ లో ఇరువురి అంగీకారంతో వివాదాల పరిష్కారానికి చక్కటి అవకాశం అని జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి చంద్ర కిషోర్ అన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్ర మం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జ్ చంద్ర కిషోర్ ముఖ్య అతిథిగా, జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా హాజరై కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జడ్జ్ మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా వివాదాలను త్వరితగతిన, సౌహార్దపూర్వకంగా పరిష్కరించుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులను తగ్గించడంలో లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అలాగే చిన్న చిన్న వివాదాలను పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవడం వల్ల సమ యం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా మాట్లాడుతూ, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ న్యాయవ్యవస్థకు సహకరిస్తుందని తెలిపారు. లోక్ అదాలత్ వంటి వేదికలు ప్రజలకు న్యాయం త్వరగా అందిం చడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజలు చట్టపరమైన సమస్యలను సత్వరంగా పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలని, పోలీస్ న్యాయ వ్యవస్థపై విశ్వాసం ఉంచాలని కోరారు. ముఖ్యంగా రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, రోడ్డు ప్రమాద భీమా కేసులు మరియు సివిల్ వివాదాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల ఇరు వర్గాల మధ్య సత్సంబంధాలు నెలకొంటాయని ఎస్పీ వివరించారు. కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా, పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులను సామరస్యం గా ముగించుకోవడానికి ఇదొక సువర్ణావకాశమని ఆమె తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులు లోక్ అదాలత్ విజయవంతం కోసం చురుగ్గా పని చేస్తున్నారని తెలిపినారు. అనంతరం ముఖ్య అతిథిలు మెడియోషన్ పైన ప్రజలకు అవగాహన కల్పించడానికి కాక్షిదారులతో కలసి లఘు చిత్రాన్ని విక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేశం, జూనియర్ సివిల్ జడ్జ్ శాంతి లత, అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ వైష్ణవి డిసిఆర్‌బి డీఎస్పీ జానయ్య, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ద్వితీయ శ్రేణి మేజిస్ట్రేట్ నర్సింహులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ శాఖ అధికారులు, న్యాయవాదులు ఇతరులు పాల్గొన్నారు.

# కుల వివక్షకు యువకుడు బలి

- దళిత యువతిని ప్రేమ వివాహం చేసుకున్నందుకు ఆస్తి నిరాకరణ
- సెల్ టవర్‌పై నుంచి దూకి యువకుడు ఆత్మహత్య



**మోమిన్‌పేట, మార్చి 28 (జనంసాక్షి):** సమాజంలో ఇంకా కుల వివక్ష ఎంత లోతుగా వేరూరుకుపోయిందో చూపించే విషాదకర ఘటన మోమిన్‌పేట మండలం కేసారం గ్రామంలో చోటుచేసుకుంది. దళిత యువతిని వివాహం చేసుకున్నాడనే కారణంతో తండ్రి ఆస్తి ఇవ్వకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు సెల్‌ఫోన్ టవర్‌పై నుంచి దూకి ప్రాణాలు తీసుకున్నాడు.
గ్రామానికి చెందిన ముదిరాజ్ వర్గానికి చెందిన కావలి నరేందర్ అలియాస్ నాగరాజ్ (38) శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎస్‌సి యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. అయితే, కులాంతర వివాహాన్ని అంగీకరించని తండ్రి యాదయ్య ఇంటి స్థలం మరియు సుమారు 15 గుంటల వ్యవసాయ భూమిలో తన వాటా ఇవ్వకుండా నిరాకరించాడు. ఇటీవల ఆ భూమిని ఇతరులకు అమ్మేందుకు తండ్రి ప్రయత్నిస్తున్నట్లు తెలుసుకున్న నరేందర్ తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం కేసారం గ్రామ సమీపంలోని సెల్ టవర్‌పైకి ఎక్కి, కేబుల్ వైర్లను మెడకు చుట్టుకుని దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.
మరణానికి ముందు గ్రామపంచాయతీ సెక్రటరీ, సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు లేఖ రాసి, తనకు సంబంధించిన ఆస్తిని గ్రామంలో ఎవరూ కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇలాంటి సంఘటనలు సమాజం ఎంత ముందుకు వెళ్లినా, మనసులు మాత్రం ఇంకా కుల కట్టుబాట్లలోనే బంధించ బడి ఉన్నాయనే చేదు నిజాన్ని బయటపెడుతున్నాయి. ప్రేమించి పెళ్లి చేసుకున్న కొడుకును అంగీకరించలేని తల్లిదండ్రుల మానసికత ఒక కుటుంబాన్ని నాశనం చేయడమే కాకుండా, ఇద్దరు చిన్నారులను తండ్రి లేకుండా చేసింది. కులం పేరుతో మనుషుల్ని తక్కువ చేసి చూడడం, వారి హక్కులను కాదనడం ఎంతటి ఘోర పరిణామాలకు దారితీస్తుందో ఈ ఘటన స్పష్టంగా చెబుతోంది. ఇలాంటి వివక్షను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో కరీంనగర్ కమిషనరేట్ సక్సెస్

- 3,758 కేసులు పరిష్కారం.. పెట్టి, ట్రాఫిక్, ఎక్సైజ్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు
- పోలీసు కమిషనర్ గౌస్ ఆలం



**కరీంనగర్ బ్యూరో, మార్చి 28 (జనంసాక్షి):** జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో మొత్తం 3,758 కేసులు విజయవంతంగా పరిష్కరించబడిన ట్లు పోలీసు కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ఈ పరిష్కరించిన కేసుల్లో పెట్టి కేసులు, ట్రాఫిక్ సంబంధిత కేసులు, ఎక్సైజ్‌కు సంబంధించిన కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు మరియు ఇతర చట్టపరమైన స్వల్ప కేసులు ఉన్నాయని కమిషనర్ వివరించారు. లోక్ అదాలత్ ద్వారా పాత పెండింగ్ కేసులకు వేగవంతంగా పరిష్కారం లభించడంతో పాటు, ప్రజలకు కోర్టు వ్యవహారా ల్లో సమయం, ఖర్చు గణనీయంగా తగ్గిందని తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది సమన్వ యంతో పనిచేసి కేసుల పరిష్కారంలో మంచి ఫలితాలు సాధించారని పోలీసు కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేసుల పరిష్కారానికి సహకరించడం విశేషం. ఈ సందర్భంగా జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి సహకరించిన న్యాయాధికారులు, పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు ప్రజలందరికీ కమిషనరేట్ తరఫున సీపీ గౌస్ ఆలం కృతజ్ఞతలు తెలిపారు.

# సీసీ రోడ్డు సరే.మరుగుదొడ్లు ఏవి...?

**ధారూర్ మార్చి 28(జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా ధారూర్ మండల కేంద్రంలో బస్టాండ్ ప్రాథమిక సౌకర్యాల లోపం తీవ్ర సమస్యగా మారింది. బస్టాండ్ పరిసరాల్లో సీసీ రోడ్లు నిర్మించినప్పటికీ, ప్రయాణికులకు అత్యవసరమైన మరుగుదొడ్లు సదుపాయం లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు వందలాది మంది ప్రయాణికులు ఈ బస్టాండ్‌ను వినియోగిస్తున్నప్పటికీ, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో మహిళలు, వృద్ధులు,పిల్లలు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిశుభ్రత సమస్యలు కూడా తలెత్తుతున్నాయి.
ఈ విషయంపై స్థానిక నాయకుడు దావూద్ స్పందిస్తూ, "రోడ్లు వేసినంత మాత్రాన అభివృద్ధి పూర్తి కాలేదు. ప్రజలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ప్రజా ప్రతినిధులపై ఉంది అని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి, వాటిని వినియోగంలోకి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా బస్టాండులో ప్రయాణికులకు త్రాగడానికి నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని అయన కోరారు.

# మానేరు రివర్ ఫ్రంట్ పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కరీంనగర్ బ్యూరో, మార్చి 28 (జనంసాక్షి):**
కరీంనగర్ ఎల్.ఎం.డి రిజర్వాయర్ దిగువన నిర్మాణంలో ఉన్న"మానేరు రివర్ ఫ్రంట్" పనులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పరిశీలిం చారు. మున్సిపల్, రెవిన్యూ, నీటిపారుదల శాఖ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి రివర్ ఫ్రంట్ బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. రివర్ ఫ్రంట్ నిర్మాణ అంచనా వ్యయం, పూర్తిచేసిన పనుల వివరాలు, చేయవలసిన నిర్మాణాలు తదితర అంశాలను అధికారులు వివరించారు. రివర్ ఫ్రంట్ నిర్మాణంలో భాగం గా టూరిజం అభివృద్ధి నమూనా, పర్యాటక అభివృద్ధిలో భాగంగా ఏయే నిర్మాణాలు, ఎంత విస్తీర్ణంలో, ఎక్కడ చేపడుతున్నారని విషయాల ను గురించి కలెక్టర్ తెలుసుకున్నారు. నది లోతు, ఇరువైపులా కట్ట నిర్మాణం ఎత్తు, ప్రైవే టు, ప్రభుత్వ భూమి సేకరణ వంటి వివరాలను అడిగారు. నదికి ఇరువైపులా చేపట్టబోయే పలు అభివృద్ధి పనుల గురించి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డిఓ మహేశ్వర్, నీటిపారుదల శాఖ ఎస్ఈ. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# గ్యాస్ గోదాంకు బారులు

**పుల్కల్ మార్చి28,( జనం సాక్షి):** సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని గొంగ్లూరు గ్రామంలో ఉన్న భారత్ గ్యాస్ గోదాంకు శనివారం ఉదయం నుంచి వినియోగదారులు బారులు తీరారు. గ్యాస్ కొరత ఉన్న కారణంగా భారత్ గ్యాస్ గోదాంకు వచ్చిందని తెలుసుకున్న వినియోగదారులు మండలంలోని ఆయా గ్రామాల నుంచి వినియోగదారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం ఐదు గంటల నుంచి వినియోగదారులు క్యూలో నిలబడి గ్యాస్ లు తీసుకున్నారు. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా మహిళలు సైతం గంటల తరబడి క్యూలో నిలబడ్డారు. దీంతో అక్కడ కొద్దిసేపు వినియోగదారులకు తోపులాట జరిగింది. గ్యాస్ కొరత ఎక్కువైందని సరిపోను గ్యాస్ పంపిణీ చేయకపోవడంతో మాకు కట్టెల పొయ్యే దిక్కైందని గోదాంకు వచ్చిన వినియోగదారులు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం సరిపడ గ్యాస్ ను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని అక్కడికి వెళ్లిన విలేకరులతో వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

# సంచలనం సృష్టించిన వృద్ధులపై దాడి కేసు ఛేదన

- 4 తులాల బంగారం రికవరీ, వాహనం స్వాధీనం
- ముసుగు ధరించి దాడి.. 48 గంటల్లోనే నిందితుడు అరెస్ట్
- ప్రత్యేక బృందాలతో వేగవంతంగా కేసు ఛేదించిన పోలీసులు
- జిల్లా ఎస్పీ డి. వి శ్రీనివాస్ రావు




**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 28 (జనంసాక్షి) :**
మెదక్ జిల్లాలోని చిన్న శంకరంపేట మండలంలో వృద్ధ దంపతులపై పట్ట పగలు దాడి చేసి దోపిడీకి పాల్పడిన సంఘటన తీవ్ర కలకలం సృష్టించిం ది. కాగా పోలీసులు అతి చాకచక్యంగా వ్యవహరించి 48 గంటల్లోనే కేసు ను చేదించి నిందితున్ని అరెస్టు చేశారు. మెదక్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు మెదక్ లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.
చిన్న శంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి చెందిన తమ్మల నర్సింలు (48) ఫిర్యాదు మేరకు ఈ నెల 25న మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి ముసుగు ధరించి వారి ఇంట్లోకి చొరబడ్డాడు. ఇంట్లో ఉన్న వృద్ధ దంపతులు తమ్మల అంజయ్య (85), సావిత్రమ్మ (80)పై ఇనుప రాడ్డుతో దాడి చేసి, వారి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితుడిని గుర్తించారు. శనివారం (28న) ఉదయం 9 గంటలకు తూప్రాన్ బస్ స్టాప్ వద్ద వరిగే వెంకట నారా యణ (40)ను అదుపులోకి తీసుకున్నారు. ఇతడు నాగిరెడ్డిపేట మండలం, కామారెడ్డి జిల్లా వాసి కాగా, ప్రస్తుతం తూప్రాన్‌లో నివాసం ఉంటున్నాడు. నిందితుడి వద్ద నుంచి 2½ తులాల బంగారు పుస్తెల తాడు, 1 తులాల గొలుసు, అర్ధ తులం బంగారు ఉంగరం, అలాగే నేరానికి వినియోగించిన టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సుమారు 4½ తులాల బంగారం రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో నిందితుడు అప్పులు తీర్చుకోవడం కోసం సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ దోపిడీకి పాల్పడినట్లు వెల్లడైంది. బాధితులు తనకు పరిచయం ఉన్న బంధువులేనని తెలిసినా, ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని గమనించి పథకం ప్రకారం నేరానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సూచనలతో రామాయంపేట సీఐ వెంకట్ రాజా గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు కృషి చేసి కేసును ఛేదించాయి. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించి ప్రశంస పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఇలాంటి ఘటనల నేపథ్యంలో ప్రజలు అపరిచితులపై నమ్మకం ఉంచకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో నీటి ప్యూరిఫైయర్, ఆటవస్తువులు ప్రారంభం

- ఒక్కో అంగన్వాడీకి ఒక లక్ష రూపాయల నిధులు విడుదల
- పిల్లలు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం కోసం ప్రభుత్వం కృషి
- మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, మార్చి 28 (జనంసాక్షి) :** అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. పోషణ అభియాన్ పథకం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపం నివారించడానికి కరీంనగర్ నగరంలోని తీగలగుట్టపల్లి అంగన్వాడీ కేంద్రంలో 'సాక్ష్యం అంగన్వాడీ' కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ కొలగాని శ్రీనివాస్ సిడిపిఓ సభితతో కలిసి మంచి నీటి ప్యూరిఫైయర్, పోషణ వాటిక, బాల పెయింటింగ్, పిల్లల ఆట వస్తువులను ప్రారంభించారు. అనంతరం చిన్నారులతో ముఖాముఖి అప్యాయంగా మాట్లాడారు. పిల్లల విద్యాభ్యాసం, ఆటపాటలు, అందిస్తున్న పౌష్టికాహారం, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అంగన్వాడీ నిర్వాహకుల నుంచి తెలుసుకున్నారు. పాలు, గుడ్ల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. పిల్లల హాజరు శాతం, బరువు, ఎత్తు నమోదు రికార్డులను తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, "పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదగడానికి ఈ వయస్సు చాలా కీలకం. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించడం ద్వారా మాత్రమే ఆరోగ్యకరమైన భవిష్యత్ తరాలను నిర్మించుకోగలం" అన్నారు. ఒక నగరం లేదా సమాజం అభివృద్ధి చెందాలంటే ముందుగా అక్కడి తల్లులు, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని పేర్కొన్నారు. అలాంటి బాధ్యతను తమ భుజాలపై వేసుకుని, ఒక తల్లిలా పిల్లలను సాకుతున్న అంగన్వాడీ సిబ్బంది సేవలు వెలకట్టలేమని అభినందించారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం 'పోషణ అభియాన్', 'సాక్ష్యం అంగన్వాడీ' కార్యక్రమాల ద్వారా ఒకవైపు పోషక విలువతో కూడిన పాలు, గుడ్లు, బాలామృతం, పప్పు అందిస్తుండగా, మరోవైపు మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. నగర వ్యాప్తంగా 35 అంగన్వాడీ కేంద్రాల్లో వసతి సౌకర్యాల కోసం ప్రభుత్వం ఒక్కో అంగన్వాడీకి ఒక లక్ష రూపాయల నిధులు విడుదల చేసిందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణీ స్త్రీల కోసం నీటి శుద్ధీకరణ యంత్రాలు, పోషణ వాటికలు, ఎల్ఈడి టీవీలు, బాల పెయింటింగ్, ఆట వస్తువులు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని మేయర్ వివరించారు. కరీంనగర్ జిల్లాలోని 269 అంగన్వాడీ కేంద్రాల్లో ఇలాంటి వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను పిల్లల తల్లిదండ్రులు సమర్థించాలని, పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు తప్పకుండా పంపించాలని మేయర్ పిలుపునిచ్చారు. అంగన్వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పెరిగేలా సంబంధిత టీచర్లు, సీడిపిఓ, అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## భీమారంలో అడ్డగోలుగా అక్రమ ఇసుక రవాణా



**జగిత్యాల క్రైమ్, మార్చి 28 (జనంసాక్షి) :** భీమారం మండల కేంద్రంలో ఎల్లమ్మ టెంపుల్ కు వెళ్లే మార్గంలో బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న వాగులో అక్రమంగా ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా పగలు రాత్రి తేడా లేకుండా అక్రమ ఇసుక రవాణా చేసి జేబులో సొమ్ము చేసుకుంటున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి కంచె చేను మేస్తే కాపాడేది ఎవరు అన్నట్లుగా అధికారుల తీరు పలు విమర్శలకు తాగునీస్తుంది. మైనర్లు వాహనాలు నడపడం నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను రోడ్డుపై తిరగడం, అతివేగంగా నడపడం వంటి సంఘటనలు జరుగుతున్న మాకేం పట్టింపులే అన్నట్లుగా అధికారుల తీరు అగమ్య గోచరంగా మారింది. ప్రతినిత్యం పలువురి ప్రజా ప్రతినిధుల అండదండలతో అధికారులను మంచిగా చేసుకొని యదేచ్ఛగా రెండంకెల సంఖ్యలో అక్రమ ఇసుకను ట్రాక్టర్లలో నింపి మేడిపల్లి జగిత్యాల తదితర ప్రాంతాలకు ఉదయాన్నే తరలిస్తున్న ఏ ఒక్కరు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. పలువురు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల అనుమతి పేరుతో సిసి రోడ్ల నిర్మాణాల పేర్లతో డ్రైనేజీ నిర్మాణాల పనుల పేర్లతో అక్రమ ఇసుక రవాణాలను రవాణా చేస్తూ మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా రవాణా కొనసాగిస్తున్నారు. ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న అధికారుల తీరు విస్మయంగా మారింది. ఇసుక నింపే స్థానంలోని ఏదైతే డంపులను ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో గుట్ట చప్పుడు కాకుండా ట్రక్కుల ద్వారా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న సంఘటనలు ఉన్నాయి. వాల్టా చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొడుతూ నూతన మండల కేంద్రంలో యదేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్న సదరు అధికారులు పనితీరును ఉన్నతాధికారులు దృష్టి సారించాలని అక్రమ ఇసుక రవాణాను అదుపు చేయాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుచున్నారు.



## ధర్నాకు వెళ్లనివ్వలేదు

### భోజనం కూడా ఇవ్వలేదు.. ఆశా వర్కర్ల ఆగ్రహం

**కరీంనగర్ టౌన్ మార్చి 28 (జనం సాక్షి) :** కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్బంధించిన ఆశా వర్కర్లు భోజనం, నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైద్రాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు వెళ్తున్న వారిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పలు స్టేషన్లకు తరలించినట్లు సిఐటియు నేత ఎడ్ల రమేష్ తెలిపారు. దాదాపు 500 మంది ఆశా కార్యకర్తలు ఉదయం నుంచి ఆహారం, నీరు లేక నిరసన చేపట్టగా, కొందరు అనారోగ్యానికి గురై సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో ఆగ్రహించిన వారు పీటీసీ నుంచి బయటకు రావడానికి ప్రయత్నించగా, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సొమ్మసిల్లిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మిగిలిన వారు "భోజనం పెట్టాలి లేదా విడుదల చేయాలి" అంటూ గట్టిగా డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున అవుట్ గేట్ వద్దకు చేరుకోవడంతో పోలీసులు వారిని విడుదల చేసినట్లు సమాచారం. ప్రభుత్వం హామీలు నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం, అవసరమైతే నిరవధిక సమ్మె చేపడతామని సిఐటియు హెచ్చరించింది.



## గంజాయి మొక్క స్వాధీనం

### ఒక వ్యక్తి అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 28 (జనంసాక్షి) :** వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం గ్రామ శివారులో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అచ్చే లాల్ అనే వ్యక్తి గంజాయి మొక్కలను అక్రమంగా సాగు చేస్తున్నాడు. వేములవాడ డిఎస్పి శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్సై శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని గంజాయి మొక్కను స్వాధీనం చేసుకున్నారన్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించగా ఇంచార్జ్ సీఐ శ్రీనివాస్ అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు తెలిపారు. గంజాయి మొక్క స్వాధీనం చేసిన ఎస్సై శ్రీనివాస్, కానిస్టేబుళ్ళు మహిపాల్, సంతోష్, హోంగార్డ్ ఆనంద్ లను డిఎస్పీ అభినందించారు.

## అగ్నివీర్‌లో చేరడానికి దరఖాస్తులు ఆహ్వానం

**కామారెడ్డి జిల్లా ప్రతినిది, (జనం సాక్షి) :** యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు భారత ప్రభుత్వం, అగ్నిపథ్ పథకం లో భాగంగా భారత సైనిక విభాగంలో అగ్నివీర్‌గా చేరడానికి పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. జిల్లా కలెక్టర్ అనుమతితో ఈ నోటిఫికేషన్ విడుదల చేయబడింది. వివాహం కాని పురుష అభ్యర్థులు మాత్రమే, కనీసం 8వ తరగతి లేదా అంతకంటే ఎక్కువ చదివినవారు. 01.07.2005-01.07.2009 మధ్య జన్మించిన వారు. ఆసక్తి ఉన్న, అర్హత కలిగిన కామారెడ్డి జిల్లా యువకులు వివరాలు తెలుసుకుని 01.04.2026 తేదీలోపు www.joinindianarmy.nic.in వెబ్‌పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. అగ్నివీర్ పథకం ద్వారా భారత సైన్య ంలో చేరి తన దేశ సేవ చేయాలనుకునే యువకులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## సర్దార్ రవీందర్ సింగ్ మీ ప్రవర్తన మార్చుకో..

- మంత్రిపై అనవసరపు ఆరోపణలు చేస్తే ఊరుకోం
- కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్



**కరీంనగర్ బ్యూరో, మార్చి 28 (జనంసాక్షి):**

పచ్చకామెర్లోనికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుందన్న చందంగా నేడు అవినీతి పరులు నీతి మంతులుగా వాఖ్యలు చేయడం చాలా విడ్డూరం అని 26వ డివిజన్ కార్పొరేటర్, కరీంనగర్ కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మండి పడ్డారు. యూఐడిఎఫ్ నిధుల టెండర్లు రద్దు చేయబడ్డాయని వాటిలో మా మంత్రి పొన్నం ప్రభాకర్ పేరు ఉచ్చరిస్తూ.. అనవసరపు ఆరోపణలు చేస్తున్న మాజీ మేయర్ సర్దార్ రవీంధర్ సింగ్ పై శనివారం రోజు పత్రిక ప్రకటనలో వైద్యుల అంజన్ కుమార్ ధ్వజమెత్తారు. గత రెండు, మూడు రోజులుగా పత్రికల్లో యుఐడిఎఫ్ నిధులు రద్దు చేయబడ్డాయని ఆరోపణలతో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని వెల్లడించారు. మాజీ మేయర్ సర్దార్ రవీంధర్ సింగ్ మా మంత్రి పొన్నం ప్రభాకర్ పై అనవసరపు ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. సంబంధిత నిధులకు సంబంధించి, వాటి పనుల టెండర్లకు సంబంధించి మంత్రి కి ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. నిధులను రద్దు చేయమని, టెండర్లను క్యాన్సల్ చేయాలని మా మంత్రి ఎక్కడా చెప్పలేదని అన్నారు. నూతనంగా వీలినం చెందిన గ్రామాల డివిజన్ల అభివృద్ధి చెందాలని, నిధులను వినియోగించుకోవాలని తెలిపారే తప్పా ఎక్కడ వీటికి వ్యతిరేక స్వరం వినిపించలేదని తెలిపారు. పలువురు కార్పోరేటర్లు తమ డివిజన్ల అభివృద్ధి కొరకు అర్జీలు పెట్టుకోవాలని, వాటిని వినియోగం చేస్కోవాలని సూచనలు చేశారని తెలిపారు. అనవసరమైన రాద్ధాంతం చేస్తూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ పేరును ఉచ్చరిస్తూ.. అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని, సర్దార్ రవీంధర్ సింగ్ మీ ప్రవర్తన మార్చుకోవాలని, మా మంత్రి పై అనవసరపు ఆరోపణలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. సెక్యులర్ పార్టీలో ఉండి మేయర్ ఎన్నికలో నీ పాత్ర, నీ ప్రమేయం నగర ప్రజలందరికీ తెలుసని మండి పడ్డారు. మీరు ఏ రకంగా మద్దతు తెలిపి బీజేపితో కుమ్మక్కైయ్యారో నగర ప్రజలందరికీ తెలుసని, చర్చించుకుంటున్నారని ధ్వజమెత్తారు. మీరు చేసిన సైలెంట్ రాజకీయం ప్రజలకు తెలుసని, సిగ్గుతో తలదించుకోవాల్సిన రవీందర్ సింగ్ నీతులు మాట్లాడితే ప్రజలే బుద్ధి చెప్తారని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యులు అంజన్ కుమార్ తెలిపారు.

## అల్ఫోర్స్‌లో ముగిసిన ఎన్సీసీ.. ఆపదమిత్ర శిక్షణ శిబిరం

### అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో, మార్చి 28 (జనంసాక్షి):**

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి , ఎన్సీసీ 9వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కర్నల్ ఎ.కె. జయంత, ఇతర అధికారులతో కలిసి, స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో గత కొన్ని రోజులుగా నిర్వహించిన యువ ఆపదమిత్ర శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ సమగ్రత, దేశభక్తి ప్రతి పౌరునికి అత్యంత ముఖ్యమైన విలువలని, అవే దేశ ప్రగతికి పునాదులని పేర్కొన్నారు. దేశ రక్షణలో ఎన్సీసీ పాత్ర విశిష్టమైనదని, ఎన్సీసీ విధి విధానాలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా, ఆకర్షణీయంగా ఉంటాయని తెలిపారు. విద్యార్థుల్లో దేశభక్తి, కర్తవ్యబోధ, బాధ్యతా భావం పెంపొందించడంలో ఎన్సీసీ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

లెఫ్టినెంట్ కర్నల్ ఎ.కె. జయంత మాట్లాడుతూ... ఎన్సీసీ విధానాలు దేశ ప్రగతికి మూలస్తంభాలుగా నిలుస్తాయని తెలిపారు. విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే దేశం పట్ల ఉన్న బాధ్యతలు, హక్కులు, కర్తవ్యాలు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహించామని చెప్పారు. ఎన్సీసీ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ చక్కటి ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఎన్సీసీ ద్వారా దేశ రక్షణతో పాటు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కూడా తోడ్పాటు లభిస్తుందని తెలిపారు. ఈ శిబిరం ద్వారా విద్యార్థులకు విపత్తు నిర్వహణతో పాటు వివిధ అంశాలపై విస్తృత అవగాహన కల్పించబడింది. ప్రాయోగిక పద్ధతుల్లో నిర్వహించిన శిక్షణ, విన్యాసాలు విద్యార్థులకు విషయాన్ని స్పష్టంగా అర్థమయ్యేలా చేశాయి. ప్రత్యేకంగా స్విమ్మింగ్ పూల్‌లో రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం బృందం ఆధ్వర్యంలో రోప్ రెస్క్యూ టెక్నిక్స్ , థమిక సెర్చ్ అండ్ రెస్క్యూ విధానాలపై ప్రాయోగిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ విన్యాసాలు కేడెట్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషించాయి. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన కేడెట్లను సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత విజయాలు సాధించాలని వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారం రోజులపాటు శిబిరం నిర్వహణకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించిన అల్ఫోర్స్ విద్యాసంస్థల యాజమాన్యానికి ఎన్సీసీ అధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కర్నల్ ఎ.కె. జయంత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కర్నల్ వి. కృష్ణ , ఆఫిషియేటింగ్ సుబేదార్ మేజర్ జె. సూర్య ప్రసాద్, ఏఎన్ఓలు, జీసీఐలు, పీఐ సిబ్బంది, ఎన్సీసీ కేడెట్లు పాల్గొన్నారు.




## ఆశాలకు ఇచ్చిన హామీలు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే అమలు చేయాలి

### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ముషీరాబాద్, మార్చి 28 (జనం సాక్షి):**

ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని నిర్వహించిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని అడ్డుకోవడాన్ని, అరెస్టులకు, నిర్బంధానికి పాల్పడిన ప్రభుత్వ వైఖరిని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలోనే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ఆశా వర్కర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, వారి డిమాండ్స్ అన్నింటిని పరిష్కారం చేస్తామని అనేక హామీలు ఇచ్చిందనీ, అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సంవత్సరాల కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వివిధ రూపాల్లో అనేక ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారనీ, అయినా ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడంతో ఈ రోజు ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేయాలని అనుమతి కోరగా, అనుమతిస్తామని నిరాకరించారు.

నిర్బంధాలను ఆటంకాలను అధిగమించి వేలాది మంది చలో హైదరాబాదుకు చేరుకొని ఇందిరాపార్క్ వద్ద శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తుంటే పోలీసులు దౌర్జన్యంగా మహిళలను లాఠీలతో కొట్టి, గాయపర్చటం అమానవీయంమ న్నారు. గత బిఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయనీ, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన నిర్లక్ష్య వైఖరిని విడనాడి, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు ఫిక్స్ వేతనం రూ. 18 వేలు నిర్ణయించాలని, కేంద్ర ప్రభుత్వం పెంచిన రు.1500 ల పారితోషికాలను అమలు చేయాలని, ఇతర సమస్యల పరిష్కారం కోసం సరిపడా నిధులు కేటాయించాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తుందన్నారు. మార్చి 30న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో హైవే రహదారులపై ఆశాలు నిర్వహించే రాస్తారోకో కార్యక్రమానికి సిపిఐ(ఎం) మద్దతు తెలియజేస్తుందని ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు.

## సైబరాబాద్ క్లీన్‌స్వీప్ ప్రత్యేక డ్రైవ్‌కు అపూర్వ స్పందన

### సిఎంసి కమిషనర్ సృజన



**శేరిలింగంపల్లి, మార్చి 28 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం నిర్వహించిన చారిత్రాత్మక భారీ కార్యక్రమం సైబరాబాద్ క్లీన్ స్వీట్ డ్రైవ్ కు అన్ని వర్గాల నుండి అపూర్వ స్పందన లభించిందని సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి సృజన పేర్కొన్నారు. ఈ మేరకు గచ్చిబౌలి స్టేడియం వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమానికి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే తదితరులతో కలిసి పిఏసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై పచ్చజెండాను ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారితో కలిసి సీఎంసి కమిషనర్ మాట్లాడుతూ పటాన్ చెరువు నుండి మణికొండ వరకు దాదాపు 22 కిలోమీటర్లమేర ' సైబరాబాద్ క్లీన్ స్వీప్' పేరున స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టి ఒకేసారి ప్రధాన రహదారులన్నీ శుభ్రం చేయడం ఓ చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. 22 కిలోమీటర్ల దూరాన్ని ఏకతాటిగా 44 భాగాలుగా విభజించి శుభ్రంచేసి స్వీపింగ్ తోపాటు భవన నిర్మాణ వ్యర్థాలు, ఇతర చెత్తాచెదారం, ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉండిపోయిన మట్టి, ఇతర వ్యర్థాలను పూర్తిగా తొలగించి సి అండ్ డి వాహనాల ద్వారా తొలగించడం జరిగిందన్నారు. పటాన్చెరువు నుండి ప్రారంభమైన స్లీపింగ్, వ్యర్థాల లిఫ్టింగ్ బిహెచ్ఇఎల్, నల్లగండ్ల ఫ్లై ఓవర్, గచ్చిబౌలి, మల్కన్ చెరువు, ఖాజాగూడ జంక్షన్, లాంకో హిల్స్ మీదుగా మణికొండ వరకు కొనసాగిందన్నారు. ఈ భారీ కార్యక్రమంలో 128 మంది వివిధ స్థాయి అధికారులు పాల్గొనగా 716 మంది పారిశుద్ధ సిబ్బంది పాలు పంచుకోవడం జరిగిందని సిఎంసి కమిషనర్ వెల్లడించారు. ప్రతి 500 మీటర్లను ఒక యూనిట్ గా భావించి 15 మంది పారిశుద్ధ్య సిబ్బంది, వ్యర్థాల తరలింపుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి శుభ్రం చేసిన ప్రాంతంలోని చెత్తాచెదారం, ఇతరత్రా వ్యర్థాలను అప్పటికప్పుడు తరలించడం జరిగిందన్నారు. ఈ మాస్ కార్యక్రమంలో 129 మెట్రిక్ టన్నుల చెత్త, 142 మెట్రిక్ టన్నుల పూడిక, 455 మెట్రిక్ టన్నుల నిర్మాణ వ్యర్థాలు, 227 మెట్రిక్ టన్నుల హరిత వ్యర్థాలు ఆయా ప్రాంతాల నుండి సేకరించడం జరిగిందన్నారు. 65 చోట్ల నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయగా 25 ప్రాంతాలలో వదులుగా ఉన్న కేబుల్ లను సరి చేయడం జరిగిందన్నారు. 186 ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించగా పలుచోట్ల ఫుట్ పాత్ పరమరమ్మతులు, డివైడర్లకు పెయింటింగు, పలుచోట్ల ప్లాంటేషన్ తదితర కార్యక్రమాలను పూర్తి చేయడం పట్ల ప్రజల నుండి అపూర్వ ఆదరణ లభిస్తుందని, నేటి కార్యక్రమంతో జిహెచ్ఎంసి లో ఒక విప్లవాత్మక అడుగు ప్రారంభమైనట్లేనని, దీనిని స్ఫూర్తిగా తీసుకొని జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని ప్రాంతాలలో యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందని వక్తలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ విభాగం అడిషనల్ కమిషనర్ యాదగిరిరావు, హెల్త్ విభాగం అడిషనల్ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, శేరిలింగంపల్లి ఇన్చార్జి ఉప కమిషనర్ ఇస్లావత్ సేవియా, నాయకులు రఘునాథ్ రెడ్డి, మారబోయిన రాజు యాదవ్, గణేష్ ముదిరాజ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మంత్రి ప్రగడ సత్యనారాయణ, చింతకింది రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్ లీడర్స్-ఫిట్ స్టేట్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తాం

### రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్సింగ్

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న తెలంగాణ లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్.2026 కార్యక్రమం సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణరావు, ఎంపీ చామల కిరణ్, స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఫిట్ లీడర్స్-ఫిట్ స్టేట్ అనే నినాదంతో మార్చి 28, 29 తేదీల్లో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మక్కాను సూచించారు.

## సంక్షేమ హాస్టల్స్ నిర్వహణలో కట్టుదిట్టమైన చర్యలు





- వార్డెన్లు హాస్టల్‌లోనే ఉండాలి, స్టడీ అవర్స్‌లో అందుబాటులో ఉండాలి
- బడ్జెట్ పూర్తి వినియోగం, పిల్లల భోజన సమయంలో హాజరు కావాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, మార్చి 28 (జనంసాక్షి) :** సంక్షేమ హాస్టల్స్ నిర్వహణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో హాస్టల్ వార్డెన్లతో సమావేశం నిర్వహించిన కలెక్టర్, హాస్టల్ వార్డెన్లు తప్పనిసరిగా పిల్లలు భోజనం చేసే సమయంలో మరియు సాయంత్రం స్టడీ అవర్స్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. హాస్టల్‌లోనే వార్డెన్లు తప్పనిసరిగా ఉండాలని కూడా సూచించారు. మార్చి నెలాఖరు లోపు హాస్టల్స్‌కు కేటాయించిన బడ్జెట్ పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. 10వ తరగతి విద్యార్థుల పరీక్షలు ముగిసే వరకు స్టడీ అవర్స్ జరగాలని, ఏప్రిల్ 23 వరకు మిగిలిన తరగతి పిల్లలకు కూడా స్టడీ అవర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, ఏసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, హాస్టల్ వార్డెన్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**కేజీబీవీలో నాణ్యమైన ఆహారం, విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి**

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ధర్మారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ధర్మారం మండల తహసిల్దార్ కార్యాలయం, కేజీబీవీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ సకాలంలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, భూభారతి ఆన్‌లైన్ దరఖాస్తులు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఆదేశించారు. కేజీబీవీలో బాలికలకు నాణ్యమైన ఆహారం అందించాలని, ప్రతి ఒక్కరికీ మంచి విద్యా ప్రమాణాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కేజీబీవీ రినోవేషన్ పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు వెంట ఉన్నారు.

**రోడ్డు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలి**

ఆర్ అండ్ బీ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఆర్‌డబీ శాఖ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెద్దపల్లి-కాటారం పరిధిలో జరుగుతున్న రోడ్డు విస్తరణ, బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. లింగాపూర్ రోడ్డు విస్తరణ, మీడియన్, పైప్ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని, రోడ్డు విస్తరణ సమయంలో విద్యుత్ పోల్స్ తరలింపు పనులు ముగించాలని ఆదేశించారు. పెద్దపల్లి ఆర్‌డబీ గెస్ట్ హౌస్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనుల వివరాలు ఎంబీ రికార్డులలో నమోదు చేసి బిల్లులు సమర్పించాలని తెలిపారు.

మానేరు నది మీద చేపట్టిన బ్రిడ్జి టెండర్ త్వరగా పూర్తి చేయాలని, రోడ్ల నిర్మాణ సమయంలో త్రాగునీటి పైప్ లైన్లకు డ్యామేజీ జరగకుండా చూడాలని సూచించారు. మంథని గెస్ట్ హౌస్ నిర్మాణం, మంథని స్టేడియం నిర్మాణానికి అవసరమైన అనుమతులు త్వరగా సాధించాలని ఆదేశించారు. కునారం ఆర్‌డబీ అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా భూ సేకరణ పూర్తి చేసినందున ఇండ్లు, ఇతర నిర్మాణాల కూల్చివేత పనులు వేగంగా ముగించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఈఈ ఆర్ అండ్ బీ భావ్ సింగ్, డీఈలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో గవర్నర్ దంపతులు

### భద్రగిరి మార్ట్‌ను ప్రారంభించిన శుక్లా



భద్రాచలం,మార్చి 28 (జనంసాక్షి) : భద్రాచలంలో అంగరంగ వైభవంగా శ్రీరాముని పట్టాభిషేక మహోత్స వాన్ని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా దంపతులు తిలకించారు. బద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా సాగింది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా ఈ వేడుకకు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు,గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ ఉత్సవాన్ని తిలకించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు తొలిసారి వచ్చిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ప్రజా ప్రతినిధులు , అధికారులు ఘన స్వాగతం పలికారు. బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ హెలీప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి గవర్నర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ ఐటిడిఎ ఆధ్వర్యంలో భద్రాచలంలో - భద్రగిరి మార్ట్ ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. మార్ట్ లో విక్రయానికి ఉంచిన గిరిజన ఉత్పత్తుల గురించి భద్రాచలం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్, సహాయ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్ లు గవర్నర్ కు వివరించారు. గిరిజన ఉత్పత్తులను పరిశీలించి, పలు ఉత్పత్తులను గవర్నర్ దంపతులు కొనుగోలు చేశారు.

### శ్రీసీతరామ పట్టాభిషేకం వేడుకలో పాల్గొన్న గవర్నర్ శుక్లా


భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. వేలాది మంది భక్తుల సమక్షంలో జయ జయ నీరాజనాల మధ్య దేవదేవుడికి అర్చకులు సమస్త నదీ జలాలతో అభిషేకం చేశారు. ఈ పుణ్య జలాన్ని భక్తులపై చిలకరించి సమస్త లోకాలు శుభాలతో వర్ధిల్లాలని ఆశీస్సులు పలికారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ వేడుకకు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ ఉత్సవాన్ని తిలకించారు.

# మెట్రో విస్తరణకు అడ్డంకులపై సమీక్ష

హైదరాబాద్ (జనంసాక్షి) : విశాల ప్రజా ప్రయోజనాల దృష్ట్యా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)కు మెట్రో నెట్‌వర్క్ విస్తరించాలనే వివిధ వర్గాల డిమాండ్ మేరకు మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విస్తరణకు ఉన్న అడ్డంకులను, ఎదురవుతున్న ఇబ్బందులను లోతుగా సమీక్షించింది. ప్రస్తుతమున్న మెట్రో ఫేజ్ 1 మొత్తం 69 కిలోమీటర్లు ఉంది. ఫేజ్ 2(ఏ) 76.4 కిలోమీటర్లు, ఫేజ్ 2 (బీ) 86.1 కిలోమీటర్ల మేర విస్తరణ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. హైదరాబాద్ మెట్రో విస్తరణకు ప్రస్తుతం ఉన్న ప్రత్యేక పరిస్థితిని సభ ముంచుంచింది. ఫేజ్-1 ప్రైవేట్ నిర్వహణలో ఉండగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఫేజ్-2 ప్రభుత్వ ప్రాజెక్టుగా చేపట్టేందుకు ఎదురవుతున్న సాంకేతిక, చట్టపరమైన, నిర్వహణ సమస్యలను దృష్టిలోకి తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన అంశాలను పరిష్కరించేందుకు ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్ 1 నెట్‌వర్క్ ను రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎంఆర్ఎల్ ద్వారా స్వాధీనం చేసుకునే నిర్ణయాన్ని ఈ సభ ఆమోదిస్తుంది. మెట్రో ఫేజ్-1 స్వాధీనం చేసుకునే ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను గౌరవ సభ సమర్థించి, పూర్తి మద్దతు ప్రకటిస్తున్నది. ఫేజ్-2 విస్తరణకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం త్వరగా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కృషి చేయాలని ఈ సభ కోరుతోంది.

# వారం రోజుల వ్యవధిలో ఇద్దరు ఉద్యోగులు మృతి

### ఆకస్మిక గుండెపోటుతో మృతిపై ఆందోళన




హైదరాబాద్, మార్చి28 (జనంసాక్షి) : హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ స్థాయి వ్యవసాయ పరిశోధన, విద్యా నిర్వహణ సంస్థలో వరుస గుండెపోటు మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఉద్యోగులు మరణించడం అక్కడి సిబ్బందిని దిగ్భ్రాంతికి గురిచేసింది. తాజాగా శుక్రవారం రాత్రి అనిల్ కుమార్ అనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి మరణించాడు. బిహార్‌కు చెందిన అనిల్ కుమార్ ట్రైనింగ్ నిమిత్తం హైదరాబాద్‌లోని నార్మ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలాడు. అతనికి చికిత్స అందించేలోపే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. గత ఆదివారం కూడా నార్మ్‌లో విషాదం చోటుచేసుకుంది. సైంటిస్ట్ దామోదర్ రాత్రి భోజనం చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుతో మరణించాడు. ఇలా వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఉద్యోగులు గుండెపోటుతో మరణించడంతో నార్మ్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

# మారనున్న ఆస్కార్ వేడుకల వేదిక

లాస్‌ఏంజిల్స్, మార్చి28 (జనంసాక్షి) : ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'అకాడమీ అవార్డ్స్' ఆస్కార్ ఒక చారిత్రాత్మక మార్పునకు సిద్ధమవుతోంది. దశాబ్దాలుగా హాలీవుడ్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకలు, 2029 నుంచి లాస్ ఏంజిల్స్ డౌన్‌టౌన్‌లోని కొత్త వేదికకు మారనున్నాయి. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రకటించిన వివరాల ప్రకారం, 2029 నుంచి 2039 వరకు పదేళ్ల పాటు ఈ వేడుకలు లాస్ ఏంజిల్స్ లైవ్ కాంప్లెక్స్‌లోని 'పీకాక్ థియేటర్'లో జరగనున్నాయి. ప్రముఖ వినోద సంస్థ తో అకాడమీ ఒప్పందం కుదుర్చుకుంది. 2001 నుంచి ఆస్కార్ వేడుకలకు ఆతిథ్యం ఇస్తున్న హాలీవుడ్ బౌలేవార్డ్ లోని 'డాల్బీ థియేటర్' యుగం, 2028లో జరగబోయే 100వ వార్షికోత్సవ వేడుకలతో ముగియనుంది. అప్పటివరకు ఈ వేడుకలు ఎబిసి ఛానల్‌లోనే ప్రసారమవు తాయి. 2029 నుంచి 2033 వరకు జరిగే ఆస్కార్ వేడుకల ప్రసార హక్కులను యూట్యూబ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. దీనివల్ల రెడ్ కార్పెట్, తెరవెనుక విశేషాలు మరియు ప్రధాన వేడుక వంటివన్నీ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినిమా అభిమానులు యూ ట్యూబ్‌లో ఉచితంగా వీక్షించే అవకాశం కలగ నుంది. అత్యాధునిక సాంకేతికత కలిగిన వేదికపై సినిమా పండుగను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవ డానికి ఈ మార్పు ఎంతో దోహదప డుతుం దని అకాడమీ ప్రతినిధులు పేర్కొన్నారు.

# మరోమారు పెరిగిన బంగారం ధరలు

న్యూఢిల్లీ, మార్చి 28 (జనంసాక్షి) : పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి ధరల్లో అంచనాలకు అందని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గత రెండు రోజులుగా ధరల్లో ఓ మోస్తరు మార్పులు కనిపించినప్పటికీ నేడు అనూహ్యంగా భారీ స్థాయిలో ధరలు పెరిగాయి. భారత్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర సగటున రూ.2,500 మేర పెరిగింది. కిలో వెండి ధరలో రూ.5 వేల మేర పెరుగుదల కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (మార్చి 28) ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090కు చేరుకుంది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధర రూ.2,510 మేర పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.2,300ల మేర పెరిగి రూ.1,35,750కు చేరుకుంది. కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే రూ.5 వేల మేర ఎగబాకింది. ప్రస్తుతం రూ.2.5 లక్షల వద్ద కొనసాగుతోంది. ఇక అంతర్జాతీయ మార్కెట్ లో ప్రస్తుతం ఔన్స్ 24 క్యారెట్ల పసిడి ధర 4,492 డాలర్ల వద్ద కదలాడుతోంది.

# చంద్రబాబు పాలనంటేనే దుర్మార్గం

### జర్నలిస్టు కేవీఆర్‌పై దాడి గర్హనీయం


- సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి
- తెలంగాణపై ఆంధ్ర పెత్తనాన్ని నిరసిస్తూ 'తెలంగాణ సమాఖ్య' ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం



హైదరాబాద్ (జనంసాక్షి) : చంద్రబాబు పాలన అంటేనే దుర్మార్గమని, తెలంగాణ బిడ్డలను పొట్టనపెట్టుకున్న రాక్షసుడు అని, అందులో భాగంగానే జర్నలిస్టు కేవీఆర్‌పై దాడి జరిగిందని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి అన్నారు. ఆంధ్రాలో కూటమి సర్కారు అరాచకాలు, తెలంగాణపై ఆంధ్ర పెత్తనాన్ని నిరసిస్తూ 'తెలంగాణ సమాఖ్య' ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ మధ్యనే తెలంగాణ పౌరుడు-జర్నలిస్ట్ కేవీఆర్ పై ఆంధ్ర పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సంగతి తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన కేసు ఇది. చట్టాన్ని, న్యాయస్థానాలను గౌరవించి కర్నూల్ 4వ టౌన్ పోలీస్ స్టేషన్ కి వెళ్లిన కేవీఆర్ ని 24 గంటలకు పైగా స్టేషన్ లో నిర్బంధించి తీవ్రంగా హింసించారు. కేవీఆర్ భార్య విజయలక్ష్మి హెబీయస్ కార్పస్ పిటిషన్ వేయడంతో విడిచిపెట్టారు. కేవీఆర్ అరెస్టు-రిలీజ్ విషయంలో అడుగడుగునా పోలీసులు చట్టాన్ని ఉల్లంఘించారు. ఆంధ్రాలో కూటమి ప్రభుత్వం అన్యాయాలపై, అసమర్థ-అరాచక-ప్రజా వ్యతిరేక పాలనపై ప్రశిస్తు వచ్చిన కేవీఆర్ పై పాలకులు పగబట్టారు. ఈ క్రమంలోనే విచారణకు హాజరైన కేవీఆర్ పై కూటమి సర్కారు, ఆంధ్ర పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించారు. ఇది ఒక్క కేవీఆర్ పై జరిగిన దాడి కాదు. తెలంగాణ అస్థిత్వంపై జరిగిన దాడిగా తెలంగాణ ఉద్యమకారులు, జర్నలిస్టులు, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ప్రశ్న గొంతు నొక్కడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే జర్నలిస్ట్ సమాజం ఏకం కావాల్సిందేనని పిలుపుని చ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ 'చంద్రబాబు పాలన అంటేనే దుర్మార్గం. గతంలో బెల్లి లలిత, మరోజు వీరన్న, గద్దర్ లాంటి ఎంతో మంది తెలంగాణ బిడ్డలను, ఉద్యమకారులను పొట్టనపెట్టుకున్న నరరూప రాక్షసుడు చంద్రబాబు. జర్నలిస్ట్ కేవీఆర్ పై జరిగిన దాడి కూడా అలాంటిదే. బిడ్డ చంద్రబాబు తెలంగాణ బిడ్డలపై నీ జులుం ఆపకపోతే మరోసారి తెలంగాణ సత్తా చూపిస్తాం. రాష్ట్రం విడిపోయినా తెలంగాణపై చంద్రబాబు పెత్తనం తగ్గలేదని, రేవంత్ ప్రభుత్వం ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకోవాలి" అని తీవ్రంగా విరుచుకుపడ్డారు. తెలంగాణ సమాఖ్య కన్వీనర్ కరుణాకర్ దేశాయి మాట్లాడుతూ "ఆంధ్ర-తెలంగాణ విడిపోయినా చంద్రబాబు పెత్తనం తగ్గలేదని ఇప్పటికి తెలంగాణా భూముల్ని తన సామజిక వర్గాన్ని దోచిపెట్టేలా వ్యవరిస్తున్నా డని విమర్శించారు. బాబు పాలనపై గొంతెత్తితే కేవీఆర్ లాంటి జర్నలిస్టుని ఎలా గొంతు నొక్కే ప్రయత్నం చేసారో గమనించాలని తెలంగాణ సమాజం ఇప్పటికైనా మేల్కోకపోతే మరింత నష్టపోతామ" అని హెచ్చరించారు. సినీ నిర్మాత డైరెక్టర్ సైయద్ రఫీ మాట్లాడుతూ "జర్నలిస్ట్ కేవీఆర్ పై జరిగిన దాడి తెలంగాణ అస్తిత్వంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నాం. కేవీఆర్ పై పెట్టిన కేసును 24 గంటలలోగా మూసేసి క్షమాపణ చెప్పకపోతే తెలంగాణ సత్తా ఏంటో చూపిస్తాం" అని హెచ్చరించారు. తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షులు పల్లె రవికుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్రలో, తెలంగాణ అస్తిత్వంపై అతి కిరాతకంగా దాడి చేసిన వాడు ఎవడన్నా ఉన్నడంటే వాడు చంద్రబాబే, నేనిది నిర్మొహమాటంగా చెప్తున్నా. అసెంబ్లీలో తెలంగాణ పదాన్నే నిషేదించిన దుర్మార్గుడు చంద్రబాబు. తెలంగాణా భోళాతనం, నిర్మొహమాటం, ప్రశ్నించేతత్వం ఈనాటిది కాదు. ఈ గడ్డ మట్టిలోనే అది ఉంది. అది దేశం ఎప్పుడో గుర్తించింది. ఈ గడ్డ నైజాన్ని అణగదొక్కేందుకు జర్నలిస్టులపై దాడులకు తెగబడుతున్నాడు. అందులో భాగంగా జర్నలిస్ట్ కేవీఆర్ పై జరిగిన దాడి అలాంటిదే" అని అన్నారు. క్రాంతిదళ్ పార్టీ ఫౌండర్ పృథ్వీ రాజ్ మాట్లాడుతూ.. "జర్నలిస్ట్ కేవీఆర్ పై జరిగిన దాడి తెలంగాణ ఆత్మగౌరవంపై జరిగిన దాడి. ఇది చిన్న అంశం కాదు. చాల సున్నితమైన అంశం. జర్నలిస్ట్ అంటేనే ప్రశ్న. వాళ్ళ గొంతు నొక్కుతమంటే సూస్తూ ఊరుకునేది లేదు. జర్నలిస్టుల హక్కులని కాపాడలేని రేవంత్ రెడ్డి ఇక తెలంగాణ ప్రజల హక్కులను ఎం కాపాడుతడు. బిడ్డా చంద్రబాబు తెలంగాణ ఒక్కసారి గర్జిస్తేనే రాష్ట్రము దాటెల్లిపోయినవ్. మల్ల మాజోలికొస్తే ఈసారి చీరి చింతకు కడతం" అని హెచ్చరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ ఉద్యమ కారుడు హైకోర్టు అడ్వకేట్ మల్లారెడ్డి, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం ఉపాధ్యక్షుడు ప్రో. పిట్టల రవిబాబు, మన తొలివెలుగు రఘు, కాళోజి టీవీ ఓనర్ దాసరి శ్రీనివాస్, , జర్నలిస్ట్ శంకర్ తో పాటు డిజిటల్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# అయోధ్య యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం

- అగ్నికి ఆహుతి అయిన పందిళ్లు
- ప్రమాదంలో ప్రాణనష్టం లేదని వివరణ



అయోధ్య, మార్చి 28 (జనంసాక్షి) : అయోధ్యలోని యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రాజ్‌ఘాట్‌లో బటి బాబా ఆశ్రమం సమీపంలో ఉన్న మహాలక్ష్మి నారాయణ యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పెద్ద పెద్ద పందిళ్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. 10 అగ్నిమాపక వాహనాలు రెండు గంటల్లోనే మంటలను అదుపులోకి తెచ్చాయి. అగ్ని ప్రమాదంలో ఎవరూ ప్రాణాలు కోల్పోలేదని ఉత్తర ప్రదేశ్ రవాణా శాఖ మంత్రి దయాశంకర్ సింగ్ అన్నారు. మార్చి 20 నుంచి మార్చి 28 వరకు యజ్ఞం జరిగిందని.. తొమ్మిది రోజుల పాటు జరిగిన మహాయజ్ఞం ముగిశాక ఈ అగ్నిప్రమాదం జరిగిందని వెల్లడించారు. యజ్ఞశాల ఖాళీగా ఉన్న సమయంలో ఈ ఘటన జరిగిందని.. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. కానీ లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు చెప్పారు. దాదాపు ఎకరం విస్తీర్ణంలో ఉన్న యజ్ఞశాల నిమిషాల వ్యవధిలోనే బూడిదైపోయింది. ఈ భారీ అగ్నిప్రమాదం రామ మందిరానికి కేవలం 800 మీటర్ల దూరంలో జరిగింది. శనివారం ఉదయం సుమారు 11:30 గంటలకు పూర్ణాహుతితో యజ్ఞం ముగియగానే.. భక్తులు ఇళ్లకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం తర్వాత ఈ ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణం ఇంకా స్పష్టంగా తెలియరాలేదని, దర్యాప్తు చేసేందుకు ఒక సాంకేతిక బృందాన్ని పంపుతామని మంత్రి తెలిపారు. యంత్రాంగం ఈ విషయంపై దర్యాప్తు చేస్తోందని, అసలు కారణం త్వరలోనే వెల్లడయ్యే అవకాశం ఉందన్నారు.

### గోదావరిలోకి దూకి తల్లీబిడ్డల
# ఆత్మహత్యాయత్నం
### వెంటనే నదిలోకి కాపాడిన మత్స్యకారులు

భద్రాచలం, మార్చి28 (జనంసాక్షి) : భద్రాచలం గోదావరి వంతెన పై శనివారం మధ్యాహ్నం తీవ్ర కలకలం రేగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ఓ మహిళ తన చిన్నారితో సహా వంతెనపై నుంచి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం పాల్వంచకు చెందిన ఆ మహిళ శనివారం మధ్యాహ్నం తన బిడ్డతో కలిసి భద్రాచలం గోదావరి వంతెన వద్దకు చేరుకుని చిన్నారితో సహా నదిలోకి దూకింది. గమనించిన ప్రయాణికులు, స్థానికులు ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులు వారిని వెంటనే కాపాడారు. క్షేమంగా తల్లీబిడ్డను బయటకు తీసుకువచ్చి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం వారిద్దరి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.

# బీఆర్ఎస్ ఆడే పోటీలను నిర్వహించలేం

- మత్తు వదిలించుకోవడానికే మైదానానికి రమ్మన్నాం
- వారు ఆడలేమంటే..వారి ఆటలు పెట్టలేం కదా
- క్రీడాపోటీల్లో పాల్గొనడం లేదన్న కెటిఆర్ వ్యాఖ్యలపై వాకిటి కౌంటర్




హైదరాబాద్, మార్చి 28 (జనంసాక్షి) : తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో తాము పాల్గొనబోమంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి వాకిటి శ్రీహరి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మత్తు వదిలించుకోవడానికే మైదానంలోకి రమ్మంటున్నామని ఎద్దేవా చేశారు. మైదానంలోకి తాము రామంటూ కేటీఆర్ అంటుంటే ఏం చేయగలమని అన్నారు. 'మావి వేరే గేమ్స్, కేటీఆర్‌వి మరో రకమైన గేమ్స్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీఆర్ఎస్ వాళ్లు ఆడే గేమ్స్ పెట్టడం సాధ్యం కాదు కదా? అంటూ మంత్రి వాకిటి శ్రీహరి చురకలు అంటించారు. తాము ఫిట్ తెలంగాణ కోసం ప్రయత్నం చేస్తున్నామని.. ఆరోగ్య తెలంగాణ ఉండాలని సీఎం ఆలోచన చేస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రజాప్రతినిధులు క్రీడలు ఆడడం వల్ల విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో పిల్లలకు డ్రగ్స్ వంటి ఆలోచనలు రాకుండా ఆటల వైపు మళ్లుతారని వాకిటి పేర్కొన్నారు. కాగా, నేటి నుంచి రెండ్రోజులపాటు జరిగే లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్-2026లో తమ పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పాల్గొనరంటూ ఎమ్మెల్యే కేటీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా క్రీడా పోటీలు అవసరమా? అంటూ ప్రశ్నించారు. శాసనసభ సమయం వృథా చేయడం తగదని.. కనీసం ఇంకో 10 రోజులు సమావేశాలను కొనసాగించాలని అన్నారు. దీనిపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందిస్తూ పైవిధంగా కౌంటర్ ఇచ్చారు.

### ఆటోలో ఎక్కిన యువతిపై
# డ్రైవర్ అత్యాచారం

విజయవాడ, మార్చి 28 (జనంసాక్షి) : ఆటో ఎక్కిన యువతిపై డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. యువతి వెళ్లాల్సిన ప్రాంతానికి కాకుండా బలవంతంగా కృష్ణలంక వైపునకు తీసుకెళ్లాడు కామాంధుడు. భయభ్రాంతులకు గురి చేసి ఎవరూ లేని ప్రదేశానికి లాక్కెళ్లాడు. అనంతరం యువతిపై అత్యాచారానికి ఒడికట్టాడు. ఆ తర్వాత ఆమెను అక్కడే వదిలిపెట్టి ఆటోతో సహా పరారయ్యాడు. ఏడుస్తూ ఇంటికి వెళ్లిన బాధితురాలు జరిగిన విషయం తల్లికి చెప్పింది. షాక్‌కు గురైన బాధిత కుటుంబం మాచవరం పోలీసులను ఆశ్రయించారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ పోలీస్

- అసెంబ్లీలో హోం శాఖపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో శాంతిభద్రతలు అత్యంత సక్రమంగా నిర్వహించబడుతున్నాయని, మతపరమైన పరిస్థితులు పూర్తిగా ప్రశాంతంగా ఉన్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో ప్రకటించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి హోం శాఖ బడ్జెట్ డిమాండ్లపై చర్చకు సమాధానమిస్తూ, తెలంగాణ పోలీసుల సమగ్ర పనితీరును ఆయన వివరించారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, బోనాలు, గణేష్ నిమజ్జనం, రంజాన్, మొహర్రం వంటి భారీ పండుగలతో పాటు మేడారం జాతరను కూడా పటిష్ట బందోబస్తుతో విజయవంతంగా పూర్తి చేశామని, వరదల సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి వేలాది మందిని రక్షించిన పోలీసుల సేవలు అమోఘమని కొనియాడారు. భారీ సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారని, ఇందులో దేవ్ జి, మల్లా రాజిరెడ్డి వంటి అగ్రనేతలు ఉన్నారని వెల్లడించారు. పెద్ద సంఖ్యలో మావోయిస్టులు డిజిపి ఎదుట లొంగిపోవడం రాష్ట్రంలో మారుతున్న పరిస్థితులకు అద్దం పడుతోందన్నారు. లొంగిపోయిన వారిలో ఇతర రాష్ట్రాల వారు కూడా ఉన్నారన్నారు. రాష్ట్ర రాజధాని విస్తరణకు అనుగుణంగా 'ఫ్యూచర్ సిటీ కమిషనరేట్'ను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. సైబర్ నేర బాధితుల కోసం 'సి-మిత్ర' వర్చువల్ హెల్ప్ డెస్క్, మహిళల భద్రత కోసం 'టీ-సేఫ్' యాప్ వంటి వినూత్న సాంకేతికతను అందుబాటులోకి తెచ్చామన్నారు. మిస్ వరల్డ్ కార్యక్రమం, గ్లోబల్ సమ్మిట్, మెస్సి పాల్గొన్న ఫుట్‌బాల్ మ్యాచ్ వంటి అంతర్జాతీయ స్థాయి ఈవెంట్‌లకు పటిష్ట భద్రత కల్పించామని గుర్తుచేశారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ కోసం రూపొందించిన 'వెరీ ఫాస్ట్ యాప్'కు జాతీయ గుర్తింపు లభించిందని శామీర్ పేట పోలీస్ స్టేషన్ దేశంలోనే 7వ ఉత్తమ స్టేషన్‌గా నిలిచిందని ప్రకటించారు. పోలీసు సిబ్బంది పిల్లల కోసం 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్'ను ప్రారంభించామని, 30 వేల మంది సిబ్బందిని గ్రాడ్యుయేట్లుగా మార్చేందుకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కోసం 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని, పర్యాటకుల కోసం కొత్తగా 'టూరిస్ట్ పోలీస్' విభాగాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ కూడా తెలంగాణ పోలీసుల పనితీరును ప్రశంసించిందని మంత్రి గుర్తు చేశారు. అగ్నిమాపక శాఖను 'తెలంగాణ అగ్నిమాపక, విపత్తు ప్రతిస్పందన, అత్యవసర మరియు పౌర రక్షణ శాఖ'గా మారుస్తూ ఆధునీకరించామన్నారు. 147 ఫైర్ స్టేషన్ల ద్వారా వేలాది మంది ప్రాణాలను కాపాడామని, భారీ భవనాల కోసం 104 మీటర్ల హైడ్రాలిక్ ప్లాట్‌ఫామ్‌లను సేకరిస్తున్నామని చెప్పారు. జైళ్ల శాఖలో 'మిషన్ పరివర్తన' ద్వారా ఖైదీల సంస్కరణకు పెద్దపీట వేస్తున్నామని, 22 మార్చి నాడు సిద్దిపేటలో నూతన జిల్లా జైలును ప్రారంభించామని తెలిపారు. ఖైదీల్లో మత్తు అలవాట్లను మాన్పించేందుకు 'నివృత్తి' కేంద్రాలను, చదువుకునే వారి కోసం ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని, మాజీ సైనికులు మరియు 100% వైకల్యం కలిగిన సైనికుల సంక్షేమం కోసం భారీగా నిధులు కేటాయించామని మంత్రి తెలియజేశారు. పేద ఖైదీలకు బెయిల్ మరియు జరిమానాల చెల్లింపులో సహాయం చేసే పథకాన్ని కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370